

పద్నాలుగు వందల నలభై రెండు నిమిషాలు
రూ॥100/- పేజీలు:96
నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


బిఆర్ఎస్ కాదు బిఆర్ఎస్ఎస్
కృత్రిమ మేధతో భారత్‌లో ఉద్యోగాలకు ముప్పు
ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదల
లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 48 | గురువారం | 16-01-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## తెలంగాణకు నీటి కేటాయింపులలో బలమైన వాదనలు

- ఐఎస్ఆర్‌డబ్ల్యూడిఎ-1956 సెక్షన్ 3ని పరిగణనలోకి తీసుకోవాలి
- గోదావరి-బనకచర్లపై అభ్యంతరాలతో జలశక్తి మంత్రి, ఎపి ముఖ్యమంత్రికి లేఖలు
- పోలవరం ముంపుపై నిర్దేశిత సమయంలో ఐఐటితో అధ్యయనం
- నీటి పారుదల శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణకు అంతర్‌రాష్ట్ర నదీ జలాల వివాద చట్టం (ఐఎస్ఆర్‌డబ్ల్యూడిఎ)1956 సెక్షన్ 3 ప్రకారం నీటి కేటాయింపులు చేపట్టాలనే విషయంపై కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్2 (కెడబ్ల్యూడిటి2) ఎదుట బలమైన వాదనలు వినిపించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం (ఎపిఆర్‌ఎ)2014లోని సెక్షన్ 89 ప్రకారం ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఎపిఆర్ఎ ప్రకారం ఏర్పాటైన అపెక్స్ కౌన్సిల్ సైతం సెక్షన్ 3 ఆధారంగా నీటి పంపకాలు రెండు రాష్ట్రాల మధ్య చేపట్టాలని సూచించిందని సిఎం తరువాయి 2లో




## భాగవత్ వ్యాఖ్యలు దేశ ద్రోహమే

రాహుల్ గాంధీ ధ్వజం
స్వాతంత్ర్య ఉద్యమాన్ని, రాజ్యాంగాన్ని అవమానించిన ఆర్.ఎస్.ఎస్. చీఫ్ : సిపిఐ

**న్యూఢిల్లీ :** భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఎంతో మంది నాయకులు, ప్రజలను ఉద్దేశించి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని, వాటిని ముమ్మాటికీ దేశ ద్రోహం కిందే పరిగణించాల్సి ఉంటుందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఎఐసిసి నూతన కార్యాలయం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, అనంతరం మీడియాతో మాట్లాడుతూ, అయోధ్యలో రామమందిరం ప్రతిష్టాపన రోజునే భారత్ నిజమైన స్వాతంత్ర్యాన్ని పొందిందని భగవత్ చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. దేశంలో ఇప్పుడు రాజ్యాంగ సిద్ధాంతం... ఆర్ఎస్ఎస్ భావజాలం మధ్య యుద్ధం తరువాయి 2లో

## కాంగ్రెస్ పార్టీకి కొత్త కార్యాలయం

'ఇందిరా భవన్' ప్రారంభం

**న్యూఢిల్లీ :** సుమారు 47 సంవత్సరాలుగా న్యూఢిల్లీలోని 24 అక్బర్ రోడ్డులో ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికారిక కేంద్ర కార్యాలయం 9ఎ, కోట్లా రోడ్డులోని ఆరు అంతస్థుల అత్యాధునిక భవనంలోకి మారింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేత సోనియా గాంధీ ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. 'ఇందిరా గాంధీ భవన్'గా పేరు పెట్టిన ఈ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి చీఫ్ తరువాయి 2లో

## ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో కీలక పరిణామం ఎఐటియుసికి అనుబంధంగా ఎన్‌టియుఐ



(ఫైల్ ఫొటో)

చెన్నైలో జరిగిన జనరల్ అసెంబ్లీలో తీర్మానం
ఎఐటియుసి, ఎన్‌టియుఐ ప్రధాన కార్యదర్శులు అమర్‌జీత్ కౌర్, గౌతమ్ మోదీ ఉమ్మడి ప్రకటన
ఇతర కార్మిక సంఘాలు ఒక్కటవ్వాలని ఉద్ఘాటన

**న్యూఢిల్లీ :** వర్తమాన ట్రేడ్ యూనియన్‌ల చరిత్రలో కీలక పరిణామం చోటు చేసుకుంది. కార్మిక వర్గంపై పెట్టుబడిదారి వ్యవస్థ, కార్పొరేట్, ప్రైవేటు రంగాల దాడులు ఉధృతమవుతున్న నేపథ్యంలో కార్మిక సంఘాల ఐక్యతకు ముందడుగు పడింది. స్వాతంత్ర్యానికి పూర్వం ఏర్పడిన ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి)కి అనుబంధంగా ఉండాలని నేషనల్ ట్రేడ్ యూనియన్ ఇనిషియేటివ్(ఎన్‌టియుఐ) నిర్ణయించింది. ఈ విషయాన్ని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్, ఎన్‌టియుఐ ప్రధాన కార్యదర్శి గౌతమ్ మోదీలు మంగళవారం విడుదల చేసిన ఉమ్మడి పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించారు. ఈ మేరకు చెన్నైలో గత ఏడాది డిసెంబర్ 19—22 తేదీలలో జరిగిన ఎన్‌టియుఐ ఐదవ జనరల్ అసెంబ్లీ సమావేశం ఎఐటియుసికి అనుబంధంగా ఉండేందుకు ఓటేసిందని వారు తెలిపారు. పెట్టుబడిదారి తరువాయి 2లో

ఎన్నికల తరుణంలో...

## కేజ్రీవాల్‌ను విచారించేందుకు కేంద్ర హోంశాఖ అనుమతి



**న్యూఢిల్లీ :** ఢిల్లీ ఎక్సైజు విధానంలో అరవింద్ కేజ్రీవాల్‌ను విచారణ చేయడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ డి) కు కేంద్ర హోంమంత్రిత్వశాఖ అనుమతి అభించింది. ఢిల్లీ రాష్ట్ర అసెంబ్లీకి మరో ఇరవై రోజుల్లో పోలింగ్ జరగనున్న తరుణంలో ఇడి ఈ విషయం వెల్లడించింది. ఎక్సైజు విధానంలో అవినీతికి పాల్పడి ఆ ధనాన్ని లెక్కల్లో చూపించకుండా అక్రమంగా ఇతర మార్గాల్లో తరలించారని, ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారని కేజ్రీవాల్‌పై అభియోపత్రం ద్వారా న్యాయస్థానంలో విచారణను ముందుకు తీసుకువెళ్ళడానికి వీలుగా కేజ్రీవాల్‌ను విచారణ చేసేందుకు కేంద్ర హోం శాఖ ఈ అనుమతి మంజూరు చేసిందని అధికారులు బుధవారం నాడు చెప్పారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా కేజ్రీవాల్‌కు ఇదే పరిస్థితి ఎదురైంది. ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా ఆయనకు మళ్ళీ అదేపరిస్థితి తీసుకువచ్చారు. గత ఏడాది మార్చినెలలో లోక్‌సభ ఎన్నికలకు ముందుగా కేజ్రీవాల్‌ను ఫెడరల్ ఏజన్సీ అధికారులు అరెస్టు చేశారు. పిఎంఎల్‌ఎ ప్రత్యేక న్యాయస్థానం తరువాయి 2లో



సిపిఐ నారాయణపేట జిల్లా కార్యదర్శి

## కొండన్న మృతి

**హైదరాబాద్ :** గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సిపిఐ నారాయణపేట జిల్లా కార్యదర్శి మంగళవారం మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించారు. సిపిఐ తో పాటు, ఎఐటియుసిలో ఆయన ప్రధాన బాధ్యతలు పోషించారు.తన చిన్ననాటి నుండి చివరి శ్వాస వరకు పీడిత, తాడిత ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా నాయకత్వం అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించారు. కొండన్న అంత్యక్రియలు మక్తల్ మండలం దాసరపల్లిలో తరువాయి 2లో

## కెటిఆర్ క్వాష్ పిటిషన్ కొట్టివేత



సుప్రీం కోర్టులో చుక్కెదురు
ఈ—కార్ రేసు కేసులో నేడు ఇడి విచారణకు మాజీ మంత్రి

**న్యూఢిల్లీ/ హైదరాబాద్:** ఫార్ములా ఈ—కార్ రేసు కేసులో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ మాజీ మంత్రి కెటిఆర్‌కు చుక్కెదురైంది. ఆయన సమర్పించిన క్వాష్ పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఇందులో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. కాగా, ఈ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) విచారణకు ఆయన గురువారం హాజరుకానున్నారు. ఫార్ములా ఈ—కార్ రేసు వ్యవహారంలో అధికార దుర్వినియోగం, భారీగా నగదు చేతులు మారడం వంటి అవకతవకలు జరిగాయంటూ ఆరోపణలు వెల్లువెత్తగా, కెటిఆర్‌పై ఎసిబి కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు నుంచి తనను తప్పించాలని కోరుతూ కెటిఆర్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిని హైకోర్టు తిరస్కరించింది. దీనితో ఆయన సుప్రీం కోర్టు మెట్లు ఎక్కారు. రాజకీయ కక్ష సాధించడానికే తనపై కేసు నమోదు చేశారని ఆయన తరఫు న్యాయవాది సుందరం సుప్రీం కోర్టుకు విన్నవించారు. ప్రస్తుతం ఆయన తెలంగాణ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్నారని, అందుకే కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. హైకోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలని కోరారు. న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం. త్రివేది, జస్టిస్ ప్రసన్న వర్లెతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ప్రతిపక్ష నేతగా ఉండడానికి, కేసుకు సంబంధం ఏమిటని జస్టిస్ బేలా త్రివేది ప్రశ్నించారు. ఈ కేసులో జోక్యం చేసుకోబోమని పేర్కొంటూ, పిటిషన్‌ను సుప్రీం కోర్టు ధర్మాసనం కొట్టివేసింది. ఈ ఉత్తర్వులు వెలువడిన తర్వాత, పిటిషన్‌ను విత్‌డ్రా చేసుకుంటున్నట్టు కెటిఆర్ తరఫు లాయర్ ప్రకటించారు. తిరిగి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేసే అవకాశం కల్పించాలని సుప్రీం కోర్టును కోరారు. కానీ, అందుకు తరువాయి 2లో

క్రొయేషియా అధ్యక్షుడిగా

## వామపక్ష అభ్యర్థి తిరిగి ఎన్నిక



**జాగ్రెబ్ :** సెంట్రల్—ఆగ్నేయ యూరోపియన్ దేశం క్రొయేషియాలో సోషల్ డెమోక్రటిక్‌పార్టీ (ఎస్‌డిపి) తరపున మళ్ళీ దేశాధ్యక్ష పదవికి పోటీపడిన జోరాన్ మిలనోవిక్ తుది విడత (రన్నాఫ్) జరిగిన ఎన్నికల్లో 74.69 శాతం భారీ మెజారిటీ ఓట్లతో విజయం సాధించారు. ఈనెల 12వ తేదీన అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. వచ్చే నెల అంటే ఈ ఏడాది ఫిబ్రవరి 23వ తేదీన జర్మనీలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నవేళ అక్కడ కూడా ప్రజాభిప్రాయం మితవాదానికి వ్యతిరేకంగా ఉంది. వరుసగా రెండోసారి కూడా జోరాన్ మిలనోవిక్ క్రొయేషియా దేశాధ్యక్ష పదవి చేపట్టడంతో ఇప్పుడు యూరప్ అంతటా రాజకీయవర్గాల్లో ఆయన విజయమే ఒక పెద్ద విషయంగా మారి చర్చనీయాంశమైంది. పచ్చి మితవాద కన్జర్వేటివ్‌పార్టీ అభ్యర్థి డ్రాగన్ ప్రిమోరాక్‌పై 74.69 శాతం ఓట్లతో మిలనోవిక్ రెండోసారి క్రోయేషియా దేశాధ్యక్షుడుగా ఘన విజయం సాధించారు. మిలనోవిక్ చేతిలో పరాజయం పొందిన డ్రాగన్ ప్రిమోరాక్‌కు కాబోయే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆశీర్వాదాలు, ఆయన శిబిరం పూర్తి మద్దతు ఉన్నాయి. జర్మనీలోకి వలస ప్రజల రాకను తీవ్రంగా ద్వేషించే పచ్చి మితవాద ''ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ'' (ఎ ఎఫ్ డి) పార్టీకి అమెరికా ధనవంతుడు ఎలాన్ మస్క్ బాహాటంగా మద్దతు ఇస్తున్నారు. ఫిబ్రవరి 23న జర్మనీ జాతీయ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి.

## హైకోర్టుకు నలుగురు కొత్త జడ్జీలు

కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులుగా జిల్లా జడ్జీల క్యాడర్‌కు చెందిన నలుగురిని నియమించాలని సుప్రీం కోర్టు కొలీజియం కేంద్రానికి ఈనెల 11న సిఫారుసు చేసింది. సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి రేణుక యారా, సిటీ సివిల్ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జి నందికొండ నర్సింగ్‌రావు, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ తిరుమలాదేవి, హైకోర్టు రిజిస్ట్రార్ (పరిపాలన) బి.ఆర్. మధుసూదన్‌రావు పేర్లను సిఫార్సు చేసింది. రేణుక 1973లో హైదరాబాద్‌లో జన్మించారు. లాయర్‌గా చేస్తుండగా 2012 డిసెంబర్‌లో జిల్లా జడ్జీగా ఎంపికయ్యారు. నర్సింగ్ రావు కూడా హైదరాబాద్‌లో1969 మే 3న జన్మించారు. 1995లో లా చేశాక న్యాయవాదిగా చేస్తుండగా 2012లో జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. సంగారెడ్డికి చెందిన తిరుమలాదేవి 1964 జూన్ 2న జన్మించారు. లా పూర్తి చేశాక ప్రాక్టీస్ చేస్తుండగా 2012లో జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. ఖాజీపేటలో మధుసూదన్‌రావు 1969 మే 25న జన్మించారు. 1999లో లా చేశాక ప్రాక్టీస్ చేస్తుండగా 2012 చివర్లో జిల్లా జడ్జి అయ్యారు.

### యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా జస్టిస్ సుజయ్ పాల్



హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు చీఫ్ జస్టిస్‌గా ఉన్న ఆలోక్ అరాధేను బాంబే హైకోర్టు సిజెగా బదిలీ కావడంతో ఆ బాధ్యతలను జస్టిస్ సుజయ్ పాల్‌కు అప్పగిస్తూ రాష్ట్రపతి కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన 1990లో లాయర్‌గా ఎన్‌రోల్ అయ్యారు.. 2011లో మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి గా నియమితులయ్యారు. గత ఏడాది మార్చిలో బదిలీపై ఇక్కడికి వచ్చారు.

## నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు

వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్


ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి



జిల్లాకేంద్రంగా పసుపు బోర్డు సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని నిఖిల్ సాయి హోల్‌లో పసుపు బోర్డు ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఢిల్లీ నుండి వర్చువల్‌గా జాతీయస్థాయి పసుపు బోర్డును లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పసుపు బోర్డు చైర్మన్ పల్ల గంగారెడ్డి పసుపు బోర్డు జాతీయ కార్యదర్శి పి.హేమలత, కేంద్ర పరిశ్రమల శాఖ సంయుక్త కార్యదర్శి కె.సాంగ్ యంగ్ జోమ్ శేర్ప, జాతీయ పసుపు బోర్డు డైరెక్టర్ రేమశ్రీ, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్త, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిలతో పాటు భారీగా పసుపు రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని మోదీ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. రాష్ట్రంతో పాటు 20 రాష్ట్రాలలో పసుపు పంట పండుతుందన్నారు. దేశవ్యాప్తంగా 30 రకాల పసుపు పంట సాగవుతుందని, పసుపు రైతులకు మేలు జరిగేలా పసుపు బోర్డు ఏర్పాటు కావటం శుభసూచకమన్నారు. అనంతరం ఎంపి అరవింద్ మాట్లాడుతూ పసుపు రైతుల వాంఛ నెరవేర్చిన మోదీకి పాదాభివందనం చేశారు. పసుపు బోర్డు చైర్మన్‌గా నియమితులైన పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి బిజెపి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జిల్లాలో ఆర్మూర్ ప్రాంతంగా పసుపు అత్యధికంగా సాగుతుందని, పసుపు బోర్డు ఏర్పాటు కావటం హర్షించదగ్గ విషయమన్నారు. పసుపు రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటానన్నారు.

## బంగారు గనుల్లో.. ఆకలి కేకలు!

100 మంది కార్మికులు మృతి
నిరసన ప్రదర్శనలు



**స్టిల్‌ఫోన్‌టైన్ :** రోజుల తరబడి ఆహారం, నీరు లభించకపోవడంతో దక్షిణాఫ్రికాలోని బంగారు గనుల్లో సుమారు 100 మంది కార్మికులు మరణించారు. బయట నుండి సహాయం లేకుండా కార్మికులు తమంతట తాముగా బయటకు వచ్చే అవకాశమేలేదు. దీంతో అనేక వారాలుగా కార్మికులు తిండి, నీళ్ళు లేక అలమటించి గని లోపలే మరణించారు. మానవహక్కుల సంఘాలు, వివిధ అసోసియేషన్లు ప్రభుత్వంపై ఒత్తిడి చేయడంతో ఎట్టకేలకు ప్రభుత్వం సహాయ చర్యలు చేపట్టింది. అప్పటికే వంద మంది కార్మికులు మరణించారు. ఇప్పటివరకూ 60 మృతదేహాలను, మరో 92 మంది కార్మికులను సజీవంగాను ప్రభుత్వం బయటకు తీసింది. కార్మికుల బంధువులు, మానవహక్కుల సంఘాలు గని వెలుపల నిరసన ప్రదర్శనలు చేస్తున్నాయి. బంగారు గనులకు, ఆకలి కేకలకు ప్రసిద్ధిచెందిన దక్షిణాఫ్రికాలో అక్రమంగా తవ్వకాలు చేసేందుకు దోపిడీ ముఠాలు కార్మికులను బంగారు గనుల్లోకి పంపిస్తూ ఉంటాయి. ప్రభుత్వం తీవ్రమైన ఆంక్షలు విధించినప్పటికీ తరువాయి 12లో

## స్థానిక సమరానికి సన్నద్ధం

పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు
కొనసాగుతున్న బ్యాలెట్ల ముద్రణ
క్యాడర్‌ను సమాయత్తం చేస్తున్న రాజకీయ పార్టీలు
రిజర్వేషన్లపై ఉత్కంఠ

ప్రజాపక్షం/ఖమ్మం




గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధమవుతుంది. ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నం కాగా స్థానిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు రాజకీయ పార్టీలు క్యాడర్‌ను సమాయత్తం చేస్తున్నాయి. జనవరి 30 నాటికి గ్రామ పంచాయతీల పదవీ కాలం ముగిసి ఏడాది పూర్తవుతుంది. ఏడాది కాలంగా గ్రామ పంచాయతీల్లో పలు సమస్యలు తిష్ట వేశాయి. కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు కేటాయించే నిధులు, స్థానికంగా నెలకొన్న ఇబ్బందుల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికలను పూర్తి చేయాలని ఆ దిశగా కార్యాచరణను వేగవంతం చేసింది. ఇప్పటికే గ్రామ పంచాయతీల వారీగా తుది ఓటరు జాబితాను ప్రకటించారు. ప్రస్తుతం ప్రకటించిన జాబితా ప్రకారమే ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. కొన్ని చోట్ల అదనపు జాబితా కూడా తయారు కావచ్చు. అర్హులైన ఓటర్లు దరఖాస్తు చేసుకునేందుకు మరి కొంత సమయం ఉండడంతో తరువాయి 12లో

# గాజాలో 42 రోజులు కాల్పుల విరమణ
# 33 మంది విడుదల

### హమాస్ అంగీకారంః చర్చలు కొనసాగింపు
### ఫలించిన డోనాల్డ్ ట్రంప్ హెచ్చరిక






**ఓస్లో:** ఇజ్రాయెల్–హమాస్ మధ్య తాత్కాలికంగా యుద్ధ విరమణకు ఒప్పందం కుదిరింది. గాజాలో యుద్ధ విరణకు హమాస్ ఉగ్రవాద సంస్థ అంగీకరించింది. తొలి విడతగా 42 రోజులపాటు గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం అమలు చేస్తారు. 33 మంది బందీలను హమాస్ విడుదల చేస్తుంది. అమెరికా, ఈజిప్టు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వాల మధ్యవర్తులు గడచిన కొద్దిరోజులుగా ఖతార్‌లో చేస్తున్న చర్చలు ఫలితం చూపించాయి. నార్వే రాజధాని ఓస్లోలో బుధవారం జరిగిన చర్చల్లో పాలస్తీనా ప్రధానమంత్రి మహ్మద్ ముస్తాఫా, నార్వే విదేశాంగమంత్రి ఎస్పెన్ బార్త్ ఈద్‌సహా 85 దేశాల ప్రతినిధులు ఇజ్రాయెల్–పాలస్తీనా శాంతియుత సహజీవన ఒప్పంద చర్చల్లో పాల్గొంటున్నారు. అంతకు ముందు ఇజ్రాయెల్ ఆర్మీ చీఫ్ హెర్జీ హవేలీని అమెరికా మిలిటరీ సెంట్రల్ కమాండ్ జనరల్ మైఖేల్ కురిల్లా కలుసుకుని పశ్చిమ ఆసియాలో పరిస్థితులపై చర్చలు జరిపారు. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా హవేలీ పోస్టింగ్ చేశారు. మరోవైపు హమాస్ వద్ద బందీలుగా ఉన్న మొత్తం అందరినీ విడుదల చేయాలని కోరుతూ ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్‌లో బందీల బంధువులు రహదారులపై నిరసన ప్రదర్శనలు కొనసాగిస్తున్నారు.మధ్యవర్తుల రాయబారం ఫలితంగా ఒప్పందం ముసాయిదా ప్రతిని హమాస్ ఉగ్రవాద ప్రతినిధులు ప్రాథమికంగా ఆమోదించారు. ఈ చర్చలు ఇంకా కొనసాగుతున్నాయి. 2023 అక్టోబరు 7వ తేదీన ఇజ్రాయెల్‌పై హమాస్ ఉగ్రవాదులు దాడిచేసి సుమారు 1200 మందిని కాల్చి చంపి మరో 250 మందిని బందీలుగా తీసుకుపోయారు. బందీల జాడకోసం అన్వేషణ పేరుతో ఇజ్రాయెల్ సైన్యం గాజాలో నాటి నుండీ నేటి వరకూ బుధవారంనాడు కూడా మారణహోమం కొనసాగిస్తున్నది. ఒకవైపు చర్చలు జరుగుతుంటే మరోవైపు ఇజ్రాయెల్ సైన్యం గాజాలో విధ్వంసకాండను ఉద్ధృతం చేసింది. రఫా, బురెయిజ్ శిబిరాలపై జరిపిన బుధవారంనాటి గగనతల బాంబు దాడుల్లో 62 మంది పాలస్తీనియన్లు హతులయ్యారు. ఇంకా హమాస్ వద్ద 100 మంది బందీలున్నారని ఇజ్రాయెల్ వాదిస్తున్నది. వీరిలో తొలి విడత 33 మంది విడుదలకు ప్రాథమికంగా ఒప్పందం కుదిరింది. జనవరి 20న తన ప్రమాణ స్వీకారోత్సవంలోపు గాజాలో యుద్ధ విరమణకు హమాస్ అంగీకరించకపోతే పరిస్థితి దారుణంగా మారుతుందని అమెరికా కాబోయే అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరిక కూడా ఒప్పందం వేగంగా కుదరడానికి దోహదం చేసిందని భావిస్తున్నారు.




# క్యూబాపై ఉగ్రవాద ముద్ర ఎత్తేసిన జో బైడెన్

### 553 మంది ఖైదీల విడుదలకు క్యూబా నిర్ణయం
### బైడెన్ తుది నిర్ణయాల్లో దీనికే అత్యంత ప్రాముఖ్యం






**వాషింగ్టన్ :** క్యూబాపై టెర్రరిస్టుదేశంగా ముద్రవేసిన అమెరికా ఇప్పుడు ఆ ముద్రను చెరిపేయాలని నిర్ణయించింది. దీనికి ప్రతిగా క్యూబా ప్రభుత్వం కూడా 553 మంది ఖైదీలను విడుదల చేస్తుంది. ప్రస్తుతం ఉత్తరకొరియా, ఇరాన్, సిరియా, క్యూబా సహా పలు దేశాలు అమెరికా ఆంక్షలు విధించిన ఉగ్రవాద దేశాల జాబితాలో ఉన్నాయి. మరో నాలుగు రోజుల్లో పదవీ విరమణ చేస్తున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారన్నది ఆయన అధికార వర్గాల సమాచారం. క్యాథలిక్ చర్చ్ ఈ మేరకు రెండు దేశాలమధ్య మధ్యవర్తిత్వం చేసింది. ట్రంప్ అధికారం చేపట్టేలోపు ఈ నిర్ణయం అమలులోకి వస్తుంది. బరాక్ ఒబామా కూడా 2015లో పదవీ విరమణ చేసే ముందు క్యూబాపై ఆంక్షలు ఎత్తివేశారు. కానీ ట్రంప్ వచ్చాక వెంటనే మళ్ళీ ఆంక్షలు విధించారు. దీనిని రాజకీయ అవకాశవాదంగా ట్రంప్‌పై ఆనాడు క్యూబా తీవ్రంగా మండిపడింది.బైడెన్ ఆదేశాలమేరకు ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న దేశాల జాబితానుండి క్యూబా దేశం పేరును ఇకమీదట తొలగిస్తారు. అమెరికా సామ్రాజ్యవాదానికి పక్కలో బల్లెంగా మారిన కమ్యూనిస్టు దేశం కూబాపై అనేక దశాబ్దాలుగా అమెరికా ఆర్థిక ఆంక్షలు కొనసాగిస్తున్నది. క్యూబా ప్రభుత్వంపై టెర్రరిస్టుదేశంగా ముద్రవేసింది. ఐతే పదవీ విరమణ చేస్తున్న బైడెన్ క్యూబాపై ఈ విధమైన ముద్రను తొలగించి వెళ్ళేందుకు నిర్ణయంచినట్లు సమాచారం. ట్రంప్ 2016లో అధికారం చేపట్టినప్పుడు క్యూబాను ఉగ్రవాద దేశంగా ప్రకటించారు. ఉగ్రవాద దేశాల జాబితాలో క్యూబాను చేర్చారు. ఐతే ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చాక బైడెన్ నిర్ణయాన్ని అమలు చేస్తారా? లేక ఉగ్రవాద దేశాల జాబితానుండి క్యూబాను తొలగిస్తూ బైడెన్ నిర్ణయాన్ని గౌరవిస్తారా? అనేది తర్వాత కొత్త ప్రభుత్వ యంత్రాంగం నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటుంది. కొత్త ప్రభుత్వంలో జాతీయ భద్రతా సలహాదారుగా ట్రంప్ ఎంపిక చేసిన మైక్ వాల్జ్ ఈ పరిణామాలపై ఫాక్స్ న్యూస్ తో మాట్లాడుతూ, బైడెన్ నిర్ణయాలు యథాతథంగా కొనసాగుతాయన్న భరోసా లేదని, క్యూబాపై తమ విధాన నిర్ణయంలో మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. క్యూడా అన్యాయంగా నిర్బంధించిన 553 మంది ఖైదీలను క్రమక్రంగా ఆ దేశ ప్రభుత్వం ఇందుకు ప్రతిగా విడుదల చేస్తుందని బైడెన్ యంత్రాంగం చెబుతున్నది.

# ఎట్టకేలకు ద.కొరియా అధ్యక్షుడు యోల్ అరెస్టు



**సియోల్ :** దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ (64)ను దర్యాప్తు అధికారులు బుధవారంనాడు అరెస్టు చేశారు. దీంతో దక్షిణ కొరియాలో అరెస్టయిన మొట్టమొదటి దేశాధ్యక్షుడుగా ఆచప చరిత్రపుటల్లోకి ఎక్కారు. 48 గంటల పాటు దర్యాప్తు అధికారుల అదుపులో ఆయన ఉంటారు. ప్రాథమికంగా ప్రశ్నించడంకోసం అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఆయన ఇంటి ప్రహరీగోడలకు ఉన్న కరెంటు ఫెన్సింగ్‌ను కత్తిరించి దర్యాప్తు అధికారులు గోడలు దూకి లోపలికి ప్రవేశించి ఎట్టకేలకు యూన్ సుక్ యోల్‌ను అరెస్టు చేశారు. దేశంలో మార్షల్ లా విధించడంవెనుక కుట్ర కోణం ఉందన్న ఆరోపణల మేరకు ఆయన అరెస్టు అయ్యారు. దర్యాప్తు అధికారులను ప్రశ్నించేందుకు ఆయన మొదటినుండీ సహకరించలేదు. దర్యాప్తు అధికారులు ఆయనను అరెస్టు చేసేందుకు అవకాశం లేకుండా వేలాదిమంది అభిమానులు ఆయన ఇంటిని చుట్టుముట్టి రోజుల తరబడి తిష్టవేసుక్కూర్చున్నారు. గడచిన రెండు మూడు వారాలుగా ఆయనను అరెస్టు చేయాలని, అరెస్టు చేయకూడదని దక్షిణ కొరియాలో వేలాదిమంది ఇరువర్గాలుగా విడిపోయి నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. దక్షిణ కొరియా అత్యున్నత న్యాయస్థానం డిసెంబరు 31న యూనన్ సుక్ యోల్‌కు అరెస్టు వారెంటు జారీ చేయడంతో అప్పటినుండి ఆయన ఇంటిలోంచి బయటకు రాలేదు. దర్యాప్తు అధికారులను ఆయన అభిమానులు ఇంట్లోకి వెళ్ళనివ్వకుండా అడ్డుకున్నారు. చివరకు న్యాయస్థానం నుండి దర్యాప్తు అధికారులు రెండోసారి కూడా అరెస్టు వారెంటు తెచ్చుకున్నారు.యూన్‌సుక్ యోల్ డిసెంబరు 3వ తేదీన అర్ధరాత్రి దక్షిణ కొరియాలో మార్షల్ లా విధించారు. ప్రతిపక్షాలు ఉత్తర కొరియా ప్రయోజనాలకు అనుకూలంగా పనిచేస్తున్నాయని, వారి భరతం పడతానని శపథంచేసి యోల్ దేశంలో మార్షల్ లా విధించారు. ఐతే తీవ్రమైన ఒత్తిడి రావడంతో కొద్ది గంటల వ్యవధిలోనే ఆయన మార్షల్ లా ఉత్తర్వులను వెనక్కు తీసుకున్నారు. ఐనప్పటికీ యోల్ జాతీయ అసెంబ్లీ (దక్షిణ కొరియా పార్లమెంటు)లో మరునాడే డిసెంబరు నాలుగోతేదీన అభిశంసన తీర్మానం ఎదుర్కొన్నారు. ప్రతిపక్షాలు డిసెంబరు 14వ తేదీన అభిశంసన తీర్మానంపై రెండోసారి ఓటింగ్ పెట్టినప్పుడు యోల్ సొంతపార్టీకి చెందిన ఎంపీలతోసహా 204 మంది అధ్యక్ష పదవి నుండి దించేసేందుకు అనుకూలంగా ఓటు వేయడంతో యోల్ పదవీచ్యుతుడయ్యారు. 2022 మే 10వ తేదీన ఆయన అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు.

# మొజాంబిక్ అధ్యక్షుడుగా చాపోను ఒప్పకోండి

### ప్రతిపక్షాలకు 16 ఆఫ్రికా దేశాల విజ్ఞప్తి




**మాప్యుటో :** ఆఫ్రికాఖండ దేశం మొజాంబిక్ అధ్యక్షుడుగా డేనియల్ చాపో (48) బుధవారంనాడు ప్రమాణ స్వీకారం చేశారు. దేశంలో ఆర్థిక సమస్యలు పరిష్కరిస్తాననీ, అవినీతిని నిర్మూలిస్తాననీ చాపో ఎన్నికల ప్రచారంలో ప్రజలకు హామీ ఇచ్చారు. మరోవైపు దేశంలో ప్రతిపక్షాలు ఆయన ఎన్నికను వ్యతిరేకిస్తూ జాతీయస్థాయిలో సార్వత్రిక సమ్మె చేస్తున్నాయి. దేశంలో ప్రతిపక్షాలన్నీ చాపో ప్రమాణ స్వీకారోత్సవాన్ని బహిష్కరించాయి. నిరసనలమధ్య చాపో అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. ఐతే ప్రజలు ఎన్నుకున్న దేశాధ్యక్షుణ్ణి అంగీకరించాలని, ప్రజాభిప్రాయాన్ని గౌరవించాలనీ 16 ఆఫ్రికా దేశాలు మొజాంబిక్‌లో ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశాయి. మొజాంబిక్ దేశ స్వాతంత్ర్యంకోసం పోరాటం చేసిన మార్క్సిస్టు–లెనిసిస్టు సిద్ధాంతాలపై ఆధారపడిన వామపక్ష కార్మిక,కర్షక ఫ్రెలిమోపార్టీకి చెందిన నాయకుడు చాపో. రాజకీయాల్లోకి రాకముందు యూనివర్సిటీ లెక్చరర్‌గా, రేడియో, టెలివిజన్ హోస్ట్‌గా, లీగల్ నోటరీగా ఆయన పనిచేశారు. మూడునెలల క్రితం మొజాంబిక్‌లో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఐతే ఈ ఎన్నికలు అక్రమ పద్ధతిలో జరిగాయంటూ ప్రతిపక్షాలు తీవ్ర ఆందోళనకు దిగాయి. అమెరికా సహా పలు సామ్రాజ్యవాద దేశాలు కూడా మొజాంబిక్‌లో ఎన్నికలను వ్యతిరేకించాయి. ఎన్నికల్లో డేనియల్ చాపోకు 65 శాతం ఓట్లు లభించాయి. ముఖ్యంగా చాపోకు వ్యతిరేకంగా ప్రతిపక్ష అభ్యర్థిగా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన 'పోడోమెస్' (ఆప్టిమిస్ట్‌పార్టీ ఫర్ ద డవలప్‌మెంట్ ఆఫ్ మొజాంబిక్) పార్టీ నాయకుడు వెనాన్సియో ఆంటోనియో బినా మోండలేన్ (50) ఈ ఎన్నికను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మొన్నటిదాకా దక్షిణాఫ్రికాలో ప్రవాసంలో ఉండి ఇటీవలే తిరిగి వచ్చి దేశంలో నిరసనలకు నాయకత్వం వహిస్తున్నారు.

# 25కు పెరిగిన లాస్‌ఏంజెల్స్ కార్చిచ్చు మృతులు

**లాస్‌ఏంజెల్స్ :** కాలిఫోర్నియా లాస్‌ఏంజెల్స్ నగరంలో దావానలం అత్యంత ఉద్ధృతంగా కొనసాగుతున్నది. ఈ మహానగరంలో కార్చిచ్చు చెలరేగి బుధవారంనాడు ఎనిమిది రోజులు గడిచింది. దావానలంలో సజీవహనమైనవారం సంఖ్య 25కు పెరిగింది. మృతులసంఖ్య ఇంకా పెరగుతుందని అధికారులు అంచనావేస్తున్నారు. లాస్‌ఏంజెల్స్‌లో దావానలంవల్ల బుగ్గిపాలైన నగరాన్ని పునరుజ్జీవింపజేయాలంటే కొన్ని వందల బిలియన్ డాలర్లు ఖర్చు అవుతుంది. గాలులు తీవ్రంగా వీస్తున్నందువల్ల దావానలం మరికొద్దిరోజులు కొనసాగే అవకాశం ఉంది. ఇళ్ళల్లో సజీవదహనమైనవారిని కనిపెట్టి మృతదేహాలను వెలికి తీసేందుకు ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయి. ఎన్నో అమూల్యమైన ఆస్తులు, చారిత్రక వస్తువులు, హాలీవుడ్ నటుల ఖరీదైన నివాసాలు మంటల్లో కాలి బూడిదయ్యాయి. 20వ శతాబ్దపు ఆస్ట్రేలియన్–అమెరికన్ కంపోజర్ ఆర్నాడ్ షోన్‌బెర్గ్ కు చెందిన సుమారు 1,00,000 కు పైగా ఉన్న లిఖితపూర్వక ఒరిజినల్ కంపోజింగ్ ప్రతులు బుగ్గిపాలయ్యాయి. వీటిని అనేక దశాబ్దాలుగా ఎంతో జాగ్రత్తగా దాచి ఉంచారు. ఆయన కుటుంబమే ఈ షింఫొనీ ఆర్కెస్ట్రా కంపోజింగ్ కంపెనీ నడుపుతోంది. ఆమెరికా సంగీత సంస్కృతికి ఇది తీరని నష్టమని ఆర్నాల్డ్ షోన్‌బెర్గ్ కుమారుడు లారీ (83) తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

## కొత్త కార్యాలయం (మొదటి పేజీ తరువాయి)

మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అత్యాధునిక వసతులతో రూపుదిద్దుకున్న ఈ భవన నిర్మాణానికి సుమారు 15 సంవత్సరాలు పట్టింది. ఎఐసిసి కార్యాలయాన్ని అక్బర్ రోడ్డులోని భవనం నుంచి మార్చినప్పటికీ, అక్కడ కూడా పార్టీ కార్యకలాపాలు ఉంటాయని పార్టీ నేతలు ప్రకటించారు. అక్బర్ రోడ్డులోని భవనాన్ని 1978 నుంచి ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) కేంద్ర కార్యాలయంగా కొనసాగుతున్నది. ప్రభుత్వ భవనాల్లో పార్టీ కార్యకలాపాలు కొనసాగించకూడదని కేంద్రం గతంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం దాదాపు అన్ని పార్టీలు ప్రత్యేక భవనాలను నిర్మించుకున్నాయి. 2008లో కాంగ్రెస్‌కు తొలుత దీన్‌దయాళ్ ఉపాధ్యాయమార్గ్‌లో స్థలాన్ని కేటాయించారు. అనంతరం అక్కడి నుంచి కోట్లా మార్గ్‌కు స్థలాన్ని మార్పు చేశారు.

## కొట్టివేత (మొదటి పేజీ తరువాయి)

కూడా సుప్రీం కోర్టు తిరస్కరించింది. అలాంటి అనుమతిని ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఇలావుంటే, ఈ కేసులో విచారణకు ఇడి ముందు కెటిఆర్ హాజరుకానున్నారు. ఫార్ములా ఈ–కారు రేసు అక్రమాల కేసులో ఇప్పటికే అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) విచారణకు హాజరైన కెటిఆర్ ఇడి విచారణకు కూడా హాజరుకానుండటం ఆసక్తికరంగా మారింది. ఈ కేసులో ఎసిబి నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగానే ఇడి విచారణ చేపట్టనుంది. కెటిఆర్ ఒత్తిడితోనే నిబంధనలు పాటించకుండా రూ.55 కోట్ల హెచ్ఎండిఎ నిధుల నుంచి బదిలీ చేశారని, మనీ లాండరింగ్, ఫెమా నిబంధనలు ఉల్లంఘించారన్న అభియోగాలతో కేసు నమోదైంది. ఈ కేసులో ఎ1గా కెటిఆర్, ఎ2 గా ఐఎఎస్ అరవింద్ కుమార్, ఎ3గా ఉన్న హెచ్ఎండిఎ మాజీ చీఫ్ ఇంజనీర్ బిఎల్ఎన్ రెడ్డిలను చేర్చారు. ఇప్పటికే ఐఎఎస్ అరవింద్ కుమార్, బిఎల్ఎన్ రెడ్డిలను ఇడి విచారించింది. వారిద్దరి స్టేట్మెంట్ ఆధారంగా నేడు కెటిఆర్‌ను ఇడి అధికారులు విచారించనున్నారు. మరోవైపు ఈ కేసులో కెటిఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లను ఇటు హైకోర్టు, అటు సుప్రీం కోర్టులు కూడా కొట్టివేయడం కెటిఆర్‌కు ఎదురుదెబ్బగా మారింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కెటిఆర్ అరెస్టు విషయంలో ఎసిబి, ఇడిలు ఈ కేసులో కెటిఆర్‌ను అరెస్టు చేసే అవకాశాలు లేకపోలేదన్న ప్రచారం వినిపిస్తోంది.

## బలమైన వాదనలు (మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. కెడబ్ల్యుడిటి2 తదుపరి విధివిధానాలపై (ఫర్దర్ టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్) ఎపి ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించినా అత్యున్నత న్యాయస్థానం ఎటువంటి స్టే ఇవ్వని విషయాన్ని సిఎం గుర్తు చేశారు. రాష్ట్ర నీటి పారుదల శాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. సమీక్షలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌మార్ రెడ్డి, మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సిఎం ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, ప్రభుత్వ సలహాదారు (నీటి పారుదల శాఖ) ఆదిత్యనాథ్ దాస్, నీటి పారుదల శాఖ కా ర్యదర్శి రాహుల్ బొజ్జా పాల్గొన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు చేపట్టడంపై కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్.పాటిల్, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు గోదావరి, కృష్ణా నది యాజమాన్య బోర్డులకు (జిఆర్ఎంబి, కెఆర్ఎంబి) తెలంగాణ తరపున అభ్యంతరాలు తెలుపుతూ లేఖలు రాయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల్లో ఏ రాష్ట్రమైనా ఏ నదిపైనైనా ప్రాజెక్టు నిర్మించాలంటే జిఆర్ఎంబి, కెఆర్ఎంబిలతో పాటు పొరుగు రాష్ట్రానికి సమాచారం ఇవ్వాలనే విషయాన్ని లేఖలలో ప్రస్తావించాలని సిఎం రేవంత్‌రెడ్డి సూచించారు. పోలవరం ప్రాజెక్టుతో భద్రాచలం ముంపు విషయంపై హైదరాబాద్ ఐఐటితో అధ్యయనాన్ని నిర్దేశిత సమయంలో పూర్తి చేయించాలని సిఎం అధికారులను ఆదేశించారు. సమ్మక్క సారక్క బ్యారేజీ, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతలకు అనుమతులు సాధించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సిఎం సూచించారు.

# పసుపు రైతులకు వ్యవసాయ పనిముట్లు రాయితీపై ఇవ్వాలి

### వ్యవసాయ శాఖ మంత్రికి రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పసుపు రైతులకు యాంత్రీకరణలో భాగంగా వ్యవసాయ పనిముట్లు రాయితీపై ఇవ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి బుధవారం లేఖ రాశారు. రైతు కమిషన్ బృందం ఈనెల 9న నిజామాబాద్ జిల్లా పర్యటనలో పసుపు రైతుల సమస్యలు తెలుసుకోవడం జరిగింది. పంటపొలాలల్లో కమిషన్ బృందం పసుపు రైతులతో ముఖాముఖీ చర్చించినప్పుడు వారు.. పంట పెట్టుబడి పెరుగుతుందని పసుపుకు న్యాయమైన ధర రావడంలేదని కమిషన్ ముందు గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా పసుపు రైతులకు యాంత్రీకరణ లేకపోవడం వల్ల పండిన పసుపు ను భూమిలో నుండి తీయడం, మొక్క నుండి పసుపు వేరు చేసిన తర్వాత పసుపు ఆరబోయడానికి కళ్లాలు లేక, పసుపును బెయిల్ చేయడానికి సరైన యంత్రాలు లేక పాత పద్ధతుల్లోనే కట్టెలతో మంటపెట్టి పసుపును మరగబెడుతున్నారు. పసుపు పాలిష్ యంత్రాలు లేక తగినంత మోతాదుల్లో పసుపు పాలిష్ పెట్టలేకపోతున్నారు. పసుపు పంటలు దేశంలోనే పెద్ద మొత్తంలో సాగయ్యే నిజామాబాద్ జిల్లాలో పాత పద్ధతుల్లో వ్యవసాయం చేయడం వల్ల కూలీల కొరతతో ఆధునాత యంత్రాలు లేక పెట్టుబడి పెట్ట లేక రైతులు నష్టపోతున్నారు. 200708 లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అప్పటి సిఎం రాజశేఖర్ రెడ్డి హయాంలో 40 ఎకరాల భూమి ని పసుపు విత్తన పరిశోధనకు కేటాయించింది. ఆ కాలంలోనే నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేయమని కేంద్రాన్ని కోరింది. అప్పటి నుండి ఇప్పటి వరకు ప్రభుత్వాలు మారాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. కానీ పసుపు పండించే రైతుల పరిస్థితి బాగుపడ లేదు. పై విషయాలను దృష్టిలో పెట్టుకొని వెంటనే పసుపు పండించే రైతులకు యాంత్రీకరణ లో భాగంగా పనిమొట్లను రైతులకు రాయితీ పై అందించాలని రైతుల పక్షాన రైతు కమిషన్ వ్యవసాయ శాఖ మంత్రిని, రాష్ట్ర ప్రభుత్వాన్ని లేఖలో ఆయన కోరారు.

## ఎఐటియుసికి అనుబంధంగా ఎన్‌టియుఐ

(మొదటి పేజీ తరువాయి)

వ్యవస్థ స్వైరవిహారం చేస్తున్న సమయంలోనే దశాబ్ద కాలంగా నిరంకుశ బిజెపి ప్రభుత్వం ఆధ్వర్యంలో కార్మికులు, ప్రజాస్వామ్య హక్కులపై దాడులు కొనసాగిస్తున్న నేపథ్యంలో కార్మిక వర్గ ఐక్య అత్యవసరం, తప్పనిపరిస్థితి అనే ఉద్దేశ్యంతో ఎన్‌టియుసి నిర్ణయం తీసుకుందన్నారు. విరోధులు పేట్రేగిపోతున్న పరిస్థితులలో కార్మిక సంఘాల మధ్య ఐక్యత కష్టతరంగా మారిందని, ఇలాంటి తరుణంలో కార్మికవర్గ ఐక్యతకు ఎన్‌టియుఐ తొలి అడుగు వేసిందని తెలిపారు. 1920లో స్థాపించబడిన ఎఐటియుసి భారత దేశం ఆర్థిక వ్యవస్థలో అన్ని వర్గాల కార్మికులు, కార్మిక సంఘాలకు రాజకీయాలకు అతీతమైన ఏకైక కార్మిక సంఘంగా ఉందని, ఎఐటియుసి ఏర్పడినప్పటి నుంచి కార్మిక సంఘాలు యజమానులు, ప్రభుత్వాలు, రాజకీయ పార్టీల నుంచి కార్మిక సంఘాలు స్వేచ్ఛగా ఉండాలనే సిద్ధాంతంలో పని చేస్తుందన్నారు. అన్ని కార్మిక సంఘాలకు చట్రంగా ఉన్న ఎఐటియుసి కార్మిక వర్గం హక్కుల కోసం శక్తివంతమైన పోరాటాలు చేపట్టిందని, అలాగే దేశాన్ని వలస పాలన నుంచి విముక్తి చేసేందుకు స్వాతంత్రోద్యమంలో కూడా క్రియాశీలంగా పోరాడిందని గుర్తు చేశారు. ''స్వాతంత్ర్యం లభించిన తరువాత రాజకీయ వైఖరుల ఆధారంగా ట్రేడ్ యూనియన్‌లు చీలిపోయాయని, ఇలాంటి చీలికలు కార్మికుల పోరాట శక్తిని బలహీనపరుస్తుందని నాటి ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి ఎన్.ఎం.జోషి హెచ్చరించారు. 2006లో ఏర్పాటైన ఎన్‌టియుఐ దేశవ్యాప్తంగా స్వతంత్ర కార్మిక సంఘాలను ఐక్యం చేసి, ప్రైవేటు రంగంలో పోరాడిన చరిత్ర కలిగి ఉంది. కాంట్రాక్ట్, ఇతర పేర్లతో పని చేసే అసురక్షిత కార్మికులకు అండగా పోరాటలు సల్పింది. ఎఐటియుసి అనుబంధంగా లభించే బాధ్యతలు,విశేష గౌరవాలను ఆమోదించడం ద్వారా ఎన్‌టియుసి నిర్ణయం తీసుకుంద'ని అమర్‌జీత్ కౌర్, గౌతమ్ మోదీలు వివరించారు.

**ఇది అసాధారణమైన పరిపక్వ నిర్ణయం : అమర్‌జీత్ కౌర్**

చెన్నైలో డిసెంబర్ 22న జరిగిన బహిరంగం సభలో ఎన్‌టియుఐ నిర్ణయాన్ని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ స్వాగతించారు. ఇది అసాధారణ పరిపక్వ నిర్ణయమని ఆమె అభినందించారు.''కార్మిక సంఘాలు రాజకీయ పార్టీలు, యాజమాన్యాలు, ప్రభుత్వాల నుంచి తమ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకోవాలనే ఎఐటియుసి, ఎన్‌టియుఐ ఉమ్మడి అవగాహన కలిగి ఉన్నాయి. అలాగే సమాజంలోని అన్ని స్థాయిలలో రాజకీయ జీవితంలో కార్మికులు భాగస్వామ్యమమ్యేలా చూడాలని భావిస్తున్నాయి. వారి హక్కులను, బాధ్యతలను అమలు చేయడమే కాకుండా రాజ్యం, సమాజంలో ప్రజాస్వామీకరణ పరిరక్షించబడాలని, పెంపొందాలని ఆశిస్తున్నాయి. రాబోయే కాలంలో ఇతర కార్మిక సంఘాలు కార్మిక వర్గం మనోభావాలను గుర్తించి, ఐక్యంగా పని చేసేందుకు సంస్థాగతంగా ఒక్కటి కావాలని, తద్వారా నిరంకుశ నల్ల శక్తులను శక్తివంతంగా ఢీకొట్టాలని ఎఐటియుసి, ఎన్‌టియుఐలు ఆశిస్తున్నాయి'' అని అమర్‌జీత్ కౌర్, గౌతమ్ మోదీలు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.



## కొండన్న మృతి (మొదటి పేజీ తరువాయి)

బుధవారం నాడు జరిగాయి. అంత్యక్రియలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల నర్సింహ, ఇ.టి.నర్సింహ, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి,ఉప ప్రధాన కార్యదర్శులు ఎం.డి.యూసుఫ్, బాలరాజ్, ఎం.నర్సింహ, వివిధ జిల్లాల కార్యదర్శులు బాలకిషన్, తదితరులు పాల్గొన్నారు.

**సిపిఐ నాయకుల సంతాపం :** సిపిఐ నారాయణపేట జిల్లా కార్యదర్శి కొండన్న మృతి పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు బాల నర్సింహ, వి.ఎస్.బోస్ తదితరులు సంతాపాన్ని ప్రకటించారు. కొండన్న మరణం సిపిఐకి తీరని లోటు అని కూనంనేని అన్నారు.కొండన్న ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారని,నిరంతరం పేద ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడ్డారని పేర్కొన్నారు. వారి కుటుంబానికి సిపిఐ రాష్ట్ర సమితి తరుపున ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## అనుమతి (మొదటి పేజీ తరువాయి)

ఎదుట ఆయనను హాజరుపరిచారు. ఢిల్లీ మద్యం విధానాన్ని రూపొందించడంలో ఆర్థిక అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై పిఎంఎల్ఎ చట్టం కింద కేజ్రీవాల్‌ను విచారణ చేయడానికి ఇ డి కి కేంద్ర హోంశాఖ అనుమతి అవసరం. వ్యక్తిగతంగాను, ఆమ్ ఆద్మీ పార్టీ వ్యవస్థాపకుడుగాను ఆయనపై వచ్చిన ఆరోపణలను ఈ పేరుతో విచారణ చేస్తారు. ఈ అవినీతి కేసులో కేజ్రీవాల్‌ను కీలక సూత్రధారిగా ఇ డి పేర్కొంది. ఢిల్లీ ప్రభుత్వంలో మంత్రితో, ఆమ్ ఆద్మీపార్టీలో ముఖ్య నాయకులతో ఆయన కుమ్మక్కు అయ్యారని, ఉద్దేశపూర్వకంగా ధనలాభం కోసం ఎక్సైజు విధానాన్ని కొంతమందికి అనుకూలంగా తయారు చేశారన్నది కేంద్ర దర్యాప్తు సంస్థల ప్రధాన ఆరోపణ. ఆమ్ ఆద్మీపార్టీ అనే రాజకీయపార్టీ భారతదేశ పౌరులతో కూడిన వ్యక్తిగత సంఘమని అందువల్ల ప్రజాప్రాతినిధ్య చట్టం కింద పిఎంఎల్ఎ చట్టంలోని సెక్షన్ 70 కింద ఈ పార్టీ ''కంపెనీ'' విభాగం కేటగిరీలోకి వస్తుందని ఇ డి తొలుత నిర్వచించింది. కేజ్రీవాల్ ఈ కంపెనీకి అంటే ఆప్ పార్టీకి ఇన్‌ఛార్జిగా, ప్రధాన నాయకుడుగా, కన్వీనర్‌గా ఉన్నారని, ఆయన పార్టీ పిఎంఎల్ఎ చట్టం కింద నేరానికి పాల్పడిందని, అందువల్ల అవినీతి సొమ్మును అక్రమ మార్గాల్లో తరలించారన్న నేరంపై ఆయన శిక్షార్హుడనీ ఇ డి ఇంతకుముందే నిర్వచించింది. 2021–22 సంవత్సరంలో ఈ ఎక్సైజు విధానాన్ని కేజ్రీవాల్ ప్రభుత్వం రూపొందించింది. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా సిఫార్సు మేరకు సిబిఐ ఈ కేసును విచారణకు తీసుకుంది. ఈ ఎక్సైజు విధానానికి అసెంబ్లీ ఆమోదంగానీ, లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదంగానీ లేవని కూడా కేంద్ర దర్యాప్తు సంస్థలు ఆరోపించాయి. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని 2022 ఆగస్టు 17వ తేదీన సిబిఐ ఎఫ్ఐఆర్ దాఖలు చేసింది. సిబిఐ ఎఫ్ఐఆర్‌ను ఆధారంగా తీసుకుని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ 2022 ఆగస్టు 22వ తేదీన ఈ అవకతవకలపై దర్యాప్తు చేసేందుకు మనీ లాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసింది.

## దేశ ద్రోహమే (మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్నదని అన్నారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం రాలేదని పేర్కొనడం ద్వారా దేశ ప్రజలందరినీ భగవత్ అవమానించారని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అర్థం లేని మాటలు ఆపాలని హితవు పలికారు.

**స్వాతంత్ర్య ఉద్యమాన్ని, రాజ్యాంగాన్ని అవమానించిన మోహన్‌భాగవత్ : సిపిఐ**

రామ మందిర నిర్మాణం తరువాతే భారతదేశానికి నిజమైన స్వాతంత్ర్యం లభించిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ఇటీవల చేసిన ప్రకటనను సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజా తీవ్రంగా తప్పుబట్టారు. ఇది స్వాతంత్ర్య ఉద్యమాన్ని, భారత రాజ్యాంగ స్ఫూర్తిని అవమానించడమే అవుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రకటన ఆర్ఎస్ఎస్ చీఫ్ మానసిక స్థితిని తెలియజేస్తుందని, స్వాతంత్ర్య ఉద్యమాన్ని, భారతదేశం లౌకిక, ప్రజాతంత్ర గణతంత్రగా నిర్దేశించిన రాజ్యాంగాన్ని ధిక్కరించినట్లే అవుతుందని విమర్శించారు. దీనిపై సిపిఐ తీవ్రమైన నిరసనను వ్యక్తం చేయడంతో పాటు భారత రాజ్యాంగ రక్షకులమని చెప్పుకునే ప్రధాన మంత్రి, కేంద్ర హోం మంత్రి స్పందించాలని రాజా డిమాండ్ చేశారు.

**స్వయం ప్రతిపత్తిని కాలరాస్తున్న యుజిసి నిబంధనలు**

తాజాగా ప్రవేశపెట్టిన యుజిసి నిబంధనలు–2025ను ఉపసంహరించుకోవాలని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం డిమాండ్ చేసింది. ఈ నిబంధనలు దేశ సమాఖ్య వ్యవస్థపై తీవ్రమైన దాడి చేస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోకి యూనియన్ ప్రభుత్వం అతిక్రమిస్తున్నదని ఒక ప్రకటనలో విమర్శించింది. రాష్ట్ర విశ్వవిద్యాలయాలు , విద్యా సంస్థల స్వతంత్ర ప్రతిపత్తిని తాజా యుజిసి నిబంధనలు నిర్వీర్యం చేస్తున్నాయని, అప్రజాస్వామికంగా మోపబడుతున్నవని, పాఠ్యాంశాలు, బోధకుల నియామకాలు, వ్యవస్థ పరిపాలనను కేంద్రీకృతం చేస్తున్నాయని మండిపడింది. మొత్తం విద్యారంగంపై ఆర్ఎస్ఎస్– బిజెపి పట్టుబిగించడంలో భాగంగా ఈ ప్రయత్నాలు సాగుతున్నట్లు స్పష్టమవుతుందని తెలిపింది. విద్యా సంస్థల వైవిధ్య అవసరాలు, ప్రాంతీయ పరిస్థితులకు విరుద్ధంగా వ్యవస్థలో కింది నుంచి పై వరకు ఏకరూపత తీసుకువచ్చే ఉద్దేశ్యం వీటి వెనుకున్నదని పేర్కొంది. బహుళత్వ, సమ్మిళిత స్వభావం కలిగిన భారత విద్యా వ్యవస్థను యూనియన్ ప్రభుత్వం మరింత హరిస్తుందని సిపిఐ ఆందోళన వ్యక్తం చేసింది. తక్షణమే యుజిసి తాజా నిబంధనలను వెనక్కి తీసుకొని, రాష్ట్రాలు, విద్యా సంస్థల హక్కులను గౌరవించాలని డిమాండ్ చేసింది. జోక్య రహిత, విద్యార్థులు, సమాజ వైవిధ్య అవసరాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థ వికేంద్రీకరణ, ప్రజాస్వామీకరణ, వైవిధ్యతతకు తాము కట్టుబడి ఉన్నట్లు సిపిఐ స్పష్టం చేసింది.


**భాగవత్‌పై ప్రధాని చర్యలు తీసుకుంటారా లేదా? : సిఎం రేవంత్‌రెడ్డి**

రాహుల్ గాంధీ చెప్పినట్లు ఆర్ఎస్ఎస్‌తో తమది సిద్ధాంతపరమైన వైరుధ్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. స్వాతంత్ర్యం కోసం ఆర్ఎస్ఎస్ ఏ పోరాటం చేయలేదని, వారెవరూ ఎటువంటి త్యాగాలు చేయలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర్యం గురించి ప్రశ్నించేందుకు, చెప్పేందుకు వారు సిద్ధంగా లేరని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. వాళ్ల వాస్తవ సిద్ధాంతమే అదని, మోహన్ భాగవత్ అదే చెప్పారని, స్వాతంత్ర్య పోరాటంతో వారికి ఎలాంటి సంబంధం లేదన్నారు. స్వాతంత్ర్యానికి విరుద్ధంగా ఎవరైనా మాట్లాడితే వారిపై చట్టపరమైన విచారణ చేయాలని, ఆ క్రమంలోనే మోహన్ భాగవత్‌పై చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ మోహన్ భాగవత్‌తో ఉన్నారా లేక దేశ స్వాతంత్ర్యం కోసం అమరులైన లక్షలాది వెంట ఉన్నారా, మోహన్ భాగవత్‌పై చర్యలు తీసుకుంటారా లేదా అనేది దేశ ప్రజలకు స్పష్టం చేయాలని సిఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. బిజెపి నేతలు కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తూ స్వాతంత్ర్యం విషయంలో మోహన్ భాగవత్ మాట్లాడిన అంశాన్ని తక్కువ చేసే ప్రయత్నం చేస్తున్నారని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి చెబుతున్న విషయాలపై ఎక్కువ దృష్టి పెట్టాల్సిన అవసరం సిఎం అభిప్రాయపడ్డారు.

# ఫిబ్రవరిలో రాహుల్‌గాంధీ సభ

సూర్యాపేట లేదా ఖమ్మంలో ఉండే అవకాశం

కెసి వేణుగోపాల్‌తో తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యనేతల కీలక సమావేశం



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ఫిబ్రవరి మొదటి లేదా రెండో వారంలో ఏఐసిసి అగ్ర నాయకులు రాహుల్‌గాంధీ బహిరంగసభ ఉంటుందని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. సూర్యాపేట లేదా ఖమ్మంలో రాహుల్ గాంధీ సభ ఉండే అవకాశముందని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ నివాసంలో బుధవారం తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యనేతల కీలక సమావేశం జరిగింది. సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సి.దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ తదితరులు హాజరయ్యారు. సుమారు గంటన్నరపాటు రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కె.సి.వేణుగోపాత్‌లో వారు చర్చించినట్లు సమాచారం. సమావేశం అనంతరం మహేష్‌కుమార్ ఆయన మీడియాతో మాట్లాడారు. "ఈ నెలాఖరులోపు నామినేటెడ్, కార్పొరేషన్ చైర్మన్ల భర్తీ ఉంటుంది. కేబినెట్ విస్తరణపై సిఎం, అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుంది. టిపిసిసి కార్యవర్గం కూర్పుపై చర్చించాం. ప్రజల్లో ఉన్నవారికే డిసిసి అధ్యక్ష పదవులు" ఇస్తాం అని మహేష్‌కుమార్ తెలిపారు.



## రైతుల రెండు దశాబ్దాల పోరాటం ఫలించింది : ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పసుపు రైతుల రెండు దశాబ్దాల పోరాటం ఫలితంగా పసుపు బోర్డు ఏర్పాటు అయ్యిందని ఎంఎల్‌సి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఉమ్మడి నిజామాబాద్ ప్రాంతం లో పసుపు పంట బాగా పండుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటు చేయడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. నిజామాబాద్ కేంద్రం గా పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని మొదటి నుండి డిమాండ్ ఉందన్నారు. 2022 లో కేంద్రం పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పిందని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని మేము మొదట ప్రధాన మంత్రి కి లేఖ రాశామని తెలిపారు. కేంద్రం మార్కెటింగ్ వ్యవస్థ, గోడాన్, కోల్ స్టోరేజ్, మద్దతు ధర కల్పించాలన్నారు. చెక్కర కర్మాగారం కూడా పున:ప్రారంభం చేయాలని సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. పసుపు బోర్డు ఏర్పాటు చేయడం వలన పసుపు పంట సాగు మరింత పెరుగుతుందన్నారు. పసుపు బోర్డు ఏర్పాటు చేయడం, పసుపు బోర్డు చైర్మన్ గా నిజామాబాద్ వ్యక్తి నీ నియమించడం మంచి పరిణామం అని పేర్కొన్నారు. పసుపు బోర్డు కు ప్రత్యేక కార్యలయం ఏర్పాటు చేయాలని, .ప్రత్యేక నిది కేటాయించాలన్నారు. పసుపు బోర్డు ఏర్పాటుకై తాము కూడా పోరాటం చేసామని తెలిపారు. తమ ప్రభుత్వం తరపున కేంద్రం కు లేఖ రాశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి కూడా పసుపు బోర్డు కోసం కావాల్సిన పనులు చేస్తుందన్నారు. అయితే మంగళ వారం జరిగిన కార్యక్రమం కు రాష్ట్రం ప్రభుత్వం నీ ఆహ్వానించలేదు కేవలం బిజెపి కార్యక్రమంగా చేశారని విమర్శించారు.

## ఇ-కామర్స్ గోడౌన్‌పై దాడి చేస్తాం

సిపి సివి ఆనంద్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చైనా మాంజా సరఫరా చేస్తున్న ఇకామర్స్ గోడౌన్‌పై దాడి చేస్తామని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ హెచ్చరించారు. చైనా మాంజాపై సివి ఆనంద్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిజానికి చైనా మాంజా అక్కడి నుంచి దిగుమతి అవడం లేదని, స్థానికంగానే తయారు చేస్తున్నారని అన్నారు. అందువల్లనే పెద్ద మొత్తంలో మాంజా తక్కువ ధరకు లభ్యం అవుతోందని, ఈ కారణం వల్లే ఎక్కువమంది కొంటున్నారని వెల్లడించారు. ఈ మధ్య ఈకామర్స్ సైట్స్‌లో బుక్ చేసుకుంటే ఇంటికే తెచ్చి ఇస్తున్నారని, త్వరలో ఈకామర్స్ గోడౌన్స్ రైడ్స్ చేస్తామని సిపి పేర్కొన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తేనే చైనా మాంజా వాడకాన్ని అరికట్టగలమని సివి ఆనంద్ స్పష్టం చేశారు. ఇప్పటికైనా చైనా మాంజా వినియోగాన్ని మానేయాలని ప్రజలకు తాను రిక్వెస్ట్ చేస్తున్నానని అన్నారు.

## 'నేడు' ఆస్ట్రేలియాకు సిఎం రేవంత్ రెడ్డి పయనం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈ నెల 16 రాత్రి 9:50 నిమిషాలకు ఢిల్లీ నుంచి ఆస్ట్రేలియాకు బయల్దేరనున్నారు. ఎనిమిది రోజుల పాటు ఆయన విదేశీ పర్యటనను ముగించుకుని తిరిగి ఈనెల 24న హైదరాబాద్‌కు తిరిగివస్తారు. సిఎం రేవంత్ రెడ్డి తొలుత ఈ నెల 17న ఉదయం 6గంటలకు సింగాపూర్‌కు చేరుకుంటారు. ఆ తర్వాత 20వ తేదీన ఉదయం 6:10 గంటలకు జురిచ్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. ఆ తర్వాత 23వ తేదీ మధ్యాహ్నం 2:35 గంటలకు జురిచ్ నుంచి బయల్దేరి, అదే రోజు రాత్రి 11:45 గంటలకు దుబాయ్‌కి చేరుకుంటారు. ఆ మరుసటి రోజు 24న ఉదయం 3:30 గంటలకు సిఎం రేవంత్ రెడ్డి దుబాయ్ నుంచి బయల్దేరి అదే రోజు ఉదయం 8:25 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటారు.



## సంజయ్‌ని దొంగ అంటే కేసులు పెడుతున్నారు : పాడి కౌశిక్ రెడ్డి

**ప్రజాపక్షం/హైరాబాద్ :** బిఆర్‌ఎస్ నుంచి గెలిచిన జగిత్యాల ఎంఎల్‌ఎ సంజయ్ కూమార్‌ను దొంగ అంటే తనపైన కేసులు పెడుతున్నారని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా సమీక్ష సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపైన ప్రశ్నిస్తుంటే తనపైన పీడి యాక్ట్ నమోదు చేశారన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ భువనగిరిలో బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంపైన దాడి చేసి, కెసిఆర్ ఫొటోను నేలకేసి కొట్టేందుకు ఎన్ని గుండెలు అని కాంగ్రెస్‌పైన మండిపడ్డారు. తమపైన దాడులు చేస్తే, తాము ప్రతిదాడులు చేస్తామని హెచ్చరించారు.

# బిఆర్‌ఎస్ కాదు బిఆర్‌ఎస్‌ఎస్

తెలంగాణలో ప్రజా ప్రభుత్వ చట్టబద్ధమైన పరిపాలన కొనసాగుతున్నది

స్వాతంత్ర్యానికి వ్యతిరేకంగా మాట్లాడే వారిపై చర్యలు తీసుకోవాలి

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** "బిఆర్‌ఎస్ పార్టీ బిఆర్‌ఎస్‌ఎస్‌గా మారింది. ఆర్‌ఎస్‌ఎస్ ఐడియాలజీతో వెళ్లేందుకు బిఆర్‌ఎస్ ప్రయత్నిస్తోందని తెలంగాణలో బిఆర్‌ఆఎస్ వైఖరి, బిజెపి వైఖరి ఒకేరకంగా ఉన్నది. కేంద్రంలో కాంగ్రెస్‌పై బిజెపి ఏ ఆరోపణలు చేస్తే తెలంగాణలో కాంగ్రెస్‌పై బిఆర్‌ఎస్ అవే ఆరోపణలు చేస్తున్నది. ఆర్‌ఎస్‌ఎస్ అడుగు జాడల్లో వెళ్లేందుకు బిఆర్‌ఎస్ ప్రయత్నిస్తోంది" అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి నుముల రేవంత్‌రెడ్డి అన్నారు. బిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ నేర్చుకోవాల్సిన అవసరం లేదని, తెలంగాణలో ప్రజా ప్రభుత్వ చట్టబద్దమైన పరిపాలన కొనసాగిస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో బుధవారం జరిగిన ఎఐసిసి కార్యాలయం ప్రారంభోత్సవానికి హాజరైన సిఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో చట్టం ప్రకారం నడిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎక్కడైనా, ఎవరిపైనైనా దాడులు జరిగితే పోలీసులు చర్యలు చేపడతారని, శాంతిభద్రతల సమస్య తలెత్తితే పోలీసులు జోక్యం చేసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేశారని సిఎం చెప్పారు.

గత ప్రభుత్వం హయంలో పోలీసులతో కలిసి బిఆర్‌ఎస్ వారు కాంగ్రెస్ కార్యాలయాలపై దాడులు చేశారని, తాము అలా చేయడంలేదని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎక్కడైనా తప్పు జరిగితే దానిని సరిదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సిఎం అన్నారు.

**దేశ ప్రజల ప్రయోజనాలకు వేదిక**

ఎఐసిసి నూతన కార్యాలయం దేశ ప్రజల ప్రయోజనాలకు వేదిక కానుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. దేశ ప్రగతి కోసం ప్రణాళికలు సిద్ధం చేసే కార్యాలయాన్ని కాంగ్రెస్ నిర్మించుకుందన్నారు. ఈ కార్యాలయం నుంచే దేశాన్ని బలమైన, శక్తిమంతమైన దేశంగా మార్చడానికి ప్రణాళికలు రచిస్తుందన్నారు. బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ద్వారా కాంగ్రెస్ పార్టీ దేశానికి రాజ్యాంగాన్ని అందించిందన్నారు. ఆ రాజ్యాంగ స్ఫూర్తితో పేద ప్రజలు, ముఖ్యంగా ఆదివాసీలు, దళితులు, బలహీన వర్గాలు, మైనారిటీల సంక్షేమానికి, అభివృద్ధికి పాటుపడుతోందని సిఎం తెలిపారు. 140 సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ ఇన్ని సంవత్సరాల తర్వాత సొంత కార్యాలయాన్ని నిర్మించుకుందన్నారు.

ఇన్ని సంవత్సరాలు దేశాన్ని నడిపించిన కాంగ్రెస్ పార్టీ ఎంత నిస్వార్థంగా ఇన్ని రోజులు ప్రజలకు సేవలు అందించిందనేందుకు ఇదే నిదర్శనమన్నారు. 140 సంవత్సరాలు ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆర్థిక స్థితిగతులను, 40 ఏళ్ల బిజెపి, ఇతర ప్రాంతీయ పార్టీల ఆర్థిక స్థితిగతులు ఏ విధంగా ఉన్నాయో దేశ ప్రజలందరికీ తెలుసునని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ నూతన కార్యాలయం నుంచే దేశాన్ని 21వ శతాబ్దంలో ఏవిధంగా ముందుకు తీసుకెళ్లాలో ప్రణాళికలు రూపొందుతాయని సిఎం తెలిపారు.

# నెల్లికంటి పార్వతమ్మ మృతి

నివాళులర్పించిన సిపిఐ నేతలు కూనంనేని, పల్లా



**ప్రజాపక్షం / మునుగోడు :** నల్లగొండ జిల్లా సిపిఐ కార్యదర్శి నెల్లికంటి సత్యం తల్లి నెల్లికంటి పార్వతమ్మ(85) బుధవారం ఉదయం స్వగ్రామమైన ఎల్గలగూడెం గ్రామంలో మృతిచెందారు. పార్వతమ్మ పార్థివ దేహానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి పూలమాల వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి, పార్వతమ్మ అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతమ్మ మృతి చెందడం బాధాకరమన్నారు. అంతిమయాత్రలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నరసింహారెడ్డి, గన్న చంద్రశేఖర్, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రవణ్ కుమార్, వై.దామోదర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, మల్లేపల్లి ఆదిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు, నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, బొల్గురి నరసింహ, తీర్పారి వెంకటేశ్వర్లు, గురుజ రామచంద్రం, నలపరాజు రామలింగయ్య, బచ్చనగొని గాలయ్య, ఏశాల అశోక్, జిల్లా సమితి సభ్యులు సురిగి చలపతి, నాలపరాజు సతీష్, బిక్షంరెడ్డి, దుబ్బాక భాస్కర్, పల్లె శేఖర్‌రెడ్డి, బొడిగె సైదులు, జిల్లా యాదయ్య తోపాటు విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పార్వతమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**పలు పార్టీ నేతల నివాళి :** సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం తల్లి నెల్లికంటి పార్వతమ్మ పార్థివ దేహానికి నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి, డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాసరెడ్డి, సిపిఎం రాష్ట్ర నాయకుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, చండూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుర్రం వెంకటరెడ్డి, బిఆర్‌ఎస్ జిల్లా నాయకుడు లోడంగి గోవర్ధన్, ప్రముఖ రచయిత, లెక్చరర్ బెల్లి యాదయ్య, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎడ్ల సైదులు, తలారి పరమేష్, ప్రముఖ వ్యాపారవేత మహేందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, బిజెపి మండల అధ్యక్షుడు పెంబల జానయ్య, వివిధ పార్టీల నాయకులు, జర్నలిస్టు సంఘాల నాయకులు పార్వతమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

**నారాయణ,చాడ సంతాపం:** నెల్లికంటి పార్వతమ్మ మృతిపట్ల సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ, కార్యవర్గ సభ్యుడు చాడ సంతాపం వ్యక్తం చేశారు.

## ఎంపి అరవింద్‌కు పరిపక్వత లేదు

మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రెండు పర్యాయాలు ఎంపిగా ఎన్నికైన ధర్మపూరి అరవింద్ తన పట్ల పరిపక్వత లేకుండా మాట్లాడారని, తన పైన అధమ భాషను ఉపయోగించడం సభ్యత అనుపించుకోదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. కొద్దిగా సహనం, రాజకీయ పరిజ్ఞానంతో మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. అరవింద్ చేసిన వ్యాఖ్యలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని పేర్కొన్నారు. ఈ మేరకు తుమ్మల నాగేశ్వర్ రావు ఎంపి ధర్మపూరి అరవింద్‌కు బుధశారం బహిరంగ లేఖను రాశారు. పసుపు బోర్డు ప్రకటించిన నేపథ్యంలో ప్రధానమంత్రికి ధన్యవాదాలు చెబితే, అరవింద్‌కు ఉన్న అభ్యంతరం ఏమిటని, ఆయన ఆక్రోశం దేనికోసమని ప్రశ్నించారు. పసుపు బోర్డు ప్రకటన, ఏర్పాటు విషయంలో అరవింద్ సమాఖ్య స్ఫూర్తిని ప్రదర్శించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున బోర్డు ఏర్పాటు విషయంలో తగినంత సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తాము ఇదివరకే తెలియజేసిన విషయాన్ని తుమ్మల గుర్తు చేశారు. అరవింద్ చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తున్నట్టు తుమ్మల ఆ లేఖలో పేర్కొన్నారు. 1983 నుండి ఇప్పటి వరకు తన రాజకీయ జీవితం తెరచిన పుస్తకమని, పదవుల కోసం, పార్టీ టికెట్ల కోసం ఏనాడు, ఏ నాయకుని వద్ద తాను మోకరిల్లలేదని , ఆత్మగౌరవాన్ని అమ్ముకున్నది కూడా లేదని, తన 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రతిక్షణం ప్రజాహితమే తప్ప, వ్యక్తిగత స్వార్థం లేదని, ఇకపై ఉండబోదని తుమ్మల తెలిపారు. నాటి నందమూరి తారక రామారావు లాంటి మహానుభావుల నుండి ప్రస్తుత రేవంత్ రెడ్డి వరకు ఏ కేబినెట్ లో పని చేసినా, ఏ హోదాలో విధులు నిర్వర్తించినా, రాష్ట్ర అభివృద్ధి, రైతులు సంక్షేమం, పేదల పక్షపాతం తప్ప,తనకు మరో ఎజెండా లేదని తుమ్మల చెప్పారు.

తెలంగాణ రాష్ట్ర సాధనలో ..

# నిశ్శబ్ధ సైనికుడు జైపాల్ రెడ్డి

సిఎం రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, మనోభావాలను కేంద్రం ప్రభుత్వానికి వివరించడంలో సఫలీకృతుమైన నాయకుడు జైపాల్ రెడ్డి అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం నిశ్శబ్ద సైనికుడిగా జైపాల్ రెడ్డి దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో సమన్వయం చేసి, రాష్ట్ర ఏర్పాటులో ఆయన అతికీలకమైన పాత్రను పోషించిన మట్టి బిడ్డ అని కొనియాడారు.

తెలంగాణ రాష్ట్ర సాకారంలో జైపాల్ రెడ్డి పోషించిన పాత్ర ప్రజలెప్పుడూ మరిచిపోరన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్, కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి జయంతి (జనవరి 16) సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు.

తెలంగాణ పల్లె నుంచి ఢిల్లీ వరకు ఎదిగిన జైపాల్ రెడ్డి దేశంలో అరుదైన రాజకీయ వేత్త అని, రాజకీయాల్లో నిష్కళంక నేతగా, విలువలకు ప్రతీకగా జైపాల్ రెడ్డి నిలిచారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో శాసనసభ్యునిగా,లోక్ సభ సభ్యునిగా, రాజ్యసభ సభ్యునిగా, విపక్ష నేతగా, కేంద్ర మంత్రిగా ఇలా అనేక పదవులకు జైపాల్ రెడ్డి వన్నె తెచ్చారన్నారు. యునైటెడ్ ఫ్రంట్ కామన్ మినిమం ప్రోగ్రామ్ రూపొందించడం ద్వారా దేశ ప్రాధాన్యాతలను గుర్తించిన నాయకుడని శ్లాఘించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఆ ప్రాంతానికి నీటిని ఇవ్వాలని మొట్టమొదట తలచిన నాయకుడు జైపాల్ రెడ్డి అని సిఎం గుర్తుచేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేయడానికి జైపాల్ రెడ్డి పునాదులు వేశారని, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఇటీవల మంత్రిమండలి తీర్మానించిన విషయాన్ని సిఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు.

జైపాల్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడే హైదరాబాద్ మెట్రో రైలు మంజూరైందన్నారు. విశిష్ట విలువలతో జీవితాంతం ప్రజాసేవకే అంకితమైన జైపాల్ రెడ్డి ఆశయాలను,ఆకాంక్షలను ముందుకు తీసుకుపోవడంలో ప్రతి ఒక్కరూ పాటుపడాలని సిఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదల




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉమ్మడి ప్రవేశ పరీక్షల (సెట్స్) పరీక్షల షెడ్యూల్ ఖారారైంది. 2025–26 విద్యాసంవత్సరానికి గాను వివిధ కోర్సులకు చెందిన ఉమ్మడి ప్రవేశ పరీక్షలకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించనున్నారు. ఈమేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాంవెంకటేశ్ 'టిజి సెట్స్–2025'ను బుధవారం విడుదల చేశారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు నిర్వహించే వివిధరకాల ప్రవేశ పరీక్షలను నిర్వహించనున్నారు.

| సెట్ పేరు | కోర్సు | యూనివర్సిటీ | ప్రవేశ పరీక్ష తేదీ |
|---|---|---|---|
| టిజి ఇఎపిసెట్ | బిఇ, బిటెక్, బిఫార్మ్, ఫార్మ్‌డి | జెఎన్‌టియుహెచ్ | ఏప్రిల్ 29,30 (అగ్రికల్చర్)మే 2 నుంచి 5వరకు (ఇంజనీరింగ్ ) |
| టిజి ఈ సెట్ | బిఇ, బిటెక్, బిఫార్మ్, బిఫార్మ(ద్వితీయ సంవత్సరం) | ఉస్మానియా | మే 12 |
| ఎడ్‌సెట్ | బిఇడి | కాకతీయ | జూన్ 1 |
| లాసెట్ | 3, 5 సంవత్సరాల ఎల్‌ఎల్‌బి | ఉస్మానియా | జూన్ 6 |
| పిజిఎల్‌సెట్ | ఎల్‌ఎల్‌ఎం | ఉస్మానియా | జూన్ 6 |
| ఐసెట్ | ఎంబిఎ, ఎంసిఎ | ఎంజియు | జూన్ 8,9 |
| పిజిఇసెట్ | ఎంఇ,ఎంటెక్, ఎంఫార్మ్, ఆర్క్ | జెఎన్‌టియు | జూన్ 16 నుంచి 19 |
| పిఇసెట్ | యుజిడిపిఇడి , బిపిఇడి | పాలమూరు | జూన్ 11 నుంచి 14 వరకు |

# నాటుసారా తయారీ నిర్మూలనపై నేటి నుంచి స్పెషల్ డ్రైవ్

30 రోజుల పాటు 13 జిల్లాల్లో 25 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక దాడులు

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో నాటుసారాను పూర్తి స్థాయిలో నిర్మూలించాలనే లక్ష్యంలో భాగంగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మరో మారు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ స్పెషల్ డ్రైవ్ గురువారం నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు (30రోజులపాటు) కొనసాగనుందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. గతంలో మూడు నెలల్లో జరిపిన ప్రత్యేక దాడుల్లో చాల వరకు నాటుసారా తయారీ అమ్మకాలు తగ్గాయి. మిగిలిన నాటుసారా ప్రభావిత ప్రాంతాల్లో మళ్లీ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు చేపట్టడానికి మరో నెల గడువు తీసుకుంటున్నారు. ఈ నెలరోజుల్లో చేపట్టే స్పెషల్ దాడులు చేపట్టాలని ఎక్సైజ్శాఖ నిర్ణయం తీసుకుంది. నాటుసారా తయారీని పూర్తిగా నిర్మూలన దిశగా ఎక్సైజ్ శాఖ అడుగులు కదుపుతోంది. తెలంగాణలో 13 జిల్లాలో 25 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న మండలాల్లో నాటుసారా తయారీ అవుతుందాని గుర్తించారు. నాటుసారా తయారీ మండలాలుగా గుర్తించిన ప్రాంతాల్లో నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించడానికి ప్రత్యేక కార్యా చరణ ఏర్పాటు చేసుకోవాలని ఎక్సైజ్ ఉన్నతాధికారులకు సర్క్యులర్లు జారీ చేశారు. ప్రధానంగా నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించడానికి అవసరమైన కార్యచరణతోపాటు, నాటుసారా తయారీ హాట్ స్పాట్స్‌ను గుర్తించాలని అదేశించారు. నాటుసారా తయారీ, రవాణ, అమ్మకాలతో పాటు ముడిసరుకు అక్రమ రవాణ, సప్లయర్స్, నాటుసారా తయారీ క్రిమినల్స్, నాటుసారా తయారుకు వినియోగించే బెల్లం, అలంను సరపరా చేసే నిందితుల సమాచారాన్ని సేకరించాలని అదేశాలు జారీ చేశారు. నాటుసారా ప్రభావిత స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఇంచార్జీలతోపాటు డిటి ఎస్ , ఎస్ టి ఎఫ్ టీమ్ల సహకారంతో నాటుసారాను పూర్తిగా లేకుండా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పోలీసుల సహకారం అవసరమున్న చోట తీసుకొని దాడులు కొనసాగించాలని అదేశించారు. ముఖ్యంగా నాటుసారా తయారీకి సరపతిరాదారుల గుట్టును రట్టు చేయడం తోపాటు వారిపై కేసులు నమోదు, దాడులు, పట్టుకున్న నాటుసారా, బెల్లం, అలం వివరాలను రోజువారిగా అందచేయాలని అదేశించారు.

**నాటుసారా ప్రభావిత ప్రాంతాలు ఇవే..**

మంచిర్యాల జిల్లాలో చెన్నూర్, లక్షెట్టిపేట, బెల్లంపల్లి, వనపర్తిలో వనపర్తి, కొత్తకోట, నాగర్కర్నూల్ జి ల్లాలో అచ్చంపేట, తేలకపల్లి, కల్వకుర్తి, వరంగల్రూరల్ జి ల్లాలో పరకాల, నర్సంపేట్, వర్ధనపేట, మహబూబాబాద్ జి ల్లాలో తొర్రూర్, మహబూబాబాద్ గూడేరు, భూపాల్పల్లిలో ములుగు, కాటారం, భూపాల్పల్లి, నల్లగొండలో దేవరకొండ, కొత్తగూడెంలో భద్రాచలం, మహబూబ్నగర్, పెద్దపల్లిలో సుల్తానాబాద్, జగిత్యాలలో ధర్మపురి, నిర్మల్ మండలాల్లో దాడులు నిర్వహించాలని అదేశాలు జారీ చేశారు.

**నాటుసారాను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యం.. విబి కమలాసన్‌రెడ్డి**

మొదటి దశ దాడుల్లో చేపట్టిన నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు మంచి ఫలితాలు ఇచ్చాయి. మొదటి సారి దాడుల్లో నాలుసారా, బెల్లం, అలంను పట్టుకోవడంతోపాటు బెల్లం సరఫ రా ముఠాల గుట్టు రట్టు చేశాం. ప్రభుత్వం నాటుసారాను పూర్తిగా నిర్మూలించాలనే అదేశాలతో మరోమారు నెల రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ ప్రణాళికలు తయారు చేశారు. ఈ దాడులు జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు కొనసాగుతాయి. ఈసారి జరిగే దాడుల్లో నాట్టుసారాను తయారీ అమ్మకాలు, రవాణను పూర్తిగా అరికట్టడం దిశగా దాడులు కొనసాగుతాయి.

## తెలంగాణకు మద్దతు ఇవ్వండి

సెమీ కండక్టర్ల ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి

కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సెమీ కండక్టర్ల ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణను అగ్రస్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, కేంద్రం కూడా సహకరించాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటి శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంత్రి శ్రీధర్ బాబు బుధవారం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో సెమీ కండక్టర్ల తయారీకి ముందుకొచ్చే పరిశ్రమలకు కల్పిస్తున్న ప్రోత్సాహకాలు, ఇతర అంశాలను మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుందని తెలిపారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. వచ్చే నెల 24న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బయో ఏషియా సదస్సుకు హాజరు కావాలని కోరారు.

**శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం**
కాళేశ్వరం గ్రామం, మహాదేవపూర్ మండలం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా.
Rc.No. 8/2025 సీల్డ్ టెండర్ ప్రకటన తేది: 15.01.2025
మహాశివరాత్రి 2025 ఏర్పాట్లు మరియు కుంభాభిషేకం 2025 ఏర్పాట్ల కొరకు తేదీ 24.01.2025 రోజున ఉదయం 10-00 గంటల నుండి ఈ దేవస్థాన కార్యాలయం వద్ద క్రింద చూపబడిన సీల్ టెండర్స్ నిర్వహించబడును. **1)** టెంట్ హౌస్ సామాగ్రి సప్లై చేయుట. **2)** లైటింగ్ & సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయుట. **3)** వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు, స్టిక్కర్లు, కరపత్రములు, ఆహ్వాన పత్రికలు ప్రింటింగ్ చేయుట, **4)** వీడియో & ఫోటోలు తీయుట, **5)** దేవాలయములకు పూల అలంకరణ. **టెండర్ దరఖాస్తుకు చివరి తేదీ:** 23.01.2025 సా.4.00 గం.ల వరకు, **సీల్ టెండర్ తేదీ:** 24.01.2025 మ,, 12.00 గం.ల వరకు స్వీకరించి 1.00 గం.కు తెరవబడును. ఈ టెండర్లలో హిందువులు మాత్రమే పాల్గొనవలెను. షెడ్యూల్ ధర ప్రతి టెండరుకు రూ. 500/- నగదు, ప్రతి టెండరుకు EMD షెడ్యూల్‌లో పేర్కొన్న ప్రకారం EO, SKMSD కాళేశ్వరం పేరున డి.డి. ద్వారా చెల్లించవలెను. పూర్తి వివరములకు కార్యాలయంలో ఉదయం 10.00 గంటల నుండి సా.4.00 గంటల వరకు నేరుగా గాని ఫోన్ నెం: 9441641455, 9491000880 ద్వారా గానీ సంప్రదించగలరు. మిగతా షరతులు షెడ్యూల్‌తో జతపరచబడును.
DIPR R.O. No. : 9061-PP/CL/ADVT/1/2024-25, Date: 15-01-2025 సం/- కార్యనిర్వహణాధికారి

ప్రజాపక్షం
గురువారం, జనవరి 16

# బరితెగించిన భాగవత్

ఆర్‌ఎస్‌ఎస్ అధిపతి మోహన్ భాగవత్ 2025 జనవరి 14న సరికొత్త వివాదం లేవనెత్తారు. వాస్తవం చెప్పాలంటే అది కొత్తదేమీ కాదు – సాంస్కృతిక సంస్థగా చెప్పుకుంటూ జనాలను మోసగించే హిందూ మతదురహంకార సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ మనస్సులోని మాట. ఆయన ఇండోర్‌లో ఒక సమావేశంలో ప్రసంగిస్తూ, ఇండియా అనే భారత్‌కు ''నిజమైన స్వాతంత్ర్య''సిద్ధిపై తమ అభిప్రాయాన్ని బహిర్గతం చేశారు. 1947 ఆగస్టు 15న బ్రిటీష్ వారినుంచి పొందింది 'రాజకీయ స్వాతంత్ర్యం' అన్నారు. అయోధ్యలో రామమందిరం 'ప్రాణ ప్రతిష్ట' జరిగిన రోజును 'నిజమైన స్వాతంత్ర్య దినం'గా ప్రకటించారు. ప్రధాని నరేంద్రమోదీ 2024 జనవరి 22న రామమందిర ప్రాణప్రతిష్ట చేశారు. అది 'పౌర్తిష్ట ద్వాదశి' అయినందున భాగవత్ ఆ తేదీని కూడా నిరాకరించి భారతదేశానికి నిజమైన స్వాతంత్ర్యం 'పౌష్య శుక్లపక్ష ద్వాదశి' రోజున అనగా 2025 జనవరి 11న వచ్చిందని సెలవిచ్చారు.

మోహన్ భాగవత్ ఉవాచను అనుసరించేటట్లయితే, ఆయన చెప్పిందే సరైందని అనుకునే పక్షంలో దానినుంచి మరో ప్రశ్న ఉదయిస్తుంది. భారతదేశ 'నిజమైన స్వాతంత్ర్య దినాని'కి ఎవరు ప్రారంభోత్సవం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనే జవాబు వస్తుంది. ఇండియాకు 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం సిద్ధించినట్లు స్వదేశంలో, విదేశాల్లో విశ్వసించేవారికి ఇది హాస్యాస్పదంగా కనిపించదూ! హిందూ జాతీయత ఉద్ధానాన్ని 'నిజమైన స్వాతంత్ర్యదినం'గా చెప్పటం ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘ్ చాలక్ యావత్ స్వాతంత్ర్య పోరాటాన్ని దానివెనుక కప్పిపుచ్చటానికి ప్రయత్నించాడు.

> రాహుల్‌గాంధి అన్నట్లు భాగవత్ చెప్పింది దేశ ద్రోహం కిందకు వస్తుంది. మరే దేశంలో అయినా ఇది జరిగి ఉంటే అతన్ని వెంటనే అరెస్టు చేసి, కోర్టులో విచారించేవారు. ప్రతిచిన్న విషయానికి 'రాజద్రోహ' చట్టాన్ని ప్రయోగించే ప్రధానమంత్రి, హోంమంత్రి దీన్నెలా సమర్థిస్తారు?

జాతీయ పతాకం, భారత రాజ్యాంగం పట్ల ఆర్‌ఎస్‌ఎస్ వైఖరిని తెలుసుకుంటే వాటిపట్ల వారి అగౌరవ, తిరస్కార భావన అర్థమవుతుంది. నాగపూర్‌లోని ఆర్‌ఎస్‌ఎస్ కేంద్ర కార్యాలయంలో 1947 ఆగస్టు 15న మొదటిసారి, 1950 జనవరి 26న రెండవసారి జాతీయజెండా ఎగురవేశారు. ఆ తదుపరి దేశ ప్రజలతోపాటు స్వాతంత్ర్యదినోత్సవం, రిపబ్లిక్ దినోత్సవం జరుపుకోవటం వారు మానివేశారు. ఆర్‌ఎస్‌ఎస్ వారు 2002 వరకు ఆ సాంప్రదాయం పాటించారు. అప్పుడు ప్రధానిగా ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ స్వయంసేవక్ అతల్ బిహారీ వాజ్‌పేయి 'రాజధర్మాన్ని సొంత ఇంట్లోనే పాటింపజేయలేనపుడు ప్రపంచానికి ముఖం ఎలా చూపనని' తమ గురుపీఠం నాయకత్వాన్ని ప్రాధేయపడి ఉండవచ్చు. జాతీయ పతాకావిష్కరణ బహిష్కరణను 2002 ఆగస్టులో మాత్రమే వారు విరమించుకున్నారు. 2004లో బిజెపి అధికారం కోల్పోయినా ఆర్‌ఎస్‌ఎస్ వారు జాతీయ సెంటిమెంటును అనుసరించారు. అదృష్టంకొద్దీ, పదేళ్ల తదుపరి బిజెపికి మళ్లీ అధికారమొచ్చింది.

భారత్ 2022లో తన 75వ స్వాతంత్ర్యదినం జరుపుకుంది. మోహన్ భాగవత్ 2009 మార్చి 21న ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘచాలక్‌గా బాధ్యతల్లోకి వచ్చారు. 75వ స్వాతంత్ర్యదినం సందర్భంగా నాగపూర్‌లో జాతీయ పతాకావిష్కరణ తదుపరి ప్రసంగంలో ఆయన చెప్పిన మాటలు వారి నిజ స్వరూపానికి నిదర్శనం: ''ఈ రోజు గర్వకారక దినం, సంకల్పదినం..అనేకమంది త్యాగాల తదుపరి దేశం స్వేచ్ఛ పొందింది. ఏ ఒక్కరి దయాదాక్షిణ్యాలతో ఈ స్వేచ్ఛ లభించలేదు...''

1947 ఆగస్టు 15న లభించింది రాజకీయ స్వాతంత్ర్యమని, ఆ తర్వాత రచించిన రాజ్యాంగం ఆనాటి దార్శనికత, స్ఫూర్తిని ప్రతిబింబించలేదని, ఒక నిర్దిష్ట దృష్టితో కూడినదని ఆయన ఇండోర్ సమావేశంలో అన్నారు. భారతదేశ ''నిజమైన స్వాతంత్ర్యం''అనేక శతాబ్దాల పాటు వేధింపులకు గురైందని, ఆ రోజున (రామాలయ ప్రాణ ప్రతిష్ట రోజు) అది వ్యవస్థాపితమైంది...భారతదేశానికి స్వాతంత్ర్యం ఉంది, కాని సంస్థాపితం కాలేదు'' అన్నారాయన. దీనిభావమేమంటే రామాలయం ప్రాణప్రతిష్టతో హిందూ రాష్ట్రస్థాపన జరిగింది. అదే నిజమైన స్వాతంత్రదినం. ఆ స్ఫూర్తికి అనుగుణంగా అంటే హిందూ ధర్మం ప్రకారం కొత్త రాజ్యాంగం రాయాలి. ఇది భారత రాజ్యాంగ స్ఫూర్తికి, ఆదేశానికి విరుద్ధం. రాహుల్‌గాంధి అన్నట్లు భాగవత్ చెప్పింది దేశ ద్రోహం కిందకు వస్తుంది. మరే దేశంలో అయినా ఇది జరిగి ఉంటే అతన్ని వెంటనే అరెస్టు చేసి, కోర్టులో విచారించేవారు. ప్రతిచిన్న విషయానికి 'రాజద్రోహ' చట్టాన్ని ప్రయోగించే ప్రధానమంత్రి, హోంమంత్రి దీన్నెలా సమర్థిస్తారు?

# కృత్రిమ మేధతో భారత్‌లో ఉద్యోగాలకు ముప్పు

కె. రవీంద్రన్

మనం 2025లోకి అడుగుపెడుతున్న తరుణంలోనే 20వ శతాబ్దం చివరలో ఇంటర్నెట్ తీసుకువచ్చిన పరివర్తనాపూరిత మార్పు తరహాలోనే కృత్రిమ మేధస్సు(ఎఐ)కూడా వేగంగా విస్తరించి ప్రపంచ చిత్రాన్ని తిరగరాసేందుకు సిద్ధంగా ఉంది. సంవత్సరం తొలి రోజుల్లోనే ఎఐ ఆధారిత టెక్నాలజీ స్టాక్‌లు గణనీయమైన పెరుగుదలను చవిచూశాయి. ప్రధాన టెక్ కంపెనీల షేర్లు 20శాతం వరకు పెరిగా యి.

దీంతో సంబంధం ఉన్న ఆర్థిక వాటాదారులు వేగంగా పెరుగుతున్నారు. యుఎస్ ఎఐ స్టార్టప్‌లు 2024లోనే అద్భుతమైన 97 బిలియన్ అమెరికన్ డాలర్‌లను సేకరించాయి. యూరోపియన్ సంస్థలు కూడా 62 బిలియన్ అమెరికన్ డాలర్‌లను సేకరించాయి. అందులో పాతిక శాతం ఎఐ వెంచర్ల వైపు మళ్ళించబడ్డాయి. ఈ గణనీయమైన పెట్టుబడి ప్రవాహం ఎఐ పెరుగుదలను సూచిస్తుంది. ఇది టెక్ చిత్రపటాన్ని పునర్నిర్మించడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమలలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని వాగ్దానం చేస్తుంది. ఎఐ వేగవంతమైన వృద్ధి ముఖ్యంగా భారత్ వంటి దేశాల్లో కొంత ఇబ్బంది కలుగజేయవచ్చు. ఎందుకంటే ఈ దేశాల్లో ఆటోమేషన్, ఎఐ టెక్నాలజీ విస్తృతంగా వినియోగిస్తున్నందున అది ముఖ్యంగా కార్మిక మార్కెట్‌లో అటు అవకాశాలు, ఇటు తీవ్రమైన సవాళ్ళను కూడా ముందుకు తీసుకువస్తుంది.

ఆర్థిక వ్యవస్థలను, పరిశ్రమలను పునర్నిర్మించడంలో ప్రత్యేకిం చి డేటా ప్రాసెసింగ్, ఎఐ వంటి రంగాలకు అపారమైన అవకాశాలు ఉన్నాయి. నిత్య వినియోగదారులకు ఈ సాంకేతిక పరిజ్ఞానాలను మరింత చేరువ చేయడానికి ప్రధాన కంపెనీలు ప్రవేశపెడుతున్న ఎఐ, ఇతర పరికరాలు మరింత సహాయంగా ఉంటున్నాయి. ఇది ముఖ్యంగా సామర్థ్యం, ఖర్చు ఆదా, వ్యాపార వృద్ధి పరంగా, కొత్త అవకాశాలకు తెరతీస్తుంది. కార్మికులపై ప్రభావం సార్వత్రికంగా సానుకూలంగా ఉండవు. ఆటోమేషన్ టెక్నాలజీ ప్రవేశపెట్టటం భారతదేశం వంటి అధిక శ్రామికుల ఆధారిత ఆర్థిక వ్యవస్థలలో పని స్వభావాన్ని తీవ్రంగా మార్చేస్తుంది. అధిక శ్రామికుల ఆధారిత రంగాలు దేశ ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన భాగంగా ఉన్నందున, ఎఐ పెరుగుదల వివిధ పరిశ్రమలలో మిలియన్ల కొలది కార్మికులను స్థానభ్రంశం చేసే ప్రమాదాన్ని తీసుకువస్తుంది.

దేశంలో అత్యధికంగా ఉద్యోగాలు కల్పించే తయారీరంగం కొనసాగుతున్న ఎఐ విప్లవం కారణంగా భారీ సమస్యనే ఎదుర్కొంటుంది. మెకిన్సే గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ అంచనా ప్రకారం 2030 నాటికి భారతదేశ తయారీరంగంలో ఆటోమేషన్ కారణంగా 60 మిలియన్ల మంది కార్మికులు స్థానభ్రంశం చెందుతారు, ముఖ్యంగా వస్త్రాలు, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాలలో. ఈ పరిశ్రమలో మానవ శ్రమ సాంప్రదాయకంగా ఉత్పత్తిలో అంతర్భాగంగా ఉంది. విడిభాగాలను అమర్చడం(అసెంబ్లీ), నాణ్యత నియంత్రణ ,డిజైన్ వంటి పనులను నిర్వహించగల ఎఐ వ్యవస్థలు పెద్ద మానవ శ్రామిక శక్తి అవసరాన్ని భర్తీ చేయవచ్చు. ఉదాహరణకు, వస్త్ర రంగంలో బట్టలను కత్తిరించడం, కుట్టడం వంటి పనులను ఎఐ, రోబోటిక్స్ మరింత కచ్చితత్వం, సామర్థ్యంతో నిర్వహించగలుగుతాయి. ఫలితంగా ఆ ఉత్పత్తి విభాగాల్లో ఉద్యోగాలు తగ్గిపోతాయి. ఎలక్ట్రానిక్స్, ఎఐ వ్యవస్థలు తయారీరంగ ప్రక్రియలను మాత్రమే కాకుండా టెస్టింగ్, సిస్టమ్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన పనులను కూడా చేపట్టగలవు, దీంతో ప్రస్తుత శ్రామిక శక్తిలో అధిక భాగం పనిలేకుండా మారుతుంది.

తయారీరంగంలో పని కోల్పోయిన కార్మికులలో చాలామంది, ముఖ్యంగా తక్కువ నైపుణ్యం ఉన్న స్థానాల్లో ఉన్నవారు, కొత్త పాత్రల్లోకి మారడానికి అవసరమైన నైపుణ్యాలను కలిగి ఉండకపోవచ్చు. తగినంత శిక్షణ, పునఃనైపుణ్య శిక్షణ లేకుండా, ఈ వ్యక్తులు వేగంగా మారుతున్న ఆర్థిక వ్యవస్థలో వెనుకబడవచ్చు. ఇది దేశంలో నిరుద్యోగం, నిరుద్యోగ సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. ఆటోమేషన్ దిశగా మార్పు కొత్తగా ఎలాంటి పాత్రలు సృష్టిస్తుందో అనే ప్రశ్న కూడా ఉదయిస్తోంది. ఎఐ అభివృద్ధి, నిర్వహణ వంటి రంగాలలో ఎఐ కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుందని కొందరు వాదిస్తున్నప్పటికీ, కొత్త పాత్రలు ఎక్కువ మంది శ్రామిక శక్తి కేంద్రీకృతమై ఉన్న భారతదేశంలోని గ్రామీణ, సెమీఅర్బన్ ప్రాంతాలలో స్థానభ్రంశం చెందిన శ్రామిక శక్తికి అందుబాటులో ఉంటాయి అనేది ప్రశ్నగా ఉంది.

భారతదేశ ఆర్థిక వృద్ధికి వెన్నెముకగా చాలా కాలంగా పరిగణించబడుతున్న ఐటి, సేవల రంగాలు కూడా ఎఐ తీసుకువచ్చిన మార్పులకు అతీతం కావు. ప్రపంచ ఐటి ఔట్‌సోర్సింగ్ కేంద్రంగా భారతదేశం ఉంది. సాఫ్ట్‌వేర్ డెవలప్మెంట్, సిస్టమ్ టెస్టింగ్, టెక్నికల్ సపోర్ట్ వంటి రంగాలలో గణనీయమైన సంఖ్యలో ఉద్యోగులు పనిచేస్తున్నారు. భారతీయ కార్మికులు సాంప్రదాయకంగా నిర్వహించే ఆటోమేటెడ్ కోడింగ్ సిస్టమ్స్, టెస్టింగ్ టూల్స్, వర్చువల్ అసిస్టెంట్లు వంటి అనేక ప్రాథమిక ఐటి పనులు సైతం ఎఐ సాంకేతికతలు మరింతగా అభివృద్ధి చెందుతుండడంతో ఆటోమేటెడ్ అవుతున్నాయి. ఈ ప్రాథమిక ఐటి విధుల ఆటోమేషన్ ప్రారంభ స్థాయి ఉద్యోగాలలో గణనీయమైన తగ్గింపుకు దారితీస్తుందని మెకిన్సే నివేదిక పేర్కొంటుంది. ఇది సాంప్రదాయకంగా భారతదేశంలో ఎదుగుతున్న మధ్యతరగతికి ఉపాధికి ప్రధాన వనరు. జీవనోపాధి కోసం ఐటి ఔట్‌సోర్సింగ్‌పై ఆధారపడే ఈ కార్మికులు, కోడ్ జనరేషన్, బగ్ టెస్టింగ్, రొటీన్ సిస్టమ్ మెయింటెనెన్స్ వంటి పనులను ఎఐ వ్యవస్థలు ఎక్కువగా చేపట్టడంతో పెద్దసంఖ్యలో స్థానభ్రంశం ఎదుర్కోవలసి రావచ్చు.





దేశంలో అతిపెద్ద యజమానుల్లో ఒకటైన మాన్యుఫాక్చరింగ్ (తయారీ) రంగం ఎఐ విప్లవం కారణంగా పెద్దగా అంతరాయాలకు గురికావచ్చు. ఆటోమేషన్‌వల్ల భారత్‌లో 2030 నాటికి మాన్యుఫాక్చరింగ్ రంగంలో – ముఖ్యంగా టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 6 కోట్లమంది వరకు ఉపాధులు కోల్పోవచ్చునని మెకెన్సీ అంచనా.

భారతదేశ ఐటి, సేవల రంగాలలో ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదాలు ఎఐ ద్వారా ఎదురయ్యే సవాళ్లను నొక్కి చెబుతుంది. తక్కువ ఖర్చుతో అధిక నాణ్యత సేవలను అందించగల సామర్థ్యం కారణంగా ఒకప్పుడు ప్రపంచం అసూయపడే భారతదేశ ఐటి శ్రామిక శక్తి, అదే పనిని వేగంగా, తక్కువ ఖర్చుతో చేయగల ఎఐ ఆధారిత వ్యవస్థల నుండి తీవ్రమైన పోటీని ఎదుర్కోవలసి రావచ్చు. ఎఐ మరింత అధునాతనంగా మవుతున్న కొద్దీ, అది త్వరలోనే ఆటోమేట్ ద్వారా చేయడానికి చాలా క్లిష్టంగా ఒకప్పుడు పరిగణించబడిన విస్తృత శ్రేణి పనులను ఎఐ నిర్వహించగలదు. ఇది ఐటి రంగంలో, ముఖ్యంగా ఎంట్రీలెవల్ ఉద్యోగులలో పెద్ద ఎత్తున అవాంతరాలకు దారితీయవచ్చు. వారు ఎఐ ఆధిపత్య రంగంలో నూతన అవకాశాలను కనుగొనడంలో ఇబ్బంది పడవచ్చు.

ఎఐ, ఆటోమేషన్ టెక్నాలజీలు ఆర్థిక వ్యవస్థలోకి చొరబడటం ప్రారంభించడంతో తయారీ, ఐటి వంటి నియత రంగాలకు మించి, భారతదేశ విస్తారమైన అనియత శ్రామిక శక్తి మరింత ఎక్కువ నష్టాలను ఎదుర్కొంటుంది. భారతదేశంలోని దాదాపు 90 శాతం శ్రామిక శక్తి అనియత రంగంలో పనిచేస్తోంది, ఇక్కడ కార్మికులకు సాధారణంగా అధికారిక ఒప్పందాలు, సామాజిక భద్రతా ప్రయోజనాలు, తిరిగి శిక్షణ పొందే అవకాశాలు లేవు. ఉద్యోగ భద్రత ,సంస్థాగత మద్దతు లేకపోవడంతో చాలామంది అనియత కార్మికులు ముఖ్యంగా సాంకేతిక ఇబ్బందులకు గురవుతారు. వీధి విక్రేతలుగా, డ్రైవర్లుగా లేదా చిన్నస్థాయి సేవా ఉద్యోగాలలో పనిచేస్తున్న చాలామంది అనియత కార్మికులకు నియత రంగ ఉద్యోగులకు ఉండే నిరుద్యోగ భృతి లేదా విరమణ ప్యాకేజీలు వంటివి లేవు.

ఎఐ సాంకేతికతలు ఆర్థిక వ్యవస్థలోకి ఎక్కువగా ప్రవేశించేకొలదీ, అనియతరంగ కార్మికులు మొదటగా వాటి ప్రభావానికి గురయ్యే అవకాశం ఉంది. ఉదాహరణకు, స్వయంచోదిత వాహనాలు, డెలివరీ రోబోట్ల పెరుగుదల రవాణా, లాజిస్టిక్స్ వంటి రంగాలలో భారీ స్థానభ్రంశానికి దారితీయవచ్చు, ఇక్కడ పెద్ద సంఖ్యలో అనియత కార్మికులు పనిచేస్తున్నారు. ఆదాయం కోసం వారి నైపుణ్యాలపై ఆధారపడే డ్రైవర్లు, డెలివరీ సిబ్బంది, చిన్న తరహా సేవలందించేవారి స్థానంలోకి ఎఐ ఆధారిత ప్రత్యామ్నాయాలు రావచ్చు; వ్యవసాయం, నిర్మాణం, తక్కువనైపుణ్యం సేవలలో ఉద్యోగాలు కూడా ఆటోమేషన్‌కు లోనయ్యే అవకాశం ఉంది. వ్యాపారులు ఖర్చులను తగ్గించగల సాంకేతికతను స్వీకరించడానికి ఆసక్తి చూపే చోట్ల ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో ఆటోమేషన్ ఉంటుంది.

భారతదేశంలో ఎఐ విస్తరణ వల్ల ఎదురయ్యే సవాళ్లు ఆర్థికంగానే కాకుండా సామాజికంగా కూడా ఉంటాయి. అనియత శ్రామిక శక్తికి, దాని స్వభావం రీత్యానే, నియత రంగంలోని కార్మికులకువలె తిరిగి శిక్షణ పొందే కార్యక్రమాలు లేదా కొత్త పాత్రలకు మారగల కార్యక్రమాలు అందుబాటులో లేవు. భారతదేశంలో విద్య , నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు అందుబాటులో ఇప్పటికే అసమానతగా ఉంది. అనియత రంగాలలోని కార్మికులు ఎఐ ఆధారిత ఆర్థిక వ్యవస్థ డిమాండ్లకు అనుగుణంగా మారడం చాలా కష్టంగా మారవచ్చు. అంతేకాకుండా, బలమైన సామాజిక భద్రతా వలయం లేకపోవడం ఈ సవాళ్లను మరింత పెంచుతుంది. దీని వలన స్థానభ్రంశం చెందిన కార్మికులు తక్కువ ఆర్థిక లేదా సంస్థాగత మద్దతుతో అనిశ్చితిని ఎదుర్కొంటారు. **(ఐపిఎ సర్వీస్)**

## పెరుగుతున్న రిటైల్ ద్రవ్యోల్బణం

భారతదేశంలో వినియోగ ధరల సూచీ (CPI)ఆధారంగా రిటైల్ ద్రవ్యోల్బణం డిసెంబర్ 2024లో 5.22 శాతానికి తగ్గిం ది, ఇది నవంబర్‌లో 5.48శాతంగా ఉంది. ఈ తగ్గుదల ప్రధానంగా కూరగాయలు, తృణధాన్యాలు, పప్పులు వంటి ఆహార ధరల సడలింపుకు సంబంధించినది.

**ప్రధానాంశాలు:** ఆహార ద్రవ్యోల్బణం: డిసెంబర్‌లో కన్స్యూమర్ ఫుడ్ ప్రైస్ ఇండెక్స్ (CFPI) ద్రవ్యోల్బణం 8.39శాతంగా నమోదైంది, ఇది నవంబర్‌లో 9.04 శాతంగా




ఉంది. గ్రామీ ణ పట్టణ ద్రవ్యోల్బణాలను సరిపోల్చి చూ స్తే, గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 5.76 శాతం ఉండగా, పట్టణ ప్రాంతాల్లో ఇది 4.58 శాతంగా ఉంది.

మాసిక కన్స్యూమర్ ఫుడ్ ప్రైస్ ఇండెక్స్ (సిపిఐ)మార్పును పరిశీలిస్తే, డిసెంబర్‌లో(సిపిఐ)నెలవారీ ఆధారంగా 0.56 శాతానికి తగ్గింది, ఇది సెప్టెంబర్ 2023 నుండి అత్యధిక తగ్గుదలగా చెప్పుకోవచ్చు.

**తులనాత్మక దృష్టికోణం:**

జాతీయ స్థాయిలో, భారతదేశ ద్రవ్యోల్బణం దేశాల సగటు ద్రవ్యోల్బణం కంటే ఎక్కువగా ఉంది, ఇది అక్టోబర్ 2024లో 4.5శాతంగా ఉంది. ఈ తులనతో(సరిపోల్చటంతో), భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రత్యేక సవాళ్లు, ముఖ్యంగా మొత్తం ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపే ఆహార ధరల నిర్వహణలో, స్పష్టమవుతుంది.

ద్రవ్య పరపతి విధానంపై ప్రభావం:

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్.బి. ఐ.) ద్రవ్యోల్బణాన్ని 4 శాతం వద్ద, 2 శాతం సహన శ్రేణితో, నిర్వహించడానికి లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత రేటు ఈ లక్ష్యాన్ని మించిపోయినప్పటికీ, తగ్గుతున్న ధోరణి ఆర్.బి.ఐ.ని.తన ద్రవ్య పరపతి సమీక్షలో ప్రస్తుత 6.50 శాతం రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించడానికి ప్రోత్సహించవచ్చు. అయితే, కరెన్సీ విలువ తగ్గ డం మరియు గ్లోబల్ ఆర్థిక పరిస్థితులు ఈ నిర్ణయంపై ప్రభావం చూపవచ్చు. మొత్తానికి రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గడం కొంత ఊరటనిచ్చినప్పటికీ, ఆర్.బి.ఐ. లక్ష్యాన్ని మించిపోవడం కొనసాగుతున్నందున నిరంతర జాగ్రత్తపడటం అవసరం. కేంద్ర బ్యాంక్ యొక్క రాబోయే నిర్ణయాలు ఆర్థిక వృద్ధి, ధరల స్థిరత్వం వైపు ఆర్థిక వ్యవస్థను దారితీసే విషయంలో కీలకంగా ఉంటాయి.

డా.కోలాహలం రామ్ కిశోర్
9849328496

## దేశ సరిహద్దు గోడలు.. ఆర్మీ జవాన్లు

అత్యంత ధైర్యసాహసాలకు, అలుపెరుగని పోరాట పటిమకు, సాహసోపేత త్యాగమయ జీవితాలకు, ఉరకలెత్తే దేశభక్తి ఉత్సాహానికి, భరతమాత రక్షణకు కంకణం కట్టుకొని ప్రాణత్యాగం చేయడానికి నిలువెత్తు చిరునామా మన ఇండియన్ ఆర్మీ శక్తివంతమైన బలగాలు. 1895లో ఈస్ట్ ఇండియా కంపెనీ ఏర్పాటు చేసిన బ్రిటీష్ ఈస్ట్ ఇండియా భారత ఆర్మీ, తదుపరి వలస పాలన సమయంలో 'బ్రిటీష్ ఇండియన్ ఆర్మీ' కొనసాగి, స్వాతంత్ర్యానంతరం ఇండియన్ ఆర్మీగా రూపాంతరం చెందింది. దేశ రక్షణతో పాటు మానవీయ సంక్షోభ సమయాల్లో అంతర్గత శాంతి స్థాపనకు అమూల్య సేవలను అందిస్తున్న ఇండియన్ ఆర్మీ తొలి కమాండర్ ఇన్ చీఫ్ బాధ్యతలను ఫీల్ మార్షల్ కె ఎం కరియప్ప 15 జనవరి 1949 శుభగడియల్లో నాటి బ్రిటీష్ జనరల్ ఫ్రాన్సిస్ బుచ్చర్ నుండి తీసుకోవడం జరిగింది. ఈ అపూర్వ శుభ సందర్భానికి గుర్తుగా ప్రతి ఏట 15 జనవరి రోజున మన త్రివిధ రక్షణ బలగాలు ఇండియన్ ఆర్మీ దినోత్సవం ఘనంగా నిర్వహించకపోవడం ఆనవాయితీగా మారింది.

**దేశ భద్రతే ఊపిరిగా:** అభేద్యమైన మన ఇండియన్ ఆర్మీలో 49,932 మంది అధికారులతో కలిపి 12,37,127 మంది సైనిక సిబ్బంది, 9,60,000 మంది రిజర్వ్ సిబ్బంది నిరంతరం దేశ భద్రత, అంతర్గత శాంతి స్థాపన బాధ్యతలను పరమ పవిత్ర భావనలతో నిర్వహిస్తున్నది. సేవ పరమో ధర్మః(సేవయే అత్యుత్తమ ధర్మం) అనే నినాదంతో దేశానికి ముళ్ల కంచెలుగా నిలబడి దేశ భద్రతను కాపాడే బాధ్యతలను భుజాన వేసుకొని నిర్వహిస్తున్న ఇండియన్ ఆర్మీకి సుప్రీమ్ కమాండర్ గా రాష్ట్రపతి, చీఫ్ ఆఫ్ ఆర్మీగా అత్యున్నత ఆర్మీ అధికారి నాయకత్వ బాధ్యతలను నిర్వహిస్తారు. దేశ భద్రతకు ముప్పు వచ్చిన ప్రతి సందర్భంగా యుద్ధభూమిలో ముందుండి శత్రు సైన్యానికి చెమట పట్టించగల ఇండియన్ ఆర్మీ ఇప్పటికే నాలుగు మేజర్ ఇండోపాక్ యుద్ధాలు (1948, 1965, 1971, 1999),ఒక ఇండోచైనా యుద్ధాలు (1962,1967)లో పాల్గొని తన సత్తాను చాటుకుంది.



**77వ ఇండియన్ ఆర్మీ దినోత్సవం:** 15 జనవరి 2025న నిర్వహిస్తున్న 77వ ఇండియన్ ఆర్మీ దినోత్సవంలో దేశ భద్రత ఊపిరిగా సేవలందించి అమరత్వం పొందిన సైనికులకు నివాళులు అర్పించడం, వారి కుటుంబాలకు చేయూత ఇవ్వడం, అత్యుత్తమ ధైర్యసాహసాలు ప్రదర్శించిన వీర జవాన్లకు అవార్డులు ప్రదానం చేయడం, ఆర్మీ పరేడ్స్ నిర్వహించడం, మన ఇండియన్ ఆర్మీ అమ్ములపొదిలో మన విజయానికి చేయూతనిస్తున్న అత్యాధునిక ఎలక్ట్రానిక్ ఉపకరణాలు/ఆయుధాలను ప్రదర్శించడం లాంటి కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ధైర్యం, అంకితభావం, త్యాగాలకు ప్రతీకలుగా నిలుస్తున్న ఇండియన్ ఆర్మీ జవాన్లకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేసే శుభ సందర్భం గా ప్రతి భారతీయ పౌరుడు భావించాలి. పౌర సమాజం చూపే ప్రేమానురాగాలు మన ఆర్మీ ఆత్మవిశ్వాసాలను ఇనుమడింపజేస్తాయి. యూనిఫారం ధరించిన ప్రతి జవాను మనకు ఎదురైన ప్రతి సందర్భంలో ఆ దేశ భక్తుడికి అప్రయత్నంగా సలామ్ చేయాలనే మధురానుభూతి కలగ డం సర్వసాధారణం. నేడు మనందరం ముక్తకంఠంతో జై జవాన్ ; జై కిసాన్ అని నినదిద్దాం, మన రేపటి తరాన్ని త్రివిధ దళాల్లో చేరే విధంగా మార్గదర్శనం చేద్దాం.

## రైతులపట్ల మొసలికన్నీరు ... రాజకీయ పార్టీలను నమ్మేదెలా?

లేఖ

రైతురుణమాఫీ ఇంకెప్పుడు రైతుభరోసా ఇంకెప్పుడు అని ప్రతిరోజు ప్రభుత్వంపైన ఒత్తిడి పెంచుతున్న రాజకీయపార్టీలు మరియు అట్టి పార్టీల నాయకులందరికీ రాష్ట్ర రైతుల తరపున ధన్యవాదాలు. ఒక్క ఎకరా ప్రధాన పంటలపైన రైతును 30వేల రూపాయిలనుంచి 60వేలరూపాయిలకన్నా ఎక్కువగా ఆర్థికంగా నష్టపరుస్తున్న కేంద్రప్రభుత్వ పరిధిలోని అంశాల గురించి నోరుమెదపకుండా కేవలం తాత్కాలిక ఉపశమనం కలిగించే రైతుభరోసా, రైతురుణమాఫీ అంశాలపైన రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీలు చేపటుతున్న ధర్నాలలో రైతులెవ్వరు పాల్గొనడం లేదు. మనదేశం శరవేగంగా అభివృద్ధి చెందుతు ప్రపంచంలోనే 5వఆర్థికశక్తిగా ఎదిగినప్పటికి, కేంద్రప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలవలన దేశజనాభాలో 50%పైగా వున్న రైతులు, వారికుటుంబసభ్యులు ఇప్పటికి అప్పుల బ్రతుకులు బ్రతుకుతున్నారు.

కేంద్రప్రభుత్వం రైతుపండించిన పంటకు గిట్టుబాటు అయ్యేవిధంగా ఎంఎస్‌పి నిర్ణయించాలని ప్రకటించిన ఎంఎస్‌పికి చట్టబద్ధత కల్పించాలని, పంట నష్టం జరిగినప్పుడు ఆదుకొనే విధంగా పంటల బీమాపథకం అమలు చెయ్యాలని ప్రైవేట్ అప్పుల అధికవడ్డి నుంచి కాపాడడానికి బ్యాంకులద్వార దీర్ఘకాలిక రుణాలు ఇవ్వాలని ఇంకా చాలా సమస్యలు రైతులకు అనుకూలంగా వుండే విధంగా పరిష్కరించాలని 70సం.ల వయస్సులో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న పంజాబ్ రాష్ట్రానికి చెందిన రైతునాయకుడు శ్రీ జగజ్జీత్‌సింగ్ డల్లేవాల్ చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష సంక్రాంతి రోజుకు 50రోజులు నిండినది. కానీ కేంద్రప్రభుత్వం రైతులను ఆర్థికంగా బాగుపరిచే ఒక్క చర్యకూడా చేపట్టడానికి ఒప్పుకోవడంలేదు. రాష్ట్ర రైతులు ఆర్థికంగా బాగుపడాలని కోరుకొనే ప్రతిపక్షపార్టీలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాల్సిన రైతుభరోసా రైతురుణమాఫీతో బాటు కేంద్రప్రభుత్వ పరిధిలోని రైతు ఆర్థికస్థితిని శాసించే అంశాలన్నీ రైతుకు అనుకూలంగా ఉండే విధంగా పరిష్కరించాలని ధర్నాలు చేసినచో, రాష్ట్ర రైతులు రాజకీయపార్టీల నిజాయతీని నమ్మే అవకాశం ఉంటుంది. లేనిచో కేవలం రాష్ట్రంలోని అధికారపార్టీని మరియు రాష్ట్రప్రభుత్వాన్ని ఇరకాటంలోపెట్టి త్వరలో రానున్న స్థానిక సంస్థాగత ఎన్నికలలో రైతుల సానుభూతితో లబ్ధిపొందాడానికి చేస్తున్నఎత్తుగడలని భావించవలసివస్తుంది

పాకాలశ్రీహరిరావు

## భారత సైన్యంలో 'రోబోటిక్ మ్యూల్స్'

భారతసైన్యంలో 'రోబోటిక్ మ్యూల్స్' సందడి చేయనున్నాయి. 77వ సైనిక దినోత్సవం సందర్భంగా పుణెలోని 'బాంబే ఇంజనీరింగ్ గ్రూప్' (బిఇజి) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శన ప్రేక్ష కులను ఆకట్టుకుంది. నాలుగు పాదాలతో కూడిన రోబోలు శిక్షణ పొందిన సైనికుల్లా కవాతు చేయడం అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరించింది. అత్యాధునిక సాంకేతికతతో సిద్ధం చేసిన ఈ రోబోను ఢిల్లీకి చెందిన ఏరో ఆర్క్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తయారు చేసింది. వీటికి 'ఆర్మీ మ్యూల్స్' అని పేరు పెట్టింది. వంద వరకూ ఈ రోబోలను భారత సైన్యం కొనుగోలు చేసిందని సమాచారం. వీటిలోని కంప్యూట్ బాక్స్ అనేది మెదడులా పనిచేస్తుంది. రోబోలోని బ్యాటరీని ఒకసారి ఛార్జి చేస్తే 20 గంటలు పనిచేస్తుంది. దీని తల వెనుక భాగంలో ఉన్న సెన్సార్ల సాయంతో, పరిసరాల్లో ఏమున్నాయనే విషయాన్ని రోబో గుర్తిస్తుంది. సెకనకు మూడు మీటర్ల వేగంతో ముందుకు కదిలే ఈ రోబో బరువు 51 కిలోలు. అవసరమైన ప్రాంతాలకు, 12 కిలోల కంటే తక్కువ బరువుగల చిన్నపాటి తుపాకులతోపాటు, కెమెరాలు, డ్రోన్లను మోసుకెళ్లే శక్తిసామర్థ్యాలు ఈ రోబోకు ఉన్నాయి. ఇవి మెట్లు, కొండలు ఎక్కుతాయి. బురదమయమైన ప్రాంతాల్లోనూ నడుస్తాయి. అధిక ఉష్ణోగ్రతను కూడా తట్టుకునే రీతిలో వీటిని తయారు చేశారు. గరిష్టంగా 55 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉన్నప్పటికీ ఇవి యాక్టివ్‌గానే ఉంటాయి. ఈ ప్రత్యేకతల కారణంగానే భారత సైన్యానికి ఈ రోబో లు ఎన్నో విధాల ఉపయోగపడతాయి.






## వినూత్న ఆలోచనలకు కార్యరూపమే అంకుర సంస్థలు!

అత్యాధునిక డిజిటల్ ప్రపంచంలో 3వ అతి పెద్ద 'స్టార్టప్‌ల హబ్(అంకుర కేంద్రం)'గా యువభారతం అవతరించడం హర్షదాయకం. ఒక సరి కొత్త ఆలోచనతో మొదలు పెట్టే వినూత్న వ్యాపార ప్రారంభ దశను స్టార్టప్ అని పిలుస్తారు. స్టార్టప్ అనే పదానికి అంకురార్పణ, ఉపారంభం, నాంది, శ్రీకారం, సమారంభం అనే అర్థాలు ఉన్నాయి. సాధారణంగా ప్రారంభదశలో ఉన్న వాణిజ్య సంస్థలను స్టార్టప్‌లు లేదా అంకుర సంస్థలుగా పిలుస్తాం. స్టార్టప్‌లను ప్రారంభించడం అంత సులభమేమీ కాదు. మన వినూత్న ఆలోచనలు కార్యరూపం దాల్చడానికి కంపెనీ స్థాపన, నిధుల సేకరణ, మౌళిక వనరులు/వసతుల కల్పన, మానవ వనరులు, సరైన శ్రమ అవసరం అవుతాయి. 2023 నాటికే కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన 1,15,000 స్టార్టప్‌లు దేశవ్యాప్తంగా టెక్నాలజీ, వ్యవసాయం, విద్య, ఆరోగ్య సంరక్షణ లాంటి రంగాల్లో ప్రారంభం కావడంతో రానున్న రోజుల్లో యువభారత స్టార్టప్‌ల ఎకో సిస్టమ్ మరింత పుంజుకోనున్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.

**ఆత్మ నిర్భర భారతానికి వెన్నెముక:**

ఆత్మ నిర్భర భారత్ నిర్మాణానికి వెన్నెముక వలె అన్ని రంగాల్లో స్టార్టప్‌లు ప్రారంభం కావాలని 2022లో మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భావించి ప్రారంభించిన 'జాతీయ స్టార్టప్ దినోత్సవం' ప్రతి ఏట 16 జనవరి రోజున నిర్వహించడం ఆనవాయితీగా మారింది. స్టార్టప్‌ల స్థాపనలు పుంజుకున్నపుడు దేశ ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ ఉపాధుల కల్పన, అంకుర సంస్థల ప్రగతి, స్వయం సమృద్ధ భారతం, ఆత్మనిర్భర భారత్, 2047నాటికి వికసిత్ భారత్ కలల సాకారం, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు చొరవ తీసుకోవడం లాంటి పలు ప్రయోజనాలు కలుగుతాయి.




'స్టార్టప్ ఇండియా స్కీమ్' ప్రారంభం:

దేశాభివృద్ధిలో స్టార్టప్‌ల అమూల్య పాత్రను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2016లోనే స్టార్టప్ ఇండియా స్కీమ్‌ను తీసుకురావడం జరిగింది. ఈ పథకం ద్వారా స్టార్టప్‌లకు సులభ రిజిస్ట్రేషన్ల వ్యవస్థ, పన్ను ల్లో రాయితీలు, ఆర్థిక చేయూత, సులభ వ్యాపార విధానాలు, ఇన్నోవేషన్‌కు ఊతం ఇవ్వడం, పాలసీలను రూపొందించడం, పరిశ్రమలు అకడమియా అనుసంధానాలు, ఇంక్యుబేషన్ మెంటర్‌షిప్ లాంటి పలు సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తున్నది. నేడు భారత్‌లో ఉన్న 1.15లక్షల రిజిస్టర్డ్ స్టార్టప్‌లతో 100యూనికాన్స్, వివిధ రంగాలకు విస్తరణలు, మార్గ్ ప్లాట్‌ఫామ్, క్రెడిట్ గ్యారంటీ స్కీమ్, ఫండ్ ఆఫ్ ఫండ్స్ లాంటి ప్రోత్సాహ క పథకాలు తీసుకురావడం సంతోషదాయకం. నేటి జాతీయ స్టార్టప్ దినోత్సవ వేదికగా పరిశోధనలకు ప్రేరణ, గ్రామీణాభివృద్ధి దిశగా స్టార్టప్‌ల స్థాపనలు, అంతర్జాతీయ సహకారం, టెక్నాలజీ అభివృద్ధి, సమస్యల పరిష్కారం, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల కు అనువైన వాతావరణ కల్పన, డిజిటల్ రంగంలో సానుకూల మార్పు లు లాంటి అత్యవసర సౌకర్యాలు సత్వరమే అందుబాటులోకి తేవాలని కోరుకుందాం. యువ భారత్ అంటే స్టార్టప్‌ల పర్యాయపదంగా నిలవాలని ఆశిద్దాం. ప్రతి ఒక్క స్టార్టప్, వినూత్న ఆలోచన ప్రగతికి వేసిన మరో ముందడుగు అని భారత యువత నమ్మాలి.

(16 జనవరి జాతీయ స్టార్టప్ దినోత్సవం సందర్భంగా)

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి,
9949700037

# ఛత్తీస్‌గఢ్‌లో చల్లారని 'అసిస్టెంట్ టీచర్ల' నిరసన జ్వాల

రాయ్‌పూర్ జిల్లా 'టుటా' గ్రామంలో చలిని లెక్కచేయకుండా గత నెలరోజులుగా ఆందోళన


ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఇటీవల 2800 మందిని తొలగించిన ప్రభుత్వం

ప్రభుత్వం నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని అభ్యర్థిస్తున్న బాధిత ఉపాధ్యాయులు



**రాయ్‌పూర్ :** కోర్టు ఉత్తర్వుల మేరకు రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్ నుంచి తొలగించబడ్డ అసిస్టెంట్ టీచర్లు చల్లని వాతావరణంలో రాయ్‌పూర్ జిల్లాలోని 'టుటా' గ్రామాన్ని ఇల్లుగా మార్చుకుని నిరసన తెలుపుతు న్నారు. గత నెలరోజులుగా నిరసన తెలుపుతున్న అసిస్టెంట్ టీచర్లు ప్రభుత్వం తన నిర్ణయాన్ని పున:సమీక్షించాలని అభ్యర్థిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్ నుండి తొలగించబడిన ఈ అసిస్టెంట్ టీచర్లు బిఇడి (బ్యాచ్‌లర్ ఆఫ్ ఎడ్యుకేషన్) డిగ్రీని కలిగిఉన్నారు. కోర్టు ఉత్త ర్వులను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం వీరిని సర్వీస్ నుండి తొలగిం చడంతో వీరంతా నిరసన బాట పట్టారు. ప్రభుత్వం తమ ఉద్యోగాలను తిరిగి (బ్యాక్) ఇవ్వాలని, తమ జీవితాలను ట్రాక్‌లో పెట్టా లని 'టుటా 'గ్రామం వేది కగా డిసెంబరు 19వతేదీ నుండి నిరసన తెలుపుతు న్నారు. 2024 ఏప్రిల్ 2 నాటి ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ఆదే శాలకు అనుగుణంగా ప్రభుత్వం ప్రాథమిక పాఠశా లల్లో పోస్ట్ చేసిన 2,800మంది అసిస్టెంట్ టీచర్లను సర్వీస్‌ల నుంచి తొలగించింది.'రాష్ట్ర ప్రభుత్వం మన జీవి తాలతో ఎందుకు ఆడుకుంటున్నది? మేం చేసిన తప్పేమిటి? మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు పొందాం కదా. దాదాపు 3,000అసి స్టెంట్ టీచర్ల కుటుంబాల గురించి ప్రభుత్వంతప్పకుండా ఆలోచిం చాలి' అని ఉద్యోగాన్ని కోల్పోయిన నిరసనకారులలో ఒకరైన 25 సంవత్సరాల అభిషేక్ చతుర్వేది 'పిటిఐ'కి నిరసన ప్రదేశం వద్ద తెలి యజేశారు. బిలాస్‌పూర్ జిల్లాకు చెందిన అభిషేక్ చతుర్వేది సహాయ ఉపాధ్యాయుడిగా ఎంపికైన తర్వాత దంతెవాడ జిల్లాలో సమగ్ర శిక్షా స్కీమ్‌లో ప్రత్యేక విద్యావేత్తగా పనిచేస్తూ ఉద్యోగం మానేశాడు. ఉద్యో గంలో జాయిన్ అయినప్పుడు ఇక తనకు కొత్త జీవితం మొదలైతుం దని కలలు కన్నాడు. కానీ ఆయన ఆనందం స్వల్పకాలికంగానే నిలి చింది. ఈ సమస్య 2021లో రద్దుచేసిన నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సిటిఇ) నోటిఫికేషన్‌కు సంబంధించినది. 2018, జూన్ 28న ఎన్‌సిటిఇ బిఇడి డిగ్రీ హోల్డర్లు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులుగా (క్లాస్ 1నుంచి 5వ తరగతి వరకు)నియామకా నికి అర్హులని పేర్కొంటూ నోటిఫికేషన్ జారీ చేసింది. దీనికి డిఇడి (డిప్లమా ఇన్ ఎడ్యుకేషన్) లేదా డిఇఎల్.ఇడి (డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) హోల్డర్లు ఇంతకుముందు అర్హులుగా ఉన్నారు. ఈ నోటి ఫికేషన్ ఆధారంగా ఛత్తీస్‌గఢ్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ రాష్ట్రంలోని అసిస్టెంట్ టీచర్ల పోస్టుల నియామకానికి అర్హతగా బిఇడి డిగ్రీ సహా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.రాజస్థాన్‌లో ప్రైమరీ టీచర్ల నియామకానికి సంబంధించిన కేసు విచారణ సమ యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర హైకోర్టు 2021లో2018ఎన్‌సిటిఇ నోటిఫికే షన్‌ను రద్దు చేసింది. బిఇడి అభ్యర్థులను కలిగి ఉండటం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ పోస్టులకు అనర్హులు అని వ్యాఖ్యానించింది. ఈ అంశం ఆ తర్వాత 2023 ఆగష్టు 11న అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుకు వెళ్లింది. 2018న ఎన్‌సిటిఇ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ రాజస్థాన్ హైకోర్టు ఉత్తర్వును సమర్థించింది. అయితే తన తీర్పుకు ముందు నియమితులైన బిఇడి క్వాలిఫై టీచర్లపై ఎలాంటి ప్రభావం ఉండదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇదిలాఉండగా 2023, మే 4న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఖాళీగా ఉన్న ప్రాథమిక పాఠశా లల ఉపాధ్యాయుల పోస్టుల కోసం ఒక అడ్వర్టైజ్‌మెంట్‌ను ప్రచురిం చింది. దీనిలో బిఇడి, డిఇడి రెండు అర్హతలు ఉన్న అభ్యర్థులను ఎంపిక ప్రక్రియలో ఆహ్వానించారు.

## రెండు యుద్ధనౌకలు.. ఓ జలాంతర్గామి
# జాతికి అంకితం




**ముంబయి:** రెండు యుద్ధనౌకలు ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ నీలగిరితోపాటు, జలాంతర్గా మి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌ను భారత ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం జాతికి అంకితమిచ్చాఇ్చరు. 77 వ సైనిక దినోత్సవాన్ని పురస్కరించుకొని ముంబ యిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఈ రెండు యుద్ధనౌకలు, ఒక జలాంతర్గామిని దేశంలోనే అభివృద్ధి చేయడం యావత్ జాతికి గర్వకారణమని అన్నా రు. యుద్ధ నౌకల్లో ఒకటి డెస్ట్రాయర్‌కాగా, మరొక టి ఫ్రిగేట్. వీటితో కలిపి జలాంతర్గామిని కూడా ఒకేసారి ప్రారంభించగలిగామని, గతంలో ఎన్న డూ ఇలాంటి అద్భుతం జరగలేదని ప్రధాని వ్యా ఖ్యా నించారు. గత పదేళ్లలలో 33 యుద్ధనౌకలు, 7 జలాంతర్గాములు అందుబాటులోకి వచ్చాయని ఆయన వివరించారు. కాగా, ఐఎన్ఎస్ సూరత్ యుద్ధ నౌకలో ప్రాజెక్ట్ 15ఎ, ప్రాజెక్ట్ 15 బి డెస్ట్రా యర్లు ఉన్నాయని నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె త్రిపాఠి తెలిపారు. గతంలో మరే యుద్ధనౌకలో లే ని విధంగా, ఐఎన్ఎస్ నీలగిరిలో ప్రాజెక్ట్ 17 'ఎ ఫ్రిగేట్లు' ఉన్నాయని పేరొన్నారు. పి 15బి గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్ ప్రాజెక్టులో భాగంగా నిర్మిం చిన నాలుగవది ఐఎన్ఎస్ సూరత్. ప్రపంచంలోని అత్యంత భారీ యుద్ధనౌకల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఈ యుద్ధనౌక నిర్మాణంలో 75 శాతం సాంకేతికత మన దేశానిదే. ఇందులో అధునాతన సెన్సార్ వ్యవస్థలను కూడా ఉంచారు. ఐఎన్ఎస్ నీలగిరి పి17 స్టెల్త్ ఫ్రిగేట్ ప్రాజెక్టులో భాగ ంగా నిర్మితమైన మొదటి యుద్ధనౌక. ఇందులో శత్రువు లను ఏమార్చే స్టెల్త్ పరిజ్ఞానం నిక్షిప్త ఉం ది. జ లాంతర్గామి వాఘ్‌షీర్‌ను పి75 ప్రాజెక్టులో భా గంగా రూపొందించారు. ఇప్పటికే ఐదు పూర్తికా గా, ఇది చివరిదైన ఆరో జలాంతర్గామి. దీనిని ర్మా ణలో ఫ్రాన్స్‌కు నావికాదళ సాయంతీసుకున్నారు.

# రష్యా మిలిటరీలో పని చేస్తున్న భారతీయులను విడుదల చేయాలి



**న్యూఢిల్లీ :** రష్యా మిలిటరీలో పని చేసేందుకు నియమితులైన భారతీ యులను తక్షణమే విడుదల చేయా లని రష్యాకు భారతదేశం గట్టిగా కోరింది. రష్యా – ఉక్రెయిన్ ఘర్ష ణల్లో ఒక భారత జాతీయుడు మర ణించిన నేపథ్యంలో ఈ మేరకు స్పందించింది. ఇప్పటి వరకు పది మంది భారతీయులు కదన రంగంలో మరణించారు. విదేశీ మంత్రిత్వ శాఖ అధి కార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మాట్లాడుతూ కేరళకు చెందిన భారతజాతీయుడు మాస్కోలోని ఆసుపత్రిలో తీవ్ర గాయాలకు చికిత్స పొందుతూ మరణించాడని, మరొకరు గాయాలకు చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, మాస్కోలోని రష్యా అధికారులకు, న్యూఢిల్లీలోని రష్యా రాయబార కార్యాలయం దృష్టికి తీసుకెళ్ళామని తెలిపారు. మిగతా భారత జాతీయులను త్వరితగతిన విడుదల చేయాలనే తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించినట్లు చెప్పారు. గత ఏడాది జూలైలో మాస్కో పర్యటన సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో చర్చల్లో భాగంగా రష్యా ఆర్మీలో పని చేస్తున్న భార తీయులను సాధ్యమైనంత త్వరగా విడుదల చేసే అంశాన్ని భారత ప్రధాని మోదీ ప్రస్తావించారు. తాజాగా కేరళ రాష్ట్రం త్రిస్సూర్‌కు చెందిన టి.బి.బినిల్ మరణించినట్లు సోమ వారం నాడు ఆయన బంధువు వెల్లడించడంతో వార్త వెలు గులోకి వచ్చింది.

# వణికిస్తున్న పొగమంచు..
## విమాన, రైలు సర్వీసులకు అంతరాయం

**న్యూఢిల్లీ:** ఉత్తర భారతదేశాన్ని పొగమంచు వణి కించేస్తోంది. చలి తీవ్రత మరింత పెరిగింది. దేశ రాజధాని ఢిల్లీ సహా పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, బీహార్ తది తర ఉత్తరాది రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు దారు ణంగా పడిపోయాయి. దీంతో చలి తీవ్రతకు ప్రజలు గజగజ వణికిపోతున్నారు. ఆయా రాష్ట్రాలను దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఢిల్లీలో బుధవారం కనిష్ట ఉష్ణోగ్రతలు 6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. ఢిల్లీఎన్సీఆర్ ప్రాంతాల్లో దశ్యమానత అధ్వానస్థితికి చేరింది. వివిధ ప్రాంతాల్లో విజిబిలిటీ జీరోకు పడిపో యింది. రోడ్డుపై ముందు వెళ్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి. పొగమంచు కారణంగా ఢిల్లీలో విమాన, రైలు సర్వీసులకు తీవ్ర అంత రాయం ఏర్పడుతోంది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉదయం 6 గంటలకు విజిబిలిటీ 100 మీటర్లుగా నమో దైంది. దీంతో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు రాకపోకలు సాగించే దాదాపు 200కిపైగా విమానాలు ఆల స్యంగా నడుస్తున్నాయి. కొన్ని విమానాలను రద్దు చేయగా... మరికొన్నింటిని దారి మళ్లిం చారు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ఇండిగో, స్పైస్‌జెట్, ఎయిర్ ఇండియా సహా పలు విమాన సంస్థలు తమ ప్రయాణికులకు ముందుగానే పలు సూచనలు చేశారు. పొగమంచు కారణంగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయని.. ఫ్లైట్ స్టేటస్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సూచిం చాయి. మరోవైపు సుమారు 26 రైళ్లు ఆల స్యంగా నడుస్తున్నాయి. ఎనిమిది గంటల సమ యంలో ఢిల్లీలో ఏక్యూఐ 332గా నమోదైంది.

# 'వయనాడ్' బాధిత కుటుంబాలకు పరిహారం
## ఘోరవిపత్తుపై కేరళ ప్రభుత్వం నిర్ణయం

**తిరువనంతపురం:** కేరళ రాష్ట్రం వయనా డ్‌లో గతేడాది కొండచరియలు విరిగిపడి గల్లంతైన వారిని మతులుగా ప్రకటించాలని పినరయి విజయన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఘోరవిపత్తులో గల్లం తైన వారి కుటుంబ సభ్యులకు పరిహారం అందిస్తామని తెలిపింది. తప్పిపోయిన వ్యక్తుల జాబితాను పరిశీలించేందుకు రెవెన్యూ అధికారులతో సహా స్థానిక, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు ఏర్పాటు చేయను న్నట్లు ఉత్తర్వులో పేర్కొంది. ఈ కమిటీ విప త్తులో తప్పిపోయిన వారి జాబితాను తయారు చేసి పరిశీలన కోసం జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీకి సమర్పిస్తుంది. డీడీఎమ్ఏ ఆ జాబితాను పరిశీలించి రాష్ట్ర స్థాయి కమిటీకి పంపితే... అక్కడి నుంచి ఆ జాబితా ప్రభుత్వానికి చేరుతుంది. ఈ జాబి



తాలో పేర్లు ఉన్నవారిని ప్రభుత్వం మతు లుగా ప్రకటించి... వారి బంధువులకు పరి హారం అందిస్తుంది. కాగా, గతేడాది జులై 30న భారీ వర్షాలు కురవడంతో కొండచరి యలు విరిగిపడి గ్రామాలకు గ్రామాలే తుడి చిపెట్టుకుపోయాయి. సుమారు 263 మంది ప్రాణాలు కోల్పోయినట్లు, మరో 35 మంది తప్పిపోయినట్టు ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి.

# ఢిల్లీ ఎన్నికల్లో ఆ 'ఆప్' నేతల గురించే ఆసక్తికరచర్చ

ముఖ్యమంత్రి అతిశీ ఆస్తి నికరవిలువ రూ.76.93లక్షలు !

సొంతకారు, ఇల్లు లేదని అఫిడవిట్‌లో వెల్లడి

మాజీ డిప్యూటీ సిఎం మనీష్‌సిసోడియాకు రూ.40లక్షలకు పైగా క్రౌడ్ ఫండింగ్

**న్యూఢిల్లీ :** త్వరలో జరుగబోయే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో పోటీచేస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కు చెందిన ముఖ్యమంత్రి అతిశీ ఆస్తి నికరవిలువ, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా క్రౌడ్ ఫండింగ్ గురించి ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇప్పటివరకూ ప్రాతినిథ్యం వహించిన దక్షిణ ఢిల్లీలోని కల్కాజీ అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికలలో మరోసారి అభ్యర్థిగా పోటీచేస్తున్న ముఖ్యమంత్రి అతిశీ ఆస్తి నికర విలువ రూ.76.93లక్షలని, ఆమె తనకు సొంత కారు, ఇల్లు కూడా లేదని స్వయంగా అఫిడవిట్‌లో పేర్కొనడం హాట్ టాపిక్ అయ్యింది. ఆమె చరాస్తులలో రూ.30,000 నగదు, రూ.1లక్ష విలువైన బంగారు ఆభరణాలు, బ్యాంక్ ఖాతాలలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు , పొదుపు రూపేణా రూ.75 లక్షలు ఉన్నాయి. ఆమె తనకు ఎలాంటి స్థిరాస్తి లేదని అఫిడవిట్‌లో ఎన్నికల సంఘానికి తెలియజేశారు. ఇదిలాఉంటే, ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీ తన ఎన్నికల ప్రచారం కోసం జనవరి 12న క్రౌడ్ ఫండింగ్‌ను రైజ్ చేసిన కొద్ది గంటలలోనే తన డొనేషన్ ప్లాట్‌ఫారమ్‌కు దాతల నుంచి ఆమెకు అపూర్వ స్పందన లభించింది. 335మంది మద్దతుదారుల నుంచి అతిశీకి రూ.17.38లక్షల క్రౌడ్ ఫండింగ్ లభించింది. 2020సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో తర్వాత అతిశీ రూ.59.79లక్షల ఆదాయం నికర విలువను ప్రకటించినప్పటినుంచి అతిశీ ఆర్థిక ఆస్తులు రూ.17.14లక్షలకు పెరిగాయి. అప్పుడు కూడా ఆమెకు కారు, ఇల్లు ఇతర స్థిరాస్తులు లేవు. అతిశీకి 2022–23 సంవత్సరంలో రూ.4,72,680గాఉన్నటువంటి ఆదాయం కాస్తా 2023–24ఆర్థిక సంవత్సరంనాటికి రూ.9,62,860కు పెరిగింది. ముఖ్యమంత్రి అతిశీ అత్యున్నత విద్యార్హత 2006లో ఆమె ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి పొందిన మాస్టర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ. అన్ని సోషల్ మీడియా అకౌంట్ల నుంచి తన ఇంటిపేరును 'మర్లెనా'ను తొలగించినప్పటికీ అఫిడవిట్ ప్రకారం..ఆమె పేరు ఇప్పటికీ 'అతిశీ మర్లెనా'గా పేర్కొంటూ స్పష్టత నివ్వడం ఇంటిపేరుపై ఉన్న సందేహాలను పటాపంచలు చేసింది. ముఖ్యమంత్రి అతిశీ భారతీయ జనతాపార్టీ (బిజెపి) అభ్యర్థి రమేష్ బిదూరి, కాంగ్రెస్‌పార్టీకి చెందిన అల్కా లాంబానుంచి ప్రసిద్ధ సౌత్ ఢిల్లీలోని హై ప్రొఫైల్ కల్కాజీ అసెంబ్లీ నియోజకవర్గంలో గట్టి పోటీని ఎదుర్కొంటున్నారు. ఇదిలాఉంటే మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్‌సిసోడియా వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో జంగ్‌పురా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్నారు. అందుకు క్రౌడ్ ఫండింగ్ ద్వారా



రూ.40లక్షలకు పైగా నిధులను సేకరించినట్లు మనీష్‌సిసోడియా వెల్లడించారు. ఆయన డిసెంబరు 30న ప్రారంభించిన క్రైడ్ ఫండింగ్ ప్రచారానికి 331మంది దాతలు రూ.100 నుంచి రూ.500 వరకు సహా యం అందించినట్లు సిసోడియా ఒక సోషల్‌మీడియా పోస్ట్‌లో తెలియజేశారు. జంగ్‌పురా అసెంబ్లీస్థానం నుంచి పోటీచేసేందుకు తనకు గరిష్టంగా రూ.40లక్షల అవసరం ఉందని సిసోడియా నిర్ధారించుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న సహచరులు హృదయపూర్వకంగా సహకరించి, మద్దతు ఇచ్చినందుకు నేను చాలా సంతోషంగా ఉన్నానన్నారు. 331మంది సహచరుల సహకారంతో మొత్తం రూ.40లక్షలు సేకరించబడ్డాయి. శుభవార్త ఏమిటంటే, దేశం నలుమూలల నుండి 50మంది ఒక్కొక్కరు రూ.100, 36మంది ఒక్కొక్కరు రూ.500విరాళాలు అందించారు అని ప్రస్తుత పట్పర్‌గంజ్ ఎమ్మెల్యే అయిన మనీష్‌సిసోడియా తన పోస్ట్‌లో తెలిపారు. 'మీరు కష్టపడి సంపాదించిన ప్రతీ పైసా నిజాయితీతో,కష్టపడి ఎన్నికలలో పోటీకి వినియోగిస్తాను. ఎన్నికలలో గెలిచిన తర్వాత జంగ్‌పురా అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేస్తూ, ఢిల్లీలో విద్యావిప్లవాన్ని ముందుకు తీసుకువెళతాను. 'జైహింద్', 'జైభారత్', 'విద్యావిప్లవం చిరకాలం జీవించాలి' అని అన్నారాయన.

# తాజా హత్యలతో టిఎంసిలో కలవరం
## అంతర్గత కుమ్ములాటలతో టిఎంసి నేతల హత్యలు

**మాల్దా :** తృణమూల్ కాంగ్రెస్ కౌన్సిలర్ దులాల్ సర్కార్ హత్య జరిగి పదిహేను రోజులు కాకముందే పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లాలో ఒక టిఎంసి కార్యకర్త హత్యకు గురయ్యారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కాలియాగంజ్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. టిఎంసి స్థానిక కమిటీ అధ్యక్షుడు బకుల్ షేక్, మరో పార్టీ కార్యకర్త రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్ర మానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐదుగురు దుండగులు అక్కడికి ప్రవేశించి బకుల్ షేక్ , ఆయన అనుచరులపై విచక్షణారహితంగా కాల్పులు జరి పారు. అయితే, మరణించిన వ్యక్తి, గాయపడిన వ్యక్తి శరీరంలో బుల్లెట్ గాయాలు కనిపించలేదని పోలీ సులు తెలియారు. దుండగులు ఇటుకతో తీవ్రంగా దాడి చేయడంతో వ్యక్తి మరనించారని, అదే తతర హాలో మరో ఇద్దరికి తీవ్రమైన గాయాలు అయ్యాయని తమ ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు పోలీస్ అధికారి ఒకరు వెల్లడించారు. అతౌల్ హఖ్ అలియాస్ హసు షేక్ అనే టిఎంసి కార్యకర్త సంఘటనా ప్రదేశంలోనే గాయాలతో మరణించారు. ఆయన నేలపై పడిపో యిన తరువాత కూడా ఒక దుండగుడు ఇటుకతో దాడి చేస్తూనే ఉన్న విడియో ఫుటేజ్‌లో వెల్లడైంది. బకుల్ షేక్, మాజీ పంచాయతీ అధ్యక్షుడు ఎసారుద్దీన్



షేక్‌లు తీవ్ర గాయాలతో మాల్దా వైద్యకళాశాల ఆసుప త్రిలో చికిత్స పొందుతున్నారు. అధికార పార్టీలోనే గ్రూపు తగాదాల ఫలితంగా దాడి జరిగినట్లు ప్రాథ మిక దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసు అధికారులు చెబు తున్నారు. జనవరి 2న టిఎంసి మాల్దా జిల్లా ఉపాధ్య క్షుడు దులాల్ సర్కార్‌ను ఆయన ఇంటికి సమీపంలో పట్టపగలే కాల్చి చంపిన ఘటన నేపథ్యంలో తాజా ఘటన ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలను మరింత పె ంచింది. సర్కార్ హత్య కేసులో ఏడుగురిని అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో టిఎంసి మాల్దా పట్టణ అధ్యక్షుడు నరేం ద్రనాథ్ తివారిని పార్టీ నుంచి గత వారం బహిష్కరిం చారు. పంచాయతీ ఎన్నికలు ముంచుకొస్తున్న సమ యంలో అధికార పార్టీలో ముదురుతున్న అంతర్గత గ్రూపు తగాదాలను నియంత్రించలేకపోవడంతో టిఎంసి శ్రేణుల్లో ఆందోళన నెలకొంది.

## అంతుచిక్కని వ్యాధికి మరో ఇద్దరు
# మృత్యువాత!



జమ్ముకశ్మీర్ రాజౌరీ జిల్లా బదాల్ గ్రామంలో

14కు పెరిగిన మృతుల సంఖ్య

**రాజోరి/జమ్ము :** అంతుచిక్కని వ్యాధి మరణాలతో జమ్ముకశ్మీర్ రాజౌరి జిల్లా బదాల్ గ్రామం భయం గుప్పిట్లో చిక్కుకుంది. ఒక కుటుంబానికి చెందిన ఆరేళ్ల బాలిక సహా ఇద్దరు ఈ అంతుచిక్కని వ్యాధి కారణంగా తుదిశ్వాస విడవటంతో మృతుల సంఖ్య 14కు చేరుకుంది. ఈ విషయాన్ని అధికారులు తెలియజేశారు. గత నెలరోజులుగా మూడు కుటుంబాలలో 11మంది పిల్లలు, ముగ్గురు పెద్దలు సహా 14మంది మృత్యుఒడికి చేరడం కోటరాంక సబ్‌డివిజన్‌లోని మారుమూల గ్రామమైన బదాల్ ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. ఈరకమైన సంభావ్య ఆరోగ్య ప్రమాదాలను గుర్తించి, పరిష్కరించడం కోసం నమూనాలను సేకరించడానికి ప్రభుత్వం వివిధ ఆరోగ్య బృందాలను నియమించిందని అధికా రులు తెలిపారు. సఫీనా కౌసర్ జమ్ములోని ఒక ఆసుపత్రిలో కన్నుమూశారు. అక్కడ ఆమె తోబుట్టువులు గత రెండు రోజులుగా మరణించగా, మరో ఇద్దరు చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. పిల్లల తాత మహ్మద్ రఫీక్ కూడా సోమవారం రాజౌరీలోని ఒక హాస్పిటల్‌లో మరణించాడని అధికారులు చెప్పారు. గత నెలలో గ్రామంలో రెండు కుటుంబాలకు చెందిన 9మంది చనిపో యారు. తొలుత ఫుడ్ పాయిజనింగ్ కారణంగానే మరణాలు సంభవించినట్లు ప్రచారం జరిగింది. అయినప్పటికీ చాలామంది గ్రామస్తులు ఇలాంటి లక్షణాల గురించి ఫిర్యాదు చేయడంతో పరిస్థితి భయంకరరంగా మారింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవడం, దేశంలోని వివిధ ప్రతిష్టా త్మక ఆరోగ్య సంస్థల నుండి నిపుణులను రంగంలోకి దింపడం జరిగింది. గత నెలలో, జమ్ములోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ హాస్పిటల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అశు తోష్‌గుప్తా తమ ప్రాథమిక పరిశోధనల్లో..ఈ అంతుచిక్కని మరణాలకు కార ణంగా వైరల్ ఇన్‌ఫెక్షన్‌గా వెల్లడైందన్నారు.అయినప్పటికీ ఖచ్చితమైన నిర్ధార ణకు మరిన్ని అధ్యయనాలు అవసరమని కూడా అశుతోష్‌గుప్తా చెప్పారు. ఈ పరిశోధనలలో సహాయం చేయడానికి పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ , పిజిఐ ఛండీగఢ్, ఎయిమ్స్ ఢిల్లీ, నేషనల్ సెంటర్ ఫర్ డిసీస్ కంట్రోల్ (ఎన్‌సిడిసి) ఢిల్లీ, గ్రామాన్ని సందర్శించి భాగస్వాములయ్యారు. రాజౌరీ డిప్యూటీ కమిషనర్ అభిషేక్ శర్మ సకాలంలో జోక్యం చేసుకుని ఉపశమనాన్ని నిర్ధారించడానికి పరిస్థితిని వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని, ఆరోగ్య శాఖ బృందాలు కూడా శరవేగంగా రంగంలోకి దిగి ఈ అంతుచిక్కని వ్యాధి మరణా లను ట్రేస్ చేయడానికి శాంపుల్స్ సేకరించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో నిత్యావసరాల సరఫరాకు సంబంధించిన నాణ్యత, భద్రతను నిర్ధారించడానికి, ఇప్పటికే ఆహారం, నీటినమూనాలను సేకరించినట్లు అధికారులు చెప్పారు.జమ్ము హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రాకేష్ మంగోత్రా, రాజౌరీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోహర్ రాణా, కంది కోట్రాంకలో క్యాంపుచేశారు. పరిస్థితు లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఏదైనా అత్యవసర వైద్య అవసరాలను పరిష్కరించడానికి పరిపాలనా యంత్రాంగం ఒక మొబైల్ మెడికల్ యూనిట్, అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచింది. ఆరోగ్యానికి సంబంధించిన ఏవైనా సమస్యలుంటే ప్రజలు జిల్లా కంట్రోల్ రూమ్ లేదా హెల్త్ అధికారులను సంప్ర దించాలని సంబంధిత ఉన్నతాధికారులు ప్రకటించారు.

## పార్లమెంటు భద్రతావిభాగం
# 'విఐపి యూనిట్‌లో' విలీనం

**న్యూఢిల్లీ:**పార్లమెంటు భద్రతకోసం ఏర్పాటుచేసిన సిఆర్‌పిఎఫ్ ప్రత్యేక విభాగాన్ని విఐపి యూనిట్‌లో విలీనం చేశారు. వీరిని గత ఏడాదిలోనే వీరిని అక్కడి నుండి ఉపసంహరించారు. విఐపి సెక్యూరిటీ విభాగంలో విలీనం చేశారు. కానీ వీరంతా ఇకమీదట ప్రముఖుల వ్యక్తిగత భద్రతా సిబ్బంది బాధ్యతలు నిర్వహిస్తారని పేర్కొంటూ లాంఛనంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. సిఆర్‌పిఎఫ్ అధీనంలో ఉన్న 1,400 మందితో ఉన్న పార్లమెంట్ డ్యూటీ గ్రూప్ (పిడిజి)ను విఐపి భద్రతాబృందంలో విలీనమైంది. ఈ పార్లమెంట్ డ్యూటీ గ్రూప్ పేరును విఎస్‌జి (విఐపి సెక్యూరిటీ గ్రూప్)గా మార్పు చేసినట్లు కేంద్ర హోంమంత్రిత్వశాఖ మంగళవారంనాడు లాంఛనపూర్వక ఉత్తర్వు జారీ చేసింది. ఈ మధ్య కొత్తగా 1000 మందితో ఈ విఐపి కొత్త బెటాలియన్‌ను ఏర్పాటు చేశారు. రోజు రోజుకూ ఈ విఐపి బెటాలియన్ బాధ్యతలు విస్తరిస్తున్నాయని సీనియర్ సిఆర్‌పిఎఫ్ అధికారి ఒకరు పిటిఐ వార్తాసంస్థకు చెప్పారు. ఇంతకుముందు ఝార్ఖండ్‌లో ఛత్రా జిల్లాలో ఉన్న బెటాలియన్ నెంబర్ 190 ని విఐపి సెక్యూరిటీ యూనిట్‌లోకి బదిలీ చేస్తూ ఈనెలారంభంలో హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత పార్లమెంట్ డ్యూటీ గ్రూపును కూడా ఈ విఐపి గ్రూపులో విలీనం చేసింది. ఝార్ఖండ్‌లో నక్సలైట్లను ఏరివేసేందుకు 1000 మందితో మొదట ఈ బెటాలియన్ మోహరించారు. సిఆర్‌పిఎఫ్‌కు చెందిన విఐపి సెక్యూరిటీ విభాగం ప్రస్తుతం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోపాటు గాంధీ కుటుంబంలో ఉన్న సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ వాద్రా తదితరులు 200 మందికి పైగా ప్రముఖులకు భద్రత సమకూరుస్తున్నది. గత ఏడాది మే నెలలో పార్లమెంటు భవనం



నుండి పార్లమెంటు డ్యూటీ గ్రూపును ఉపసంహరించారు. వారందరినీ సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌కు అప్పగించారు. ఐతే వారిని పిడిజి బాధ్యతలనుండి తొలగించిన తర్వాత నుండి లాంఛనంగా విఐపి బృందంలోనే కొనసాగుతున్నారు. పిడిజిలో పనిచేసినవారందరినీ ఇప్పుడు ప్రముఖుల భద్రతకోసం హై రిస్కు బాధ్యతల్లో నియమించారు. నాటి పిడిజి దళం తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించినప్పటికీ 2001లో పార్లమెంటుపై ఉగ్రవాదులు దాడి చేసిన ఘటన తర్వాత 2023 డిసెంబరులో ఇద్దరు వ్యక్తులు జీరో అవర్ నడుస్తుండగా పబ్లిక్ గ్యాలరీ నుండి లోక్‌సభ ఛాంబర్‌లోకి దూకారు. పచ్చరంగు పొగను ఛాంబర్‌లో వ్యాపింపజేశారు. నినాదాలు చేశారు. కీలకమైన భద్రతావ్యవస్థకు ఆనాడు విఘాతం కలిగింది.



## పెద్దగట్టు నూతన కమిటీకి అభినందనలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** శ్రీశ్రీశ్రీ లింగమంతుల(పెద్దగట్టు) స్వామి నూతన ఆలయ కమిటీ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డిల సహకారంతో త్వరలో జరిగే శ్రీ లింగమంతులస్వామి జాతరను ఆలయ కమిటీ సభ్యులు విజయవంతం చేయాలన్నారు. నిద్రాహారు మాని జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే జాతరలో స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే లక్షలాది మంది భక్తులకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఎన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేస్తామన్నారు.అనంతరం నూతన కమిటీ చైర్మన్ పోలేబోయిన నర్సయ్య యాదవ్, సభ్యులు కుర్ర సైదులు, వీరబోయిన సైదులు, సిరిపంగి సైదమ్మ, మెంతబోయిన లింగస్వామి, మెంతబోయిన చిన్న మల్లయ్య, పోలేబోయిన నరేష్ పిల్లైలను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

## రైతు భరోసా సర్వేకు ఐదు బృందాలు

**ప్రజాపక్షం/సూర్యాపేట(పెన్‌పహాడ్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెడుతున్న రైతు భరోసా పథకం లబ్దిదారులను ఎంపిక చేసేందుకు నిర్వహించే సర్వే కోసం ఐదు బృందాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ధరావత్ లాలు నాయక్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖల నుండి అధికారులను సర్వే చేసేందుకు నియమిస్తున్నట్లు తెలిపారు. అధికారులు సర్వేకు వెళ్లే ముందే గ్రామ రైతులకు సమాచారం అందించాలన్నారు. రైతు భరోసాకు రాళ్లు, రప్పలు, గుట్టలు ఉండి సాగుకు యోగ్యం కాని భూమిని తొలగించనున్నట్లు తెలిపారు. రియల్ ఎస్టేట్ లే అవుట్లు, పరిశ్రమలకు, గోదాములకు ఇచ్చిన భూములకు రైతు భరోసా వర్తించదని తెలిపారు. ఈనెల 21 నుండి 25 తేదీ వరకు సర్వేపై గ్రామ సభలు నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మర్కాల రంజిత్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## సైనికుల సేవలు మరువం



**ప్రజాపక్షం/సూర్యాపేట:** భారత దేశానికి సైనికులు అందిస్తున్న సేవలు మరువలేనివని వాసవి క్లబ్ అధ్యక్షులు మంచాల శ్రీనివాస్ అన్నారు. బుధవారం జాతీయ సైనిక దినోత్సవంను పురస్కరించుకొని కల్నల్ సంతోష్ బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సైనికులు దేశానికి కాలపాల కాస్తున్నారని అన్నారు. వారు ఉన్నరనే ధైర్యంతోనే దేశ ప్రజలు ప్రశాంతంగా నిద్రపోతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు సింగిరికొండ రవీందర్, బిక్కుమళ్ళ కృష్ణ, శరినాథ్, గుండా శ్రీధర్, తల్లాడ సోమయ్య, ప్రవీణ్, కలకోట లక్ష్మయ్య, కృష్ణమూర్తి, మాశెట్టి నరేష్ పాల్గొన్నారు.

## లారీ ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి


**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** లారీ ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో భారత్ పెట్రోల్ బంక్ మూలమలుపు వద్ద జరిగింది. ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం గుడిపల్లి మండల పరిధిలోని సురపల్లి గ్రామానికి చెందిన మారెపల్లి ప్రేమ్‌కుమార్(27) చిలకమర్రిలోని విజయవర్ధన్ కాటన్ మిల్లులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ప్రేమ్‌కుమార్ అదే మిల్లులో పనిచేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన అర్జున్ సహానితో కలిసి తన బైక్ మీద పని నిమిత్తం టివిఎన్‌రెడ్డి కాటన్ మిల్లుల వద్దకు వెళ్ళి అక్కడ పని ముగించుకొని తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో కొండమల్లేపల్లి సమీపాన హైదరాబాద్ రోడ్డులో భారత్ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే మూల మలుపు వద్ద కొండమల్లేపల్లి నుండి వస్తున్న లారీ అతివేగంగా అదుపు తప్పి వచ్చి బైక్‌ను ఎదురుగా ఢీకొనడంతో వారిద్దరి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు ప్రేమ్‌కుమార్ తండ్రి మారేపల్లి పిలుపు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రైతుభరోసా కల్పించడం కోసం గ్రామాల వారిగా సర్వే



**ప్రజాపక్షం/డిండి :** గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన రైతు బంధు పేరుతో రెండు పంటలకు రూ. 10వేలు ఇవ్వగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు భరోసా పేరుతో రైతులకు రెండు పంటలకు రూ. 12వేలు అందించేందుకు గాను జనవరి 16నుండి 20 తేదిల్లో గ్రామాల వారీగా రెవెన్యూ శాఖ, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించి వ్యవసాయ సాగుకు యోగ్యమయ్యే భూములను సర్వే చేయనున్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో దేవరకొండ ఆర్డీవో రమాణారెడ్డి ముందస్తు గా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం అందిస్తున్న నేపథ్యంలో మండలంలో గ్రామాల అర్హులను గుర్తించి జనవరి 21 నుండి 24వ తేది వరకు నిర్వహించే గ్రామ సభల్లో అర్హులైన వారి జాబితాను ప్రకటించాలని ఆర్డీవో సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ అంబటి ఆంజనేయులు, ఎంపిడివో వెంకన్న, ఏవో రెహానా, డిప్యూటి తహశీల్దార్ రాగ్యనాయక్, సినియర్ అసిస్టెంట్ ముస్తఫా, ఆర్ఐ శ్యాంనాయక్, పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దు




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** మీ కుటుంబానికి మీ అవసరం ఎంతో ఉందని వాహనదారులు చరవాణిలో మాట్లాడుతూ వాహనాలను నడపవద్దని ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్డులో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను వేగంగా నడిపి ప్రమాదాలకు గురి కావద్దని, ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. లైసెన్స్, వాహన ధృవీకరణ పత్రాలు లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కార్యకర్తల సంక్షేమమే ముఖ్యం

### ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ వేములపల్లి:** కార్యకర్తల సంక్షేమమే ముఖ్యమని మిర్యాలగూడ నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్ )అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆమనగల్లు గ్రామంలో శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మన ఊరు మన ఎమ్మెల్యే పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను గడపగడపకు తీసుకువెళ్లేలా కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడి పని చేయాలని అన్నారు నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తల సంక్షేమమే ముఖ్యమని ప్రతి కార్యకర్త అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో తీసుకునే పథకాలను ప్రతి గడపకు వెళ్లేలా చూడాలని అన్నారు. గ్రామాలలో కార్యకర్తల నిర్ణయాలే తుది నిర్ణయాలని వారు తయారు చేసిన జాబితాకే అన్ని సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని అన్నారు, అతి త్వరలో ప్రతి గ్రామంలో 20 మంది కార్యకర్తలతో ఓ కమిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు ఆ కమిటీ నిర్ణయాలే ప్రభుత్వ కార్యకలాపాల విషయంలో అమలయ్యేల చూస్తానని అన్నారు.

**కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ :** కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ గ్రామంలో 15 మంది కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇల్లు రేషన్ కార్డులు వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరానికి 12000, రైతు కూలీలకు 12,000 అందించే కార్యక్రమాలకు కార్యకర్తలు జాబితా తయారు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు శంకర్ నాయక్, సీనియర్ నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు స్కైలాబ్ నాయక్, గాయం ఉపేందర్రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలిక కాంతరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టలకురుపయ్య ,సీఐ వీరబాబు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐ స్పందన రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వల్లంపట్ల ప్రవీణ్,పిల్లల సందీప్,దొంతి వెంకటరెడ్డి,వల్లంపట్ల అబ్రహం, కోల సైదులు పాల్గొన్నారు.

# ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ఉద్యోగుల సస్పెన్షన్

### విధులకు గైర్హాజరు కావడంపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం



**ప్రజాపక్షం/నల్లగొండ (గుర్రంపోడు):** అనధికారికంగా విధులకు గైర్హజరైనందుకుగాను నల్లగొండ జిల్లా గుర్రంపోడు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం సిబ్బంది మొత్తాన్ని ఉద్యోగాల నుండి తొలగించిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి. ముందస్తు అనుమతి లేకుండా గుర్రంపోడు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం సిబ్బంది మొత్తానికి మొత్తం విధులకు గైర్హాజరు కావడంపై ఆగ్రహించిన జిల్లా కలెక్టర్ గుర్రంపోడు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది అందరిని ఉద్యోగం నుంచి తొలగించడం , రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులను విధుల నుండి సస్పెండ్ చేయడం జరిగింది. బుధవారం ఆమె గుర్రంపోడు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి సెలవును ప్రకటించనప్పటికీ బాధ్యత లేకుండా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది మొత్తం ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడం శోచనియమని కలెక్టర్ అన్నారు. కాగా ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం హెల్త్ అధికారి హరిలాల్ మాత్రం ఉపనియామకంపై ఇతర చోట పనిచేస్తున్నారు. కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న ఫార్మసిస్టు శ్యామ్, ల్యాబ్ టెక్నీషియన్ సంధ్య, డేటా ఎంట్రీ ఆపరేటర్ మాధవి, అటెండర్ శ్రీనివాస్, అటెండర్, అరుణ జ్యోతి, అటెండర్ ఎల్లమ్మ లను ప్రభుత్వ ఉద్యోగాల నుండి తొలగిస్తున్నట్లు తెలిపారు. అలాగే అటెండర్ లక్ష్మీనారాయణ, ఫార్మసిస్ట్ భాగ్యమ్మ రెగ్యులర్ ఉద్యోగులను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు హాజరైన ప్రతి ఉద్యోగిపై ఇలాంటి చర్యలే తీసుకోవడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం , వైద్యానికి అత్యంత ప్రాధాన్య తనిస్తున్నప్పటికీ ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని గాలికి వదిలేసి సిబ్బంది మొత్తం గైర్హాజరు కావడం బాధాకరమని ,అందువల్లనే అందరినీ ఉద్యోగాల నుంచి తొలగించడం లేదా విధుల నుండి సస్పెండ్ చేయడం జరిగిందని తెలిపారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/నల్లగొండటౌన్:** పేద వర్గాలు, కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు. బుధవారం నల్గొండ పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ తో కలిసి నల్లగొండ పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఐఎన్‌టియుసి)2025 నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంఘానికి, కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటామని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఐఎన్ టియుసి జిల్లా మాజీ కార్యదర్శి, ముఖ్య సలహాదారు ఎండి మహమూద్, పట్టణ అధ్యక్షుడు సోలిపురం శంభు రెడ్డి, ఉపాధ్యక్షుడు పోతపాక సహదేవ, కోశాధికారి ఎస్కె గౌస్, ప్రధాన కార్యదర్శి బొజ్జ నాగరాజు, కార్యదర్శి పెరిక నరసింహా, సహాయ కార్యదర్శి కొమ్మనబోయిన మల్లయ్యతో పాటు సలహాదారులు, సభ్యులు డి.యాదయ్య, గాదపాక వీరయ్య, జీడిమడ్ల యాదయ్య, కొండా రాములు, సిహెచ్ మహేష్, ఆర్.కిరణ్ కుమార్, వజ్జ నరసింహ, పోతేపాక యాదయ్య, బోడ సోములు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ క్రీడాకారుడి దారుణ హత్య

### నందికొండలోని హిల్ కాలనీలో ఘటన



**ప్రజాపక్షం/నందికొండ:** మద్యం మత్తులో ఇద్దరు యువకుల మధ్య గొడవ కాస్తా కత్తి పోట్లకు దారితీసింది. సంక్రాంతి పండుగ పర్వదినాన రాత్రి సహచరుడిని అతికిరాతకంగా హత్య చేసిన ఘటన నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక హిల్ కాలనీలో చోటు చేసుకుంది . వివరాల్లోకి వెళితే స్థానిక ఎస్సై సంపత్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం హిల్ కాలనీకి చెందిన షేక్ నాగుర్ భాష (21) పైలాన్ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు (24) ఇద్దరు స్నేహితులని నాగూర్ భాష జాతీయస్థాయి బాస్కెట్బాల్ క్రీడాకారుడుగా, కోచ్ గా,మెంటర్‌గా రాష్ట్ర స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు జూనియర్ క్రీడాకారులకు తర్ఫీదును ఇస్తూ పాల్గొంటూ ఉంటాడు. మంగళవారం సంక్రాంతి పండుగ రోజు న రాత్రి 10.30 గంటలకు వీరిద్దరి మధ్య చిన్న గొడవ జరగి అది కాస్తా తార స్థాయికి చేరుకోవడంతో స్థానికంగా ఉన్న పెద్ద మనుషులు వారిని పిలిచి సర్ది చెప్పగా గొడవ సద్దుమణిగింది. ఆ తర్వాత మళ్లీ కాసేపటికి ఇద్దరి మధ్య మాటా మాట పెరిగి అగ్గిరాజుకోవటంతో ఆ గొడవ కాస్త కొట్టుకునే వరకు వెళ్ళడం, దానితో సహ నం కోల్పోయిన వెంకటేష్ నాగుర్ భాషను అతి కిరాతకంగా కత్తితో పొడవటంతో తీవ్ర రక్తస్రావ మై రక్తపు మడుగులో పడి ఉన్న నాగూర్ భాష ను స్థానిక ఏరియా కమలా నెహ్రూ ఆసుపత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమించడంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం నల్లగొండకు తీసుకెళ్లాలని సూచించగా అక్కడ చిక్సిత పొందుతున్న నాగూర్ భాష బుధవారం ఉదయం మృతి చెందినట్లు అతని కుటుంబ సభ్యులు తెలిపారు. హత్యకు దారి తీసిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు. పోలీసులు ఘటనస్థలికి చేరుకొని హతుని రక్త నమూనాల సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ సంపత్ గౌడ్ తెలిపారు. తఅసలు వీరిద్దరి మధ్య ఘర్షణకు కారణమేంటని ఈ హత్యోదంతంపై స్థానికుల మధ్య పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# అంబుజా సిమెంట్ పరిశ్రమ మాకొద్దు

### ఎమ్మెల్యేను కలిసిన రామన్నపేట అఖిలపక్ష నాయకులు



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండల కేంద్రంలో అదాని గ్రూప్ ఆధ్వర్యంలో నిర్మించనున్న అంబుజా సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రామన్నపేట అఖిలపక్ష పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేముల వీరేశంను ఆయన నివాస గృహంలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ పర్యావరణాన్ని, ప్రజారోగ్యాన్ని, అభివృద్ధిని దెబ్బతీసే సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న ప్జలకు నా సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. సిమెంట్ పరిశ్రమ ఏర్పడకుండా నావంతు బాధ్యత నేను నిర్వహిస్తానన్నారు. గత నాలుగు నెలలుగా రాజకీయాలకతీతంగా ముక్తకంఠంతో ప్రజలు అదాని సిమెంట్ పరిశ్రమను వ్యతిరేకిస్తున్నారని వారి మనోబావాలకు అనుగుణంగా మద్దతుగా నిలుస్తానని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, సీపీఎం నాయకులు మేక అశోక్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి మల్లారెడ్డి, పర్యావరణ పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ జల్లెల పెంటయ్య, కోకన్వీనర్ ఎండి.రేహాన్, సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరు నరసింహ, టీడీపీ మండల నాయకులు ఎండి.ఫజల్‌బేగ్, బీజేపీ మండల అధ్యక్షుడు బండా మధుకర్‌రెడ్డి, నాయకులు ఎండి.నాజర్, కందుల హనుమంతరెడ్డి, బొడ్డు సురేందర్, ఎర్ర శేఖర్, కందుల హనుమంతు, బొడ్డు సురేందర్, ఆముద లక్ష్మ ణ్, గోదాసు శివన్నారాయణ, కూనూరు కృష్ణ, గౌరిగె సోములు, రాపోలు ప్రభాకర్, గణేష్ తదితరులు ఉన్నారు.

## కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/మోటకొండూర్:** మోటకొండూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల రికార్డులను పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరులో రైతు భరోస ఎంపిక కార్యక్రమంలో అధికారులు పారదర్శకంగా నిర్మించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శాంతి లాల్, డిప్యూటీ తహసిల్దార్ జయ లక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్ కుమార్, ఎఈఓలు శివాని, సంధ్య పాల్గొన్నారు.



## వడాయిగూడెంలో... సంక్రాంతి ముగ్గులు..



**ప్రజాపక్షం/యాదాద్రి :** భువనగిరి మండలం వడాయిగూడెం గ్రామంలో బొడ్రాయి సెంటర్ దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా కనుమ పండుగ సందర్భంగా బుధవారం ఘనంగా సంక్రాంతి సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బసవన్నలు, గంగిరెద్దులతో కళాకారులు ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. అనంతరం గ్రామా మాజీ సర్పంచ్ గుండు మనీష్ గౌడ్, టియూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి గుండు ముత్తయ్య గౌడ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను గ్రామ బొడ్రాయి సెంటర్‌లో నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలో గ్రామానికి చెందిన 190 మంది మహిళలు ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో మొదటి బహుమతిగా కళ్లెం ప్రవళిక రూ.9,000 , రెండవ బహుమతి కోట సత్తెమ్మ రూ.6,000, మూడవ బహుమతి బందారపు కావ్య రంజిత్ రూ.3,000తో పాటు పది మంది మహిళలకు కన్సోలేషన్ బహుమతుల కింద ప్రెషర్ కుక్కర్లను అందజేశారు. ముగ్గుల పోటీలలో పాల్గొన్న ప్రతి మహిళకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి గుండు ముత్తయ్య గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో బొడ్రాయి సెంటర్లో గత పదేళ్ళుగా దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ వేడుకల్లో మాజీ ఎంపీటీసీ రాంపల్లి కృష్ణ, ఉత్సవ కమిటి గౌరవ అధ్యక్షులు కళ్లెం కృష్ణ, బబ్బూరి సురేష్ గౌడ్, అధ్యక్షులు బబ్బూరి దుమ్ము, ప్రధాన కార్యదర్శి నీల ఆంజనేయులు, మాజీ సర్పంచ్‌లు కోట పెద్ద స్వామి, రాజన్, మాజీ ఉప సర్పంచ్ సుక్కల మల్లయ్య, ఉత్సవ కమిటి సభ్యులు గుండు రవి, జక్కుల చంద్రయ్య, కళ్లెం సాగర్ ఉన్నారు.




## సాగు చేసే భూములకే రైతు భరోసా

### సాగు చేయని భూములను క్షేత్ర స్థాయిలో పరిశీలించి గుర్తించాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట:** సాగు చేసే భూములకే రైతు భరోసా వర్తిస్తుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలంలో గ్రామాల వారిగా జరిగే క్షేత్ర స్థాయి పర్యటన వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ జనవరి 16 నుండి 20 వరకు గ్రామాల వారిగా క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేస్తూ సర్వే నెంబర్ ప్రకారం సాగు చేయని భూములను గుర్తించాలన్నారు. సాగు చేయని భూముల్లో రాళ్లు, గుట్టలను సర్వేయర్ ద్వారా వివరాలను సేకరించాలని, పట్టణంలోని లే అవుట్‌లు, నాలాగా మార్చిన భూములను, ఇండస్ట్రిలకు సంబంధించిన వివరాలను మున్సిపల్ కమిషనర్ ద్వారా సేకరించాలని సూచించారు. సాగు చేయని భూముల వివరాలను జనవరి 21 నుండి 24 తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలలో తెలియపర్చాలని, వారిని రైతు భరోసా పథకంకు అనర్హులుగా గుర్తించాలని సూచించారు. సాగు చేసే ప్రతి ఎకరానికి రూ. 12వేల చొప్పున రైతు భరోసా పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, డిప్యూటి తహసీల్దార్ సుక్మిద్దీన్, మండల వ్యవసాయ అధికారి సందీప్, సర్వేయర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలతోనే మానసిక ప్రశాంతత

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోని అనంతారం గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బుధవారం గ్రామస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ సర్పంచ్ తుమ్మ డెన్నిస్ ప్రారంభించారు. దాతలు పెసరు రేఖ నర్సింహారెడ్డి, తుమ్మ సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి బొంగు శ్రీశైలం సహకారంతో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ విజేతకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ప్రశాంతత, శారీరక దారఢ్యం లభిస్తుందని ప్రతి ఒక్కరు క్రీడలలో పోటీ చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో సంతోష్, మహేందర్, వంశీధర్, రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





## భూమిలేని వ్యవసాయ కార్మికులందరికీ రూ. 12వేలు

### తె.వ్య.కా.సం జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు డిమాండ్

**ప్రజాపక్షం/నూతనకల్:** భూమి లేని వ్యవసాయ కార్మికులందరికి రూ. 12వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యవసాయ కార్మికులుపాలకుల వాగ్దానాలు సంక్షేమ పథకాల అమలు అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టెబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. భూమి లేకుండా ఉపాధి హామీ జాబ్ కార్డుల కలిగి 100 రోజుల పని పొందిన కుటుంబాలకు ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ బుక్కు ఆధారంగా రూ. 12వేల పథకానికి ఎంపిక చేయబోతున్నట్లు సమాచారం ఉందని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విధివిధానాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లబ్దిదారులను కుదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. గ్రామ సభల ద్వారానే లబ్దిదారులను ఎంపిక చేయాలన్నారు. 5 నుండి 10 గుంటల భూమి కలిగిన రైతులను అర్హులుగా గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పులుసు సత్యం, సిఐటియు మండల కన్వీనర్ బొజ్జ శ్రీను, నాయకులు పులసరి వెంకట ముత్యం, బత్తుల శ్రీను, రవి, పోలేపాక మధు, కాసం రామకృష్ణారెడ్డి, సోమనారి, పెద్దింటి జగన్, రమేష్, తిరుమలేష్, పిచ్చయ్య పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి

**ప్రజాపక్షం/ రామన్నపేట:** యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా క్రీడల్లో రాణించి పేరు ప్రఖ్యాతలు సాధించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ అన్నారు. బుధవారం మునిపంపుల గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామీణ క్రికెట్, వాలీబాల్, ముగ్గుల పోటీలు, సాంస్కృతిక క్రీడల ముగింపు సందర్భంగా ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందచేసి పార్టీ గ్రామశాఖ కార్యదర్శి నోముల రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడలు మానసికొల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఉపయోగపడుతాయని అన్నారు. ప్రభుత్వాలు గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం కల్పించడం లేదని కనీసం పాఠశాలల్లో పీఈటీలు నియమించడం లేదన్నారు. సమాజంలో నెలకొంటున్న మార్పుల పట్ల యువత అప్రమత్తంగా ఉంటూ మెరుగైన సమాజం కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మేకల వరుణమ్మ, ఐద్వా మండల కార్యదర్శి జంపాల ఆండాలు, తొలుపునూరి శ్రీనివాస్, మేకల కృష్ణయ్య, గంటెపాక ముత్యాలు, తాళ్లపల్లి జితేందర్, చంద్రశేఖర్, బూడిద భిక్షం, శ్రీనివాస్, నరసింహా, ఉమాపతి, నాగార్జున, బాషయ్య, సాయికుమార్, హేమలత, ధనమ్మ, ఉపేందర్, నరేష్, సాయివర్ధన్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు సంక్షేమ ఫలాల లబ్ధి చేకూరాలి

గ్రామ సభల ద్వారా తుది లబ్ధిదారుల ఎంపిక

అధికారుల సమీక్షలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష


ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : ప్రభుత్వం జనవరి 26 గణతంత్ర దినోత్సవం నుంచి ప్రారంభించే 4 నూతన కార్య్రకమా ల ద్వారా పారదర్శకంగా అర్హులకు లబ్ధి చేకూర్చాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం పెద్దపల్లి లోని అమర్ చంద్ కల్యాణమండపంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, నూతన రేషన్ కా ర్డుల జారీ, తదితర అంశాలపై నిర్వహించిన పెద్దపల్లి నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ,అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు భరోసా పథకానికి సం బంధించి ప్రతి మండలంలోని తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి పర్యవేక్షణలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్, సర్వేయర్లు, మైనింగ్ అధికారులు సంయుక్తంగా పని చేసి పట్టాదార్ పాస్ పుస్తకాల డేటా, గూగల్ మ్యాప్, రెవెన్యూ మ్యాప్ వారీగా పరిశీలిస్తూ భూ భారతి (ధరణి) నుంచి వ్యవసాయ యోగ్యం కాని భూ ములను గుర్తించి రైతు భరోసా జాబితా నుంచి సదరు లబ్దిదారులను తొలగించాలని, రాళ్లు రప్పలు ఉన్న భూములు, సాగునీటి ప్రా జెక్టు లకు సంబంధించి భూ సేకరణ చేసిన భూములు, పరిశ్రమల భూములు (రైస్ మిల్ పెట్రోల్ బంక్,ఆహార శుద్ధి పరిశ్రమ), నాలా కన్వర్షన్ జరిగిన భూములు, లేఔట్ ఉన్న భూములు, ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తు భూములు, రొడ్ల భూ ములు, భవనాలు నిర్మించుకున్న భూముల, మైనింగ్ జరుగుతున్న భూముల వివరాలు రైతు భరోసా నుంచి తొల గించా లన్నారు. భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఏడాదికి 12,000 రూపాయలకు రెండు విడతలుగా అందించే దుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించిందని, 2023–24 సంవత్సరానికి 20 రోజులు పని చేసిన భూమి లేని రైతు కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు పెద్దపల్లి జిల్లాలో ఆహార భద్రత కార్డులు లేని కుటు ంబాలకు మండలాలలో ఎంపిడిఒలు, పట్టణాలలో మున్సిపల్ కమిషనర్ నూతన రేషన్ కార్డుల జారీ పర్యవేక్షించాలని అన్నారు. గ్రామ లేదా వార్డు సభల ద్వారా అర్హులైన జాబితాన్ని ఆమోదింప చేసుకొని రేషన్ కార్డులను 75 గణతంత్ర దినోత్సవ సందర్భంగా నూతన రేషన్ కార్డుల ప్రొసిడింగ్స్ పంపిణీ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి నిర్వహించిన సర్వేలో భూములు ఉన్న అత్యంత పేదలకు మొదటి జాబితాలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. జనవరి 23 లోపు గ్రామ సభల నిర్వహణ పూర్తి చేయాలని, గ్రామ సభ ఆమోదించిన తరువాత తుది జాబితా ఆన్‌లైన్‌లో జనవరి 25 సాయంత్రం లోపు నమోదు చేయాలని, జనవరి 26నుంచి4 పథకాల అమలును ప్రారంభి ంచా లని కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. కాళిందిని, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, జడ్పీ సీఈవో నరేందర్, జిల్లా కోపరేటివ్ అధికారి శ్రీ మాల , ఆర్డీవో గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, తహసిల్దార్ రాజ్ కుమార్, పాల్గొన్నారు.

ప్రజాపక్షం/మంథని: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయా లని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని శ్రీ లక్ష్మి భారతీ ఫంక్షన్ హాల్‌లో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, నూతన రేషన్ కార్డుల జారీ తదితర అంశాలపై నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మాసంలో మరో నాలుగు సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టిందని, గణతంత్ర దినోత్సవం సందర్భంగా అర్హులైన లబ్ధిదారులను, అనర్హులను ఎంపిక చేసి గ్రామ సభల ద్వారా తుది జాబితాను అమోదం చేసుకోవాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అదికారి ఎం,కాళిందిని, జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, ఆర్డీఓ సురేష్‌తో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఫ్లిప్ కార్టు పేరుతో మోసం

క్రెడిట్ కార్డు నుంచి రూ. 34.600 మాయం

లబోదిబోమంటున్న వ్యవసాయ కూలీ




ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పోతారం గ్రామానికి చెందిన ఇట్టం వెంకటేశ్ అనే వ్యవసాయ టాలీకి చెందిన (క్రెడిట్ కార్డు) అకౌంట్ నుంచి రూ.34వేలను సైబర్ నేరగాళ్లు మాయం చేశారు. వెంకటేశ్‌కు చెందిన హెచ్‌డిఎ సి క్రెడిట్ కార్డు నుంచి ఫ్లేస్‌కార్టు పేమెంట్ పేరుతో మూడు సార్లు క్రెడిట్ కార్డు నుంచి నగదు బదిలీ చేసుకో వడంతో వ్యవసాయ కూలీ ఆందోళనకు గురయ్యాడు. తనకు టెక్స్ మెసేజ్ ద్వారా వచ్చిందని వెంటనే వరుసగా నగదు కట్ అయ్యిందని బాధితుడు వాపోతున్నారు. దీనిపై ఫ్లిప్ కస్టమర్‌కేర్‌ను సంప్రదిస్తే వారికి ఎలాంటి సంబంధం లేదని చెప్పడంతో బాధితుడు లబోదిబో మంటు న్నాడు. అధికారులు తనను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

## ఎసిబి వలలో 'సబ్ రిజిస్ట్రార్'



ప్రజాపక్షం/మెట్‌పల్లి : జగిత్యాల జిల్లా పరిధిలో మెట్‌పల్లి సబ్ రిజిస్టర్ ఆసిఫోద్దిన్ రూ.5వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ఎసిబి డిఎస్‌పి వి.వి.రణ మూర్తి తెలిపిన వివారాలు ప్రకారం ఇబ్ర హీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సుంకే విష్ణుకు మెట్‌పల్లి పట్ట ణంలోని సాయిరాం కాలనీలో 266 గజాల స్థలాన్ని మార్టిగేజ్ చేయడానకి 28వ తేదీన మెట్‌పల్లి సబ్ రిజిస్టర్ కార్యాల యానికి వెళ్ళాడు. ఆ సందర్భంగా సబ్ రిజిస్టర్ రూ.10వేలు డిమాండ్ చేసినట్లు బాధితుడు సుంకే విష్ణు డాక్యుమెంట్ రైటర్ అసిస్టెంట్ ఆర్మూర్ రవితో ఒప్పందం కుదిరించుకొన్నట్లు తెలిపారు. అనంతరం సుంకే విష్ణు ఎసిబి అధికారులను సంప్రదించడంతో బుధవారం మెట్‌పల్లి పట్టణంలో సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సబ్ రిజిస్టర్ ఆసిఫోద్దీన్, ఔట్ సోర్సింగ్ బాణోతు రవి కుమార్, డాక్యుమెంట్ రైటర్ అసిస్టెంట్ ఆర్మూర్ రవి, రూ.5వేలు లంచం తీసుకుంటూ ఉండగా పట్టుకున్నట్లు వారు తెలిపారు. అనంతరం ముగ్గురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడులలో ఎసిబి డిఎస్‌పి వివి. రణమూర్తి, సిఐ, సిబ్బంది తదితురులు పాల్గొన్నారు.

## సామాజిక సంబంధాల పెంపులో క్రీడలదే ప్రముఖ పాత్ర

యువ నాయకుడు కిష్టంపేట రామచందర్ రెడ్డి



ప్రజాపక్షం/ గొల్లపల్లి : సామాజిక సంబంధాల పెంపులో క్రీడలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని జగిత్యాల జిల్లా రెడ్డి జన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, హైకోర్టు అడ్వకేట్ యువ నాయకుడు కిష్టంపేట రామచందర్ రెడ్డి అభిప్రాయ పడ్డా రు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని శ్రీరాములపల్లె గ్రామంలోని గ్రామ యువకులను ప్రోత్సహిస్తూ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని క్రికెట్ టోర్నమెంట్‌ను యువ నాయకుడు రామచందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభి నందనీయమన్నారు. గ్రామంలో యువకులకు ప్రతి కార్యక్రమంలో తన వంతుగా అండగా ఉంటానని, ఈ టోర్నమెంటులో ఐదు టీం లు పాల్గొనగా ఇందులో విజేతగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కిష్టంపేట రమేష్ రెడ్డి, పొన్నం రఘుపతి గౌడ్, నల్ల నరసింహారెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు గుండేటి తిరుపతి రెడ్డి, గ్రామ యువకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సైనికులకు సన్మానం




ప్రజాపక్షం/రామగిరి : ఆర్మీ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ఆధ్వర్యంలో దేశ ఆర్మీలో పనిచేసి పదవీవిరమణ పొందిన తరువాత సింగరేణి సంస్థలో చేరి రామగుండం ఆర్‌జి 3, ఒసిపి–2 సేవలందిస్తున్నా మాజీ సైని కులు కోట రవీందర్ రెడ్డి,మదన్ ప్రసాద్,కసిం,దర్మెందర్‌లను బుధవారం ఘనంగా శాలువాలతో సన్మానించారు. అనం తరం క్లబ్ అధ్యక్షులు మొలుమురి శ్రీనివాస్, డైరెక్టర్, మాజీ జడ్‌పిటిసి గంట వెంకట రమణరెడ్డి మాట్లాడుతూ భారత సైనికులు, 24 గంటలు సరిహద్దుల్లో దేశానికి కాపలా కాస్తూ ఎడారి ఎండల్ని, కాశ్మీరు మంచును, మేఘాలయా వర్షా లను లెక్కచేయకుండా దేశరక్షణలో ప్రాణత్యాగానికైనా సిద్ధపడుతున్నారన్నారు. కోట్లాది భారతీయుల కోసం తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ, దేశాన్ని కంటికి రెప్పలా కాపలా కాస్తున్నారన్నారు. వారిని సన్మానించు కోవడం మన బాధ్యతన్నారు. అనంతరం మాజీ సైనికులు, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి మాట్లాడారు. భారత సైన్యం ఇండియన్ ఆర్మీ డే వేడుకలు సందర్భంగా వారిని సన్మానించిన లయన్స్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒసిపి2 సంక్షేమ అధికారి ప్రీతి, లయన్స్ క్లబ్ సభ్యులు ఎల్లంకీ రామారావు, మేకల మారుతి యాదవ్, పరాంకుశం శ్రీనివాస చారి, కార్మిక సంఘ నాయకులు ఎంఆర్సీ రెడ్డి, రామిడ్ల మనోహర్, సంతోష్,సదానందం, రాజేందర్ పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ



ప్రజాపక్షం/హుస్నాబాద్ : వివిధ కారణలతో గత రెండు రోజుల క్రితం మృతి చెందిన బిజెపి నాయకుల కుటుంబాలను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బుధవారం వారి కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా బొంగొని లక్ష్మ య్య, చిట్టి గోపాల్ రెడ్డి వారి కుటుంబాలను పరామర్శించి వారి చిత్రపటాలకు పూలమాల వేసి ఆ కుటుంబాలకు ప్రగాఢ సానుబూతి ప్రకటించి మృతికి గల కారణాలను అడిగితెలుసున్నారు. మంత్రి మాట్లా డుతూ చిట్టి గోపాల్‌రెడ్డి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పూర్వపు ప్రచారకర్తగా పనిచేశారని, ఒక జర్నలిస్టుగా తన ప్రతిభను చూపించారని ఎన్నో సామాజిక కార్యక్రమాలను చేపట్టారని, వివేకనంద విద్యాలయం స్థాపించి ఎంతో మందికి విద్యనందినంచారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు కొమటిరెడి రాం గోపాల్‌రెడ్డి లక్కిరెడ్డి తిరుమలరెడ్డి, బత్తుల శంకర్‌బాబు, పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ చిట్టి దేవేందర్‌రెడ్డి, రామంచ మహేందర్‌రెడ్డి, అనంతస్వామిలు పాల్గొన్నారు.

## బండలవాగు ప్రాజెక్టుతో సాగు భూములకు 'ఎల్లంపల్లి' నీరు



ప్రజాపక్షం/పాలకుర్తి : పెద్దపలి జిల్లా పాలకుర్తి మండలం కుక్కల గూడూర్‌లోని బండలవాగు ప్రాజెక్టు ద్వారా 15 వేల ఎకరాల సాగు భూములకు ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని ఎత్తిపోతల ద్వారా అందిం చనున్నట్లు రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తెలిపారు. కుక్కలగూడూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథు లుగా ఎమ్మెల్యే దంపతులు మక్కన్‌సింగ్, మనాలి ఠాకూర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను పాదయాత్ర చేసినపుడు ఇచ్చిన హామీ మేరకు బండలవాగు ప్రాజెక్టు ద్వారా ఎల్లంపల్లి నీటిని ఇచ్చేందుకు ఎత్తిపోతలు సిద్ధంగా ఉందన్నారు. త్వరలో ఈ పథకాన్ని మంత్రులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎడ్లబండ్ల ఊరేగింపు, ముగ్గుల పోటీలు, గంగిరెద్దులు, కోడిపుంజులు, ముగ్గుల పోటీలు, పతంగులు ఎగు రవేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కుక్కల గూడూర్ గ్రామం అంటే తనకు చాలా ప్రేమ అన్నారు. గ్రామాభివృద్ధి, ప్రజలు సంతోషంగా ఉండడానికి, గ్రామ అవసరాలకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని చెప్పారు.

# ప్రజా సంక్షేమమే ప్రజా పాలన లక్ష్యం

- గర్రెపల్లి మండలం ఏర్పాటుకు కృషి
- ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బిఆర్‌ఎస్ కుటిల యత్నాలు
- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు





ప్రజాపక్షం/సుల్తానాబాద్: రాష్ట్ర ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన లక్ష్యమని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు.అర్హులైన అందరికీ త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం కొత్త తెల్ల రేషన్ కార్డులు జారీ చేస్తుందని ఆయన అన్నారు. సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించే తలపెట్టిన సిసి రోడ్డు ప్రనులను బు ధవారం ఎమ్మెల్యే విజయ రమణారావు, అధికారు లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకుల తో కలిసి శంకుస్థాపన, భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా దశలవారీగా సంక్షేమ పథకాలను అ మలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో ఎంతమంది అర్హులు ఉంటే అన్ని కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులను అందిస్తామన్నారు. 26 నుండి రైతు కూలీలను ఆదుకుంటామని, రైతు భరోసా ఎకరానికి రూ.12 వేలకు పెంచడం జరిగిందన్నారు. త్వరలోనే గ్రామసభల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని , అర్హులైన అందరికీ దశలవారీగా ఇండ్లు పంపిణీ చేస్తామన్నారు. గర్రెపల్లి గ్రామం కేంద్రంగా కొత్త మండలాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమ పథకాలతో నిత్యం ప్రజల కోసం కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం కృషి చేస్తుంటే బీఆర్‌ఎస్ పార్టీ ఓర్వలేకపోతుందని ఎమ్మెల్యే మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు బండారి రమే ష్, నామని రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చిలుక సతీష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, గ్రామ పెద్దలు, మాజీ వార్డ్ మెంబర్ లు, ముదిరాజ్ సంఘాల నాయకులు, ఎంపీడీవో, పంచాయతీ రాజ్ ఏఈ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

### గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలని, క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు.సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పెద్దపల్లి మండలం కాపులపల్లి గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మ్యాదరవేణి మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కబడ్డీ టోర్నమెంట్స్ బుధవారం సాయంత్రం ముగిసాయి. ఇందులో విజేతలైన వారికి స్థానిక నాయకులతో కలిసి బహుమతులను అందించిన అనంతరం ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ క్రీడల్లో ఓడినా గెలిచినా నైపు ణ్యం అభివృద్ధి చెందుతుందన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహదారుడ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా క్రీడలు క్రమశిక్షణకు దోహదపడతాయన్నారు. ఈ టోర్నమెంట్స్ ను స్ఫూర్తిగా తీసుకొని అన్ని గ్రామాల్లో ఇలాంటి గ్రామీ ణ క్రీడలు నిర్వహించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లేష్ యాదవ్, మాజీ ఎంపిటిసి ఎడెల్లి శంకర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ముత్యాల నరేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జడల రాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు సాయి, సుకన్య, గాజుల ప్రవీణ్, నల్లపు తిరుపతి, పిట్టల స్వామి, పలువురు పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 'సైబర్ నేరాల'పై యువత చైతన్యం తీసుకురావాలి

ప్రజాపక్షం/అంతర్గాం : యువకులు గ్రామ ప్రజల్లో ట్రాపిక్ నిబంధనలు, సైబర్ నేరాలకు గురికాకుండా చైతన్యం తీసుకురావాలని రామగుండం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ టి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామంలో స్థానిక న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ ఒబిసి సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు పెండ్యాల మహేష్ ఆధ్వర్యంలో పెద్దంపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు సిఐ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరకదారుఢ్యం పెరుగుతుందని, యువత మంచి మార్గంలో నడుస్తార న్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి ఆముల శ్రీనివాస్, నాయకులు మెరుగు కుమార్, పల్లె రవీందర్, కన్న తిరుపతి, జూనియర్ సచిన్, రాజయ్య, లైసెట్టి రవి, బూషిపాక సాగర్, ఊరేటి మహేష్, బీరెల్లి ప్రశాంత్, వేముల సురేష్, ఆర్‌ఎస్ఐ ప్రణీత్, పెండ్యాల సాగర్, పెండ్యాల వెంకటేష్, కోడిపుంజుల వెంకటేష్, గుడికందుల కుమార్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.





### పోలీసు ఉద్యోగం పొందిన యువతకు సన్మానం

సమాజంలోని ప్రతి పౌరుడు యూనిఫాం లేని పోలీసేనని, సమాజంలో శాంతి నెలకొనడానికి యువత సహకరించాలని రామగుండం సిఐ టి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని పెద్దంపేట గ్రామంలో స్థానిక న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్ ఆధ్వర్యంలో ఇటీవల పోలీసుశాఖలో ఉద్యోగం పొందిన పెద్దంపేట గ్రామ యువకులకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఐ పాల్గొని మాట్లాడారు. యువత నేరాలకు, దొంగతనాలకు, మత్తు పదార్థాలకు, సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా గ్రామీణ యువత వారిలో చైతన్యం కల్పించాలన్నారు. యువత క్రమశిక్షణతో ఉండి పోటీ పరీక్షల్లో ఎంపికై పోలీసుశాఖ ఉద్యోగాల్లో చేరాలని, పోలీసుశాఖ ఉద్యోగాలకు అవసరమైన మేరకు అండగా ఉంటామని సందేహాలను తీరుస్తామని చెప్పారు. గ్రామం నుండి ఆర్‌ఎస్ఐగా ఉద్యోగం సాధించిన ప్రణీత్, కానిస్టేబుల్స్ ఉద్యోగాలు సాధించిన పల్లె శ్రీనివాస్, బండి సాయి, పుట్ట రాహుల్, పైడిపల్లి సాగర్‌లను పెండ్యాల మహేష్‌తో కలిసి ఈ సందర్భంగా సిఐ వారిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

## రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరి

ప్రజాపక్షం/బెజ్జంకి : రహదారి భద్రత నియమాలను ప్రతి ఒక్కరు పాటించాలని ఎస్ఐ కృష్ణారెడ్డి సూచించారు. మండల పరిధిలోని బెజ్జంకి క్రాస్ రోడ్డు వద్ద బుధవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తే ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని, అందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో వాహన దారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాలల సంరక్షణ కేంద్రంలో 'సంక్రాంతి' వేడుకలు



ప్రజాపక్షం/రామగుండం : రామగుండం పట్టణంలోని తబితా బాలల సంరక్ష ణ కేంద్రంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఆశ్రమ పిల్లలకు సంక్రాంతి ఫలహారాలు. పతంగులు అందించి శుభాకాంక్షలు తెలిపినట్లు ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు మద్దెల దినేష్ తెలిపారు. సీనియర్ కళాకారుడు రేణికుంట్ల రాజమొగిలిని సంక్రాంతి అవార్డుతో ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. ఆశ్రమ నిర్వాహుకులు భూక్య వీరేందర్ నాయక్ పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన పీర్ పహడీ దర్గా ఉర్సు ఉత్సవాలు



ప్రజాపక్షం/రామగిరి : పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని బేగంపేట గుట్టపై గల సయ్యదీన పీర్ పహడి బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు బు ధ వారం అంగరంగ వైభవంగా ప్రారంభమ య్యాయి. ఈ ఉర్సు ఉత్సవాలకు గాను రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుంటారు. బేగంపేట తో పాటు కాగజ్ నగర్ మంథని పెద్దపల్లి, కమాన్ పూర్ ప్రాంతాల నుండి గంధం తీసుకు వచ్చి సమర్పిస్తారు. ఇప్పటికే భక్తుల సౌకర్యం కోసం నిర్వాకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. గుట్టపై వరకు విద్యుత్ దీపా లను అలంకా రంతో ఏర్పాటు చేశారు. అలాగే గంధాన్ని గుర్రంపై తీసుకురావడం జరుగుతుంది. గురువారం ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తారు. భారీగా భక్తులు హాజరై స్వామికి మొక్కులు చెల్లించుకుంటారు.

## ఇద్దరు దొంగలు అరెస్టు



ప్రజాపక్షం/మల్యాల: జగిత్యాల జిల్లా మ ల్యాల మండల కేంద్రంలో మల్యాల మంజుల ఇంట్లో 4న అర్ధ రాత్రి చోరీ జరిగింది. బాధితులు ఉదయం మల్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయ గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం కేసులోని ఇద్దరు దొంగలను పట్టుకొని, వారి వద్ద నుండి సుమారు మూడున్నర తులాల బంగారం, రెండు సెల్‌పోన్లు స్వాధీన చేసుకున్నట్లు తెలి పారు. మల్యాల గ్రామానికి చెందిన మ్యాక మహేష్, కుంద బాబు లుగా గుర్తించి వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపారు.

# ప్రతీ ఇంట సంక్రాంతి పండుగ వెలుగులు



ప్రజాపక్షం/గోదావరిఖని : సంక్రాంతి పండుగ ప్రతి ఇంట్లో వెలుగులు ఇవ్వాలని, ఆర్జీ1 సింగరేణి సేవా సమితి ప్రధాన కార్యదర్శి కె.వి.శిరిష అన్నారు. ఎన్‌టిపిసి అన్నపూర్ణకాలనీలో హిందు వాహిని, మేడి తిరుపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళల ముగ్గుల పోటీలకు ముఖ్య అతిథిగా ఆమె హాజరై ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందించారు. పలువురు మా ట్లాడుతూ తెలంగాణ సంస్కృతి అద్దం పట్టేలా మహిళలు ముగ్గులు వే శారని, బసవన్నల ఆట పాటలు, తెలంగాణ రాష్ట్రానికే స్వంతమైన ఆ చారాలు పండుగ సంతోషాన్ని పం చాలన్నారు. ప్రతి కుటుంబం సుఖసంతో షాలతో గడపాలని కోరుకున్నారు. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సేవా సమితి జాయింట్ సెక్రటరీ బీనా సింగ్, ఇందారం సునీత, కొంక అన్నపూర్ణ, హి ందువాహిని బాధ్యులు సంతోష్‌రెడ్డి, సతీష్, శ్రీకాంత్, సాయి, శివ, నరేష్, చిరంజీవి, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత పేదలకే ఇందిరమ్మ ఇండ్లు




కలెక్టర్ కోయ శ్రీహర్ష

ప్రజాపక్షం/గోదావరిఖని : సర్వేలో అత్యంత పేదలకు మొదటి జాబితాలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయనున్నట్లు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం ఎన్టీపీసీలోని మిలినీయం హాల్‌లో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, నూతన రేషన్‌కార్డుల జారీ వంటి అంశాలపై రామగుండం నియోజకవర్గ స్థాయి కార్యచరణ ప్రణాళిక, శిక్షణ, సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు జె.అరుణశ్రీ, డి. వేణు పాల్గొన్నారు. ఈనెల 26 నుంచి ప్రారంభమయ్యే 4 కొత్త ప్రభుత్వ పథకాల కార్యక్రమాలను విజయ వంతంగా అమలు చేయాలన్నారు. అధికారులు, సిబ్బంది ఎలాంటి ఒత్తిడులకు గురికాకుండా అత్య ంత పేదలను ఎంపిక చేయాలన్నారు. అర్హత లేని భూముల ను గుర్తించి రైతు భరోసా ను ంచి తొలగించాలన్నారు. ఈనె ల 23న గ్రామసభలు నిర్వహించి అర్హుల జాబితాను ప్రజలకు తెలియజేసేలా ప్రదర్శిం చి, అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాత తుది జాబితాను ఈనెల 25న ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.కాళి ందిని, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి, జడ్పీ సీఈవో నరేందర్, ఆర్డీవో గంగయ్య, తహసీల్దారు జి.కుమారస్వామిలు పాల్గొన్నారు.

# పారదర్శకంగా సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 26వ తేదీ నుండి అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసి సమావేశపు హాలులో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాల అమలుకు లబ్ధిదారుల ఎంపికలో క్షేత్రస్థాయి విచారణ, గ్రామసభలు నిర్వహణపై రెవెన్యూ, పంచాయతీ రాజ్, వ్యవసాయ, డిఆర్‌డిఓ, పౌర సరఫరాలు, గృహ నిర్మాణం, మండల ప్రత్యేక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జనవరి 26వ తేదీ నుండి అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇండ్లుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ విధివిధానాలకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో విచారణ, గ్రామసభలు నిర్వహణకు వ్యవసాయ, రెవెన్యూ, డిఆర్డీఏ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ సభలు నిర్వహించి, లబ్ధిదారుల తుది జాబితా ఖరారు చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో 16 నుండి 20వ తేదీ వరకు క్షేత్రస్థాయి విచారణ, 2124 వరకు గ్రామసభలు నిర్వహించే విధంగా షెడ్యూల్ తయారు చేసినట్లు సూచించారు. జిల్లా, మండల స్థాయి అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయి విచారణ, గ్రామ సభలు నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలను తప్పని సరిగా పాటించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న క్షేత్రస్థాయి సర్వేలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా సర్వే ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. 21వ తేదీ నుంచి 24వ తేది వరకు నిర్వహించే గ్రామ సభలు ప్రణాళికాబద్ధంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ సభల్లో వచ్చే ఫిర్యాదులను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, అలాగే కంట్రోల్ రూములను ఏర్పాటు చేసి, అర్జీలను స్వీకరించాలని పేర్కొన్నారు. సర్వే, గ్రామ సభలు నిర్వహణపై ఒక రోజు ముందుగానే టామ్ టామ్ చేపించాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు.

**రైతు భరోసా :** వ్యవసాయ యోగ్యమైన భూములకు పంట పెట్టుబడి సాయం కింద ఎకరాకు 6 వేలు చొప్పున రెండు విడతలుగా 12 వేలు అందించడానికి భూ భారతి (ధరణి) పోర్టల్ లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలన్న ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు వ్యవసాయానికి అనువుగా లేని ఇళ్లు లేదా కాలనీలుగా మారిన అన్ని రకాల భూములు, రియల్ ఎస్టేట్, లే అవుట్ చేసిన భూములు, నాలా కన్వర్షన్ చేసిన భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, గోదాములు నిర్మించిన భూములు, వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములు, రాళ్ళు, రప్పలు, గుట్టలతో నిండి సాగుకు అనువుగా లేని భూములను తొలగించాలని సూచించారు. ఈ నెల 16వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహణకు వ్యవసాయ, రెవెన్యూ, సర్వేయర్ల తో టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తహసీల్దార్, మండల వ్యవసాయాధికారి బాధ్యులుగా ఉంటారని, వారు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యవసాయానికి యోగ్యం కాని భూములను ధృవీకరించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. వ్యవసాయ యోగ్యం కాని భూముల జాబితాను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా రూపొందించాలని, ఈ జాబితాను గ్రామ సభల్లో ప్రదర్శించడంతో పాటు చదివి వినిపించాలని తెలిపారు.

**ఇందిరమ్మ ఆత్మీయ భరోసా:** ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి భూమి లేని వ్యవసాయ కూలి కుటుంబానికి 6 వేలు చొప్పున రెండు విడతలుగా 12 వేలు నగదు సాయం అందించనున్న నేపథ్యంలో 202324 సంవత్సరంలో కనీసం 20 రోజులు ఉపాధి హామీ పని దినాలు పూర్తిచేసుకున్న భూమి లేని వ్యవసాయ కుటుంబానికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. రాష్ట్రస్థాయి నుండి వచ్చిన జాబితా ఆధారంగా లబ్ధిదారులను గుర్తించాల్సి ఉంటుందని తెలిపారు. ఉపాధి హామీ జాబ్ కార్డును, ఆధార్ కార్డుతో లింక్ చేయాలని, లేని వాటిని నవీకరించాలని సూచించారు. ఈ ప్రక్రియకు బాధ్యులుగా ఎంపిడిఓ, ఉపాధి హామీ పథక సిబ్బంది ఉంటారని తెలిపారు.నూతన రేషన్ కార్డులు జారీ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి నుంచి అన్ని జిల్లాల వారీగా కుల గణన సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్ కార్డులు లేని కుటుంబాల జాబితా ప్రకారం పరిశీలించాలని, ఇందుకోసం జిల్లా స్థాయిలో డీసీఎస్ఓ పర్యవేక్షకులుగా వ్యవహరించాలని, మండల స్థాయిలో ఎంపిడిఓ, మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ ఈ మొత్తం ప్రక్రియకు నోడల్ అధికారులుగా ఉంటారని తెలిపారు. జాబితాను గ్రామ, వార్డు సభల్లో ప్రదర్శించాలని గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ. 1.50 లక్షలు, అర్బన్ లో 2 లక్షలతో పాటు 3.5 ఎకరాలు వెట్, 7 ఎకరాలు డ్రై ల్యాండ్ ప్రామాణికంగా ఉండాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి రేషన్ కార్డు ఆధారంగా నిర్మాణానికి స్థలం ఉన్న, ఇండ్లు లేనివారు, పూరిగుడిసెలు ఉన్నవారు, అద్దె ఇళ్లలో నివాసం ఉన్నవారు అర్హులను తెలిపారు. ఇందులో భాగంగా మట్టి గోడలు, పైకప్పు లేని గృహాలు, వితంతువులకు, భూమిలేని వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇందుకోసం ఈ నెల 18 లోగా ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్ లాగిన్లలో ఎటువంటి లోపాలు లేకుండా సూపర్ చెక్ ను పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, అన్ని మండలాల ఎంపిడిఓలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ నర్సంపేట :** గ్రామీణ యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట మండలం లక్నేపల్లిలో యంగ్ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని షటిల్, ముగ్గుల పోటీ, తాడులాగుడు ఆటలను బుధవారం నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యుడు రామానంద్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పార్వతమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు కిరణ్, నర్సంపేట మున్సిపాలిటి ఫ్లోర్‌లీడర్ సాంబయ్య గౌడ్ తదితరులున్నారు.

## బహుమతి ప్రదానోత్సవంలో మాజీ ఎమ్మెల్యే చల్లా

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన భారాస నాయకులు పాపని రవీందర్ తల్లిదండ్రులు పాపని లలిత విశ్వనాథం జ్ఞాపకార్థం గ్రామ స్థాయి కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్ ఆత్మకూరు మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బహుమతి ప్రదానం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హాజరై బహుమతి ప్రదానం చేశారు.వాలీబాల్ , కబడ్డీ క్రీడల్లో ప్రథమ బహుమతి రూ.3500, ద్వితీయ బహుమతి రూ.2500, మెమెంటో విజేతలకు అందచేసారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ..యువతలో ఉన్న స్కిల్స్ బయటికి తేవడానికి చదువుతో పాటు క్రీడలు ఎంతో దోహదపడుతాయని, తల్లితండ్రులు కూడా వారి ఇష్టాయిష్టాలను గ్రహించి ప్రోత్సహించాలి. యువత కోసం ఈ టోర్నమెంట్ నిర్వహించిన పాపని రవీందర్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'సంక్రాంతి' రైతుల జీవితాల్లో కాంతిని నింపాలి

జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ మెంబర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి



**ప్రజాపక్షం/మంగపేట:** సంక్రాంతి పండగ రైతుల జీవితాల్లో సరికొత్త కాంతిని నింపాలని జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ మెంబర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి అన్నారు. మంగళవారం మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా వివేక ఎఫ్‌పిఓ రైతు ఉత్పత్తిదారుల సంఘం వికాస్ అగ్రి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంబశివరెడ్డి మాట్లాడుతూ పల్లె తల్లి వంటిదని ఏ దేశమేగినా పల్లె మూలాలు మరవద్దని అన్నారు. సంక్రాంతి పండగ అంటే రైతుల పండగ అని సంక్రాంతి పర్వదినం రైతుల జీవితాల్లో కాంతిని నింపే విధంగా ప్రయత్నాలు తోడ్పాటు అందించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వివేక ఎఫ్‌డిఓ కార్యాలయ సిబ్బంది బన్నూరి ధరనిధర్ రెడ్డి, జడ్జి పూర్ణ ప్రసాద్, వికాస్ అగ్రి ఫౌండేషన్ డైరెక్టర్లు చెట్టుపల్లి, తిరుపతిరావు, నేలపట్ల, శేషారెడ్డి, ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు, స్థానిక గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతరకు హాజరైన పోలీస్ కమిషనర్



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** సంక్రాంతి పర్వదినం సందర్భంగా వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ కుటుంబ సమేతంగా కొత్తకొండ వీరభద్రస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సిపి ఎండ్లబండితో స్వామివారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి కోడె మొక్కులను చెల్లించారు. జాతరకు వచ్చిన భక్తులతో మాట్లాడి క్యూ లైన్ల వద్ద బందోబస్తును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాజీపేట సిఐ తిరుమల్, ఎల్కతుర్తి సిఐ పులి రమేష్, ముల్కనూరు ఎస్సై సాయిబాబు, మడికొండ సిఐ కిషన్, ధర్మసాగర్ సిఐ ప్రవీణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కాళేశ్వరం బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా గణేష్ బాధ్యతలు స్వీకరణ



**ప్రజాపక్షం/కాళేశ్వరం:**జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం నూతన బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా బుధవారం కాళేశ్వరం గ్రామానికి చెందిన నారా గణేష్ బాధ్యతలు స్వీకరించారు. తపాల శాఖకు సంబందించిన సేవలకు ఎల్లవేళలా తాను అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## క్రీడలు స్నేహ సంబంధాలను పెంపొందిస్తాయి

పిసిసి సభ్యుడు డాక్టర్ లక్ష్మి నారాయణ నాయక్



**ప్రజాపక్షం/పాలకుర్తి:** గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే క్రీడలు స్నేహ సంబంధాలను పెంపొందిస్తాయని పిసిసి సభ్యుడు డాక్టర్ లక్ష్మి నారాయణ నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని నల్లిగాని తండాలో సంత్ సేవాలాల్ సేన నాయకుడు కునుసోత్ ప్రవీణ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి కబడ్డి క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగాన్ని మరింత ప్రోత్సహిస్తుందన్నారు. సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు శంకర్ నాయక్, మధర్ వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు సిరికొండ విక్రమ్, తొర్రూరు మండల యూత్ కాంగ్రెస అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్ యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి కునుసోత్ ప్రవీణ్ నాయక్, విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు అనిల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## అన్నారం షరీఫ్ దర్గాకు 'గిలాఫ్' పంపిన మాజీ ఎమ్మెల్యే నన్నపునేని

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** అన్నారం షరీఫ్ దర్గాలో నిర్వహించే ఉర్సు ఉత్సవాలకు బుధవారం తెలంగాణ రాష్ట్ర వరంగల్ తొలి మేయర్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో దర్గాకు గిలాఫ్‌కు ప్రత్యేక ప్రార్థనలు చేసి పంపించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మైనార్టీ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముక్తీశ్వర దేవాలయం అభివృద్ధికి సహకరించండి

కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షేకావత్‌కు మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** మంథని నియోజకవర్గంలోని కాళేశ్వరం మంథని రామగిరి ప్రాంతాలను ఆధ్యాత్మిక,వారసత్వ పర్యాటక సర్క్యూట్‌గా గుర్తించి, అభివృద్ధి చేయాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షేకావత్ కు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు డిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం కేంద్ర మంత్రిని కలిసి మంథని నియోజకవర్గ పరిధిలోని కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయం, రామగిరి కోటను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చొరవ చూపాలని వినతి పత్రం అందజేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వరం క్షేత్రంలో గోదావరి నది ఒడ్డున వెలిసిన కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయానికి వేయ్యేళ్లకు పైగా చరిత్ర ఉందని దేశంలో ఎక్కడా కనిపించని విధంగా గర్భగుడిలో ఒకే పానవట్టంపై రెండు శివలింగాలు పూజలందుకుంటున్నాయని, ఒకటి ముక్తేశ్వరుడుగా (శివుడు), మరొకటి కాళేశ్వరుడుగా (యముడు) ఆయనకు వివరించారు. కాళేశ్వరం ఆలయాన్ని ఏటా లక్షలాది మంది భక్తులు దర్శించుకుంటున్నట్లు ఈ సందర్భంగా శ్రీధర్ బాబు కేంద్ర మంత్రికి తెలిపారు. కాళేశ్వరం క్షేత్రంలో ఈ ఏడాది మే నెలలో జరుగనున్న సరస్వతి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని, సరస్వతి పుష్కరాలలో 30 లక్షల నుంచి 40 లక్షల మంది ఇక్కడ పవిత్ర స్నానాలను ఆచరించేందుకు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. ఇక్కడే 2027లోనూ గోదావరి పుష్కరాలు జరగనుండటంతో అప్పుడు కోటి మందికి పైగా భక్తులు వచ్చే అవకాశముందని తెలిపారు. సోమ్ నాథ్,కేదార్ నాథ్, మహాకాళేశ్వర్, అయోధ్య, కాశీల మాదిరిగా ఎంతో ప్రత్యేకత కలిగిన ఈ ఆలయాన్ని కూడా ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక, ఎకో టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయొచ్చని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి సమగ్ర ప్రణాళికలు రూపొందించామని వీటిని అమలు చేసేందుకు కేంద్రం సహకరించాలని కేంద్ర మంత్రిని శ్రీధర్ బాబు కోరారు. భక్తుల సౌకర్యార్థం పుష్కరాలు మొదలయ్యే నాటికి ఈ అభివృద్ధి పనులను పూర్తి చేసేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో మరొక పర్యటక కేంద్రమైన రామగిరి కోటకు సుమారు 1200ఏళ్ల చరిత్ర ఉంది. రామాయణంలోనూ దీని గురించిన ప్రస్తావన ఉందని, రాముడి ఆలయాలు, జలపాతాలు, ఎన్నో ఔషధ మొక్కలు ఇక్కడున్నాయి. ఒక ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రానికి కావాల్సిన అన్ని ఆకర్షణలు ఇక్కడున్నాయని ఈ కోటను సందర్శించేందుకు అనేక ప్రాంతాల నుండి పర్యాటకులు వస్తున్నారన్నారని తెలిపారు. స్వదేశీ దర్శన్ 2.0 లేదా ఇతర పథకాల కింద రామగిరి కోటను మెగా టూరిజం హబ్ గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కోరారు.

## క్రీడలు మానసికోల్లోసానికి దోహదం

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :**క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వానికి దోహదపడతాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సీనియర్, బుధవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో సీనియర్, జూనియర్ గెట్ టుగెదర్ 2025 క్రికెట్ టోర్నమెంట్ ను ఎమ్మెల్యే జిఎస్ఆర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఆయన స్వయంగా బ్యాట్ పట్టి మ్యాచ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ, క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. యువత క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలన్నారు. అలాగే, భూపాలపల్లి జిల్లాలో క్రీడా సదుపాయాలను మరింత అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం క్రీడాకారులు ఎమ్మెల్యేని బొకే శాలువాతో సన్మానం చేశారు. సీనియర్, జూనియర్ క్రీడాకారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమానికి హాజరై, క్రీడాకారులను ప్రోత్సహించారు.

## జాతరకు పోటెత్తిన భక్తజనం

ఆలేటి ఎల్లవ్వను దర్శించుకున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండలంలోని బమ్మెర గ్రామశివారులో ప్రతి ఏటా జరిగే ఆలేటి ఎల్లవ్వ తల్లి జాతరకు భక్తజనం పోటెత్తింది. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల ప్రజలతోపాటు వరంగల్, హన్మకొండ, సూర్యాపేట, జనగాం జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలేటి ఎల్లవ్వ తల్లికి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి బోనమెత్తి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు, పాలకుర్తి మార్కెట్ కమిటి చైర్మన్‌లు తిరుపతిరెడ్డి, మంజుల భాస్కర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, నాగయ్య, వెంకన్న, బొమ్మగాని భాస్కర్, గోనె మహేందర్‌రెడ్డి, సోమేశ్వర్, బాలరాజు, సంపత్, ప్రభాకర్, శ్రీనివాస్, యాక సోమయ్య, పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

జిల్లా కలెక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు అందేలా పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి నాలుగు సంక్షేమ పథకాలను అమలు చేయనున్న నేపథ్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ అందుకు సంబంధించిన వివరాలను పత్రికా ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 16 నుండి 20 వరకు క్షేత్ర స్థాయి పరిశీలనకు, 21 నుండి 25 వరకు గ్రామ, వార్డు సభలకు ప్రజలు సహకరించాలని కోరారు. నాలుగు పథకాల క్షేత్రస్థాయి పరిశీలన, గ్రామసభల నిర్వహణకు అదనపు కలెక్టర్ సంధ్యారాణిని జిల్లా నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. రైతుబంధుకు జిల్లా వ్యవసాయ అధికారి, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి డిఆర్‌డిఓ, రేషన్‌కార్డులకు జిల్లా పౌరసరఫరాల అధికారి, ఇందిరమ్మ ఇండ్ల పథకానికి జిల్లా పరిషత్తు సిఇఓ నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. జిల్లాలోని 11మండలాలు, 32 జిడబ్ల్యూఎంసి వార్డులు, నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీలోని వార్డులకు మండల ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో బృందాలను నియమించినట్లు తెలిపారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా పంట వేసినా, వేయకపోయినా అందుతుందని, రైతులు అనవసర అపోహలు పెట్టుకోవద్దన్నారు. రైతు భరోసా పథకానికి ఎటువంటి పరిమితులు లేవని, వ్యవసాయ యోగ్యమైని ప్రతి ఎకరాకు రూ. 12వేలు పెట్టుబడి సాయం అందుతుందన్నారు. భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఏడాదికి రూ.12వేలు అందించనున్నట్లు, ఒక్కో విడతకు రూ. 6వేల చొప్పున రెండు విడతలుగా అందించేందుకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించనుందని తెలిపారు. 2023..24 సంవత్సరంలో ఉపాధిహామీ పథకంలో పనిచేసిన భూమి లేని రైతు కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని అన్నారు. జిల్లాలో 20రోజులు ఉపాధి హామీ కూలీలు గా పని చేసిన కార్మికుల జాబితాను తీసుకొ ని ఆధార్‌కార్డు ట్యాగ్ ప్రకారం పరిశీలస్తూ భూమి లేని కుటుంబాలను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేశామని, టోల్ ఫ్రీ నెంబర్ 18004253424కు సంప్రందించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు. ప్రజలు ఎలాంటి అపోహాలు, అనుమానాలకు గురి కావద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతాయని స్పష్టం చేశారు.

## 26 నుంచి నాలుగు నూతన పథకాల అమలు

ములుగు కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు చేరేలా పటిష్ట కార్యాచరణ, 16 నుండి 20 వరకు నిర్వహించనున్న గ్రామసభలకు జిల్లా ప్రజలు సహకరించేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం నుండి ప్రారంభించనుందని, వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా పంట వేసిన వేయకపోయినా అందుతుందని, రైతులు అనవసర అపోహలు పెట్టుకోవద్దని, రైతు భరోసా పథకానికి ఎటువంటి పరిమితులు లేవని, వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రూ.12వేలు పెట్టుబడి సాయం ప్రభుత్వం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. భూమిలేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఏడాదికి 12 వేల రూపాయలను అందించనున్నట్లు, ఒక్కో విడతకు రూ.6వేల చొప్పున రెండు విడతలుగా అందించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించనుందని, 2023...24 సంవత్సరానికి ఉపాధి హామీ క్రింద పనిచేసిన భూమి లేని రైతు కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులను, ఎంపిడిఓలను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని లేదా కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నెంబర్ 18004257109ను సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## జవాబుదారీతనంగా గ్రామసభలు

హనుమకొండ కలెక్టర్ ప్రావిణ్య



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు చేసేందుకుగాను నిర్వహించే గ్రామ సభలు జవాబుదారీతనంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య అధికారులను ఆదేశించారు. గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో మండల్ స్థాయి ఆఫీసర్స్ ( పంచాయతీ సెక్రెటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్‌తో నిర్వహించిన అవగాహన సదస్సు, శిక్షణ కార్యక్రమం, గ్రామస్థాయి బృందాలు మరియు క్లస్టర్ స్థాయి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 25 వరకు నిర్వహించే గ్రామసభలు ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై నిర్దేశించిన భూములను, మైనింగ్ భూములను వివరాలు ఖచ్చితంగా సేకరించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం కొనుగోలు చేసిన భూముల వివరాలు సూచించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి సేకరించిన వివరాలను గ్రామపంచాయతీ నోటీసు బోర్డుపై వివరాలు ఉంచి అభ్యంతరాలను స్వీకరించాలని, సేకరించిన వివరాలను మండల స్థాయి అధికారులకు తెలియజేయాలన్నారు. లేఅవుట్ మినహా, పడావున్న భూములను కూడా రైతు భరోసా పథకానికి అర్హులుగా గుర్తించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో కె.నారాయణ, తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎఓ శ్రీనివాస్, ఎంపిఓ విమల, గ్రామపంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ అధికారులు ఎఇఓ లు, ఎఇఓలు, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను విజయవంతం చేయాలి

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** లభబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ తో కలిసి కలెక్టర్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల వారీగా సంబంధిత అధికారులతో రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26న అమలుచేయనున్న నాలుగు సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌రార్డులు, ఇందిరమ్మ ఇండ్లు విధివిధానాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు పథకాలు ఈనెల 26న ప్రారంభించనున్న నేపథ్యంలో అధికారులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఈ సమీక్షలో ఆర్‌డిఓలు గోపిరామ్, వెంకన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్ నాయక్, ఎఇ మన్సూర్, డిఆర్‌డిఏ వసంత, డిపిఓ స్వరూప, డిఎఓ రామారావు, డిసిఎస్ఓ సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

## క్రషర్లలో సిసి కెమెరాలు ఏర్పాటు

**ప్రజాపక్షం/నెక్కొండ:**వరంగల్ ఉమ్మడి జిల్లా లోని క్రషర్లలో తప్పనిసరి సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మైనింగ్ డైరెక్టర్ హైదరాబాద్ నుండి ఆదేశాలు జారీ చేశారు. ఈ కెమెరాలు జనవరి 15లోపు ఏర్పాటు చేసుకోవాలని మైనింగ్ ఏడి తెలిపినారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేసిన క్రషర్ యజమానులు సిసి కెమెరాలు ఐడి పాస్వర్డ్ మైనింగ్ ఎడి ఆఫీసులో ఏడి లేదా ఆర్ఐ కి ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశాలు. ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించిన క్వారీ లైసెన్సులు రద్దు చేస్తారని హెచ్చరించారు. తప్పనిసరిగా క్రషర్ యజమానులు సిసి కెమెరాలు క్లస్టర్లలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఆదేశాలు.

ఫోకస్

# కళారంగం

## ఓ కళాకారుడి హత్య..



జమైకాకు చెందిన పాప్ సింగర్ బాబ్ మార్లే అతి తక్కువ సమయంలోనే ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. గాయకుడిగా, రచయితగా, సంగీత దర్శకుడిగా జమైకా సంగీతానికి కొత్త ఊపిరి పోశాడు. 1945 ఫిబ్రవరి 6న జన్మించిన మార్లే, 1981 మే 11న తుదిశ్వాస విడిచాడు. 36 ఏళ్ల వయసులోనే అతను లోకాన్ని విడిచిపెట్టడం దురదృష్టకరం. కేన్సర్‌తో పోరాడి అలసిపోయి, ఈ లోకాన్ని విడిచిపెట్టాడు. దురదృష్టం మార్లెను వెంటాడిందని ఈ కథ చదివిన వారికి అనిపిస్తుంది. కానీ, అసలు కథ ఇది కాదు.. మార్లే కేన్సర్‌తో మరణించడం నిజమేగానీ, అతనికి ఉద్దేశపూర్వకంగా ఒక వ్యక్తి కేన్సర్‌ను అంటగట్టాడన్నది ప్రపంచానికి కొన్ని సంవత్సరాలు తెలియలేదు. ఆ నీచానికి పాల్పడిన బిల్ ఆక్స్‌లే తన 79వ ఏట మృత్యువు ముఖంగా ఉన్నప్పుడు చెప్పిన వాస్తవాలు ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేశాయి. మైన్‌లోని మేరీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో అతను సిఐఎ ఏజెంట్‌గా తన ప్రస్థానాన్ని వివరించాడు. అతని చెప్పిన మాటలు అమెరికా నిఘా సంస్థ 'సెంటల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ'(సిఐఎ) దారుణాలను కళ్లకు కట్టాయి. వివరాల్లోకి వెళితే, చాలా తక్కువ సమయంలోనే మార్లే లక్షలాది మంది అభిమానులను సంపాదించుకున్నాడు. అతని పాటకు జనం ఉర్రూతలూగేవారు. ఒకరోజు, మార్లేను ఓ వీరాభిమాని కలిశాడు. నిత్యం అతనిని చూస్తూ, సేవలు చేయడానికి వీలుగా అక్కడే ఉండే అవకాశం ఇవ్వాలని కాళ్లావేళ్లా పడ్డాడు. ఎంతకీ పట్టువీడకపోవడంతో, మార్లే ఆ అభిమానిని తనతోనే, తన ఇంట్లోనే ఉండేదుకు అంగీకరించాడు. కొంతకాలం అంతా సవ్యంగానే సాగింది. కానీ, తరచు ఒంట్లో నలడగా ఉండడంతో వైద్య పరీక్షలు చేయించుకున్న మార్లేకు ఊహించని నిజం తెలిసింది. అతనికి కేన్సర్ సోకినట్టు వైద్యులు నిర్ధారించారు. ఆ అభిమాని మార్లేను క్షణం కూడా విడవకుండా సపర్యలు చేశాడు. జమైకాలో వైద్యానికి ఎలాంటి ఫలితం లేకపోవడంతో, బ్రిటన్‌లో తనకు తెలిసిన డాక్టర్ ఉన్నాడని, అక్కడ చికిత్స పొందాలని మార్లేను కోరాడు. పట్టుబట్టి మరీ బ్రిటన్‌కు తీసుకెళ్లి వైద్యం చేయించాడు. అక్కడ కూడా షరా మామూలే. మార్లే పరిస్థితి చూసి అల్లాడిపోయిన ఆ అభిమాని అతనిని తన సొంత దేశమైన అమెరికా తీసుకెళ్లాడు. అక్కడ చికిత్స చేయించాడు. కానీ, వ్యాధి మరింత ముదిరింది. తుది ఘడియలు సమీపిస్తున్నాయని తెలుసుకొని మార్లే కన్నీటిపర్యంతమయ్యాడు. లాభాపేక్ష లేకుండా తనకు సేవలు చేస్తున్న ఆ అభిమానిని చూసి మార్లే కన్నీరు పెట్టుకున్నాడు. కృతజ్ఞతలు తెలిపాడు. కేన్సర్‌తో బాధపడుతూ అతను మృతి చెందినప్పుడు ఆ అభిమాని పక్కనే ఉన్నాడు. ఈ కథను, ఈ కోణంలో చూస్తే మార్లే పట్ల సదరు అభిమానికి ఉన్న గౌరవం స్పష్టమవుతుంది. కానీ, ఇక్కడ దిగ్భ్రాంతికరమైన విషయం ఏమిటంటే, ఆ అభిమానే బిల్ ఆక్లే. అతను మార్లే అభిమాని కాదు... అతనిని హత్య చేయడానికి సిఐఎ ఏర్పాటు చేసిన ఏజెంటు. మార్లే వేసుకునే బూట్లలో కేన్సర్ కారకమైన మందులో ముంచిన సూదిని ఉంచడం ద్వారా అతని శరీరంలో కేన్సర్ కారక కణాలను ఎక్కించాడు. ఆ ఘనను మార్లే పెద్దగా పట్టించుకోలేదు. బిల్ అక్లే విజయవంతంగా మార్లేకు కేన్సర్ తెప్పించి, ఉత్తమ వైద్యం పేరుతో అతనికి ఎక్కడా సరైన వైద్యం అందకుండా అడ్డుకొని, ఎవరికీ అనుమానం రాకుండా అతనిని చంపేశాడు. అయితే, సిఐఎ మార్లేను ఎందుకు హత్య చేయమన్నదో తనకు తెలియదని, ఆదేశాల ప్రకారం నడచుకోవడమే తన బాధ్యతని చెప్పాడు. కెరీర్‌లో 17 మందిని చంపానని, కొందరిని విషంతో, మరికొందరిని హత్య చేసినట్టు చెప్పాడు. ఈ జాబితాలో రచయితలు, కళాకారులు, జర్నలిస్టులు, రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, వ్యాపారస్తులు ఉన్నారని అన్నాడు. మిగతా వారి గురించి తాను ఎప్పుడూ ఆలోచించలేదని, కానీ, లక్షలాది మంది అభిమానులున్న మార్లే వంటి ఒక మంచి మనిషిని సిఐఎ ఎందుకు హత్య చేయించిందో అర్థం కాలేదని బాధపడ్డాడు. మార్లే వ్యక్తి స్వేచ్ఛకు ప్రాధాన్యం ఇచ్చేవాడు. అతని పాటల్లో ఎక్కువగా అలాంటి భావాలే ఉండేవి. అమెరికాలో కొనసాగుతున్న జాత్యహంకార విధానాలకు అతను ప్రజలను చైతన్యం చేస్తున్నాడని, ఫలితంగా శ్వేతజాతీయుల ఆధిపత్యం పోతుందనే భయం చాలా మంది అధికారుల్లో ఉండేదని చాలా మంది అభిప్రాయం. అందుకే, ముందు జాగ్రత్త చర్యగా అతనిని చంపించినట్టు అనుమానిస్తున్నారు. అదే నిజం కావచ్చు.


## 'ఆఫ్‌బ్రాడ్‌వే' అంటే..



న్యూయార్క్ సిటీ (అమెరికా)లోని బ్రాడ్‌వే థియేటర్‌కు చారిత్రక నేపథ్యం ఉంది. ప్రపంచంలో అత్యంత ప్రసిద్ధ చెందిన రంగస్థల సంస్థగా బ్రాడ్‌వేను పేర్కొంటారు. 41 వేరువేరు కళాక్షేత్రాల్లో బ్రాడ్‌వే నాటకాలు, రూపకాలను ప్రదర్శిస్తుంది. అందుకే, చాలా సందర్భాల్లో బ్రాడ్‌వే అనేది రంగస్థలానికి లేదా నాటకరంగానికి పర్యాయపదంగా వాడతారు. ఈ క్రమంలోనే ఆఫ్‌బ్రాడ్‌వే అనే పదం తరచు వాడుకలో ఉంటుంది. దీనికీ, బ్రాడ్‌వే థియేటర్‌కు సంబంధం లేదని కొంతమంది వాదన. అయితే, అది నిజం కాదు. బ్రాడ్‌వే థియేటర్‌లో కనీసం 500 సీట్లు ఉంటాయి. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడైనా ఒక థియేటర్‌లో 500 కంటే తక్కువ సంఖ్యలో సీట్లు ఉన్నప్పుడు దానిని 'ఆఫ్‌బ్రాడ్‌వే'గా వ్యవహరించడం ఆనవాయితీగా మారింది. న్యూయార్క్ సిటీకి సంబంధించినంత వరకూ ఆఫ్‌బ్రాడ్‌వే అంటే బ్రాడ్‌వే రంగస్థల ప్రదర్శనలు, నిర్మించే చిత్రాలని అర్థం. ఒక రంగస్థల సంస్థ లేదా కళాక్షేత్రం ఇంతలా ప్రపంచ ప్రఖ్యాతిని ఆర్జించడం అరుదైన విషయం.

## అద్భుత నిర్మాణం..

చరిత్ర



ఆధునిక ప్రపంచ వింతల్లో ఒకటైన పచుపిచ్చులో దర్శనమిస్తున్న రాతి నిర్మాణం ఇది. పెరూలోని మచుపిచ్చు ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా మారింది. అక్కడి 'మోటార్‌లెస్ డోర్ వేస్' ప్రత్యేక ఆకర్షణ. అధునాతన రాతి నిర్మాణాలను సైతం వెక్కిరిస్తున్న ఈ ద్వారాన్ని ఖచ్చితంగా కత్తిరించిన రాతి దిమ్మెలతో నిర్మించారు. ఈ రాళ్లు ఒకదానితో ఒకటి గట్టిగా హత్తుకొని ఉంటాయి. కనీసం బ్లేడు కూడా వీటి మధ్య నుంచి జారిపోదు. అంతటి పటిష్టమైన నిర్మాణం ఎన్నో శతాబ్దాల క్రితం నాటిదని చెప్పినా నమ్మశక్యంకాదు. మచుపిచ్చును 'ఇన్‌కా' సామ్రాజ్య కాలం నాటిదిగా చెప్తారు. అందుకే దీనిని 'లాస్ట్ సిటీ ఇన్ ఇన్‌కాస్' అని పిలుస్తారు. మోర్టార్‌లెస్ నిర్మాణం ఆనాటి నిర్మాణ చాతుర్యాన్ని మాత్రమేగాక, వాటిని సహజ ప్రకృతి దృశ్యంతో సమన్వయం చేసే విధానాన్ని కూడా మనకు తెలియచేస్తుంది.

## అందరికీ ఆప్తుడు ఫ్రెడ్డీ



గుజరాత్‌లోని పంచగని సెయింట్ పీటర్స్ బాయిస్ స్కూల్‌లో, 1958లో తీసిన ఫొటో ఇది. ప్రపంచ మేటి రాక్‌స్టార్, గాయకుడు, రచయిత ఫ్రెడ్డీ మెర్క్యురీ వయసు అప్పుడు 12 సంవత్సరాలు. తన విద్యాభ్యాసం ప్రారంభ సంవత్సరాల్లోనే సంగీతంపై మక్కువతో గాయకుడిగా మారి, ట్రోఫీలు సాధించాడు. గెల్చుకున్న కప్‌తో ఫొటోకు ఫోజులిస్తున్న ఫ్రెడ్డీ అసలు పేరు ఫరోఖ్ బుల్సారా. ప్రస్తుతం టాంజానియాలోని భాగంగా ఉన్న జాంబిబార్‌లో పార్సీ దంపతులకు జన్మించిన ఫ్రెడ్డీ భారత్‌లో ఉన్నప్పుడు బోర్డింగ్ స్కూల్‌లో చదివాడు. అనంతరం అతను తన కుటుంబంతో కలిసి ఇంగ్లాండ్‌లోని మిడిల్‌సెక్స్ ప్రాంతంలో స్థిరపడ్డాడు. రాక్ సింగర్‌గా పేరుప్రఖ్యాతులు ఆర్జించాడు. రాక్ బ్యాంక్ 'క్వీన్' వ్యవస్థాపకుల్లో ఒకడు. ఆ బృందంలో ప్రధాన గాయకుడిగా వెలిగిన ఫ్రెడ్డీ, సొంతంగా ఎన్నో పాటలు రాశాడు. సంగీతం సమకూర్చుకున్నాడు. తానే స్వయంగా పాడేవాడు. పియానో వాయించడంలో నైపుణ్యం సంపాదించాడు. పాఠశాల గాయక బృందంతో ప్రారంభించిన అతని ప్రస్థానం ఇంగ్లాండ్‌లో అత్యున్నత శిఖరాలకు చేరింది. 1946 సెప్టెంబర్ 5న జన్మించిన ఫ్రెడ్డీ 1991 నవంబర్ 24న తన 45వ ఏట తుదిశ్వాస విడిచాడు. జీవించిన కొద్దికాలంలోనే చిరస్థాయిగా నిలిచిపోయే పేరు సంపాదించుకున్నాడు. సంగీత ప్రపంచాన్ని కొత్త పుంతలు తొక్కించిన ఫ్రెడ్డీ ప్రతి కళాకారుడికీ చిరస్మరణీయుడు. ఆదర్శపాత్రుడు. ఇంగ్లాండ్‌లోని వెస్ట్‌ఎండ్ వద్ద, డొమినియన్ థియేటర్ వద్ద నెలకొల్పిన అతని విగ్రహం అభిమానులను అలరిస్తునే ఉంది. స్విట్జర్లాండ్‌లోని మాంట్రెక్స్‌లో, లేక్ జెనీవా వద్ద ఫ్రెడ్డీ అభిమానులు అతని భారీ విగ్రహాన్ని నెలకొల్పారు. అభిమానానికి ఎల్లలు లేవని చాటారు.

## వినూత్న ప్రక్రియలు..



కళాప్రదర్శనల్లో సాంప్రదాయ పద్ధతుల నుంచి అత్యాధునిక విధానాల వరకూ ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. ఇప్పటికీ ప్రయోగాలు జరుగుతునే ఉన్నాయి. ఇటీవల అహమ్మదాబాద్‌లో జరిగి విక్రమ్ సారాభాయ్ ఇంటర్నేషనల్ ఆర్ట్స్ ఫెస్టివల్ 45వ వార్షికోత్సవంలో ఇలాంటి ప్రయోగాలే జరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ కళారాఉలు, కార్యకర్తలు, శాస్త్రీయ నృత్యకారులు, దర్శకులు, స్వరకర్తలు... ఇలా ఎంతో మందిని ఒకే చోటకు చేర్చి ప్రదర్శనలు ఇప్పించడం ఓ అద్భుత లోకాన్ని ఆవిష్కరించింది. సాధారణంగా ప్రదర్శనల్లో ఒకటి లేదా రెండు కళారూపాలను మాత్రమే ప్రదర్శిస్తారు. కానీ, విక్రమ్ సారాభాయ్ ఇంటర్నేషనల్ సంస్థ మాత్రం అందుబాటులో ఉన్న రూపాలనూ కలగలిపి, కళాప్రియులకు పూర్తిస్థాయి విందును అందించింది. ఐరోపా, దక్షిణాసియా సాహిత్యం, సినిమాల నుంచి విభిన్న శైలులు, కళాత్మక వ్యక్తీకరణలను మిళితం చేసి, కార్యక్రమాలను నిర్వహించాలన్నది ఒక గొప్ప ఆలోచన. సాహిత్యం ద్వారా మానవ భావోద్వేగాలను వ్యక్తీకరించడంలో స్థిరమైన నిబద్ధతతో పాటు సంప్రదాయాన్ని ఆవిష్కరించడం ద్వారా ప్రదర్శనలను మూస విధానాల నుంచి బయటకు తీసుకురావడం ఈ ఏడాది ప్రత్యేకత. సాధారణ కళా ప్రదర్శనలు ఒక అంశం చుట్టూ తిరుగుతాయి. కలలను వేటాడడం వాటిలో ప్రధాన ఇతివృత్తమని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే, ఆయాకాలాలకు అనుగుణంగా లక్ష్య సాధనలో కష్టసుఖాలు... ఎత్తుపల్లాలు ఉంటాయి. సవాళ్లను, కోరికలను మిళితం చేసి, ఆశయం, పరివర్తన సొబగులు అద్ది



అల్లిన కథలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. హిందీ, ఇంగ్లీషు, ఇటాలియన్, గుజరాతీ తదితర భాషల్లో మెరిసిన ప్రదర్శనలు ఇప్పటికీ కళారంగానికి కొత్త అందాలతో మెరిగే శక్తి ఉందని నిరూపించాయి. శ్రావ్యమైన సంగీతం ఒకవైపు... అసలుసిసలైన జానపద పద విన్యాసాలు మరోవైపు... చారిత్రక/ పురాణ నటకాలు ఒకవైపు... సాంఘిక రూపకాలు మరోవైపు... కళలకు ప్రాణం పోశాయి. వివిధ వృత్తులు.. రోజువారీ ఘటనలను వివరించే ప్రదర్శన ఒకటైతే, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికీ మధ్య కొనసాగే ఘర్షణ నేపథ్యంగా మరో ప్రదర్శన... భావోద్వేగాలకు పట్టం కట్టే ప్రదర్శన ఒకటైతే, జ్ఞాపకాలను తవ్వితీసి, మనిషి జీవితాల్లో వచ్చిన మార్పులను కళ్లకు కట్టే ప్రదర్శన మరొకటి.. దాదాపు అన్ని ప్రదర్శనల్లోనూ సామాజిక అంశాలే ప్రధాన భూమిక పోషించాయి. కళలు సమాజంపై ఎంతటి బలమైన ముద్ర వేయగలుతాయో చెప్పడానికి ఈ రెండు రోజుల కల్చరల్ ఫెస్టివల్ ఓ ఉదాహరణ. ఇలాంటి కార్యక్రమాలు విస్తృతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో యువజన ఉత్సవాలు



**ప్రజాపక్షం/ఉండవెల్లి :** జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండల పరిధిలోని కంచిపాడు గ్రామంలో ఎఐవైఎఫ్ నాయకులు సురవరం కపిల్ సురవరం వెంకటరెడ్డి విజ్ఞాన కేంద్రంలో యువజన ఉత్సవాలు సంక్రాంతి పండుగ సందర్భంగా మూడు రోజులపాటు ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో పాల్గొన్న వారికి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేయడం జరిగింది. బహుమతుల ప్రధాతలో ముఖ్యంగా మాజీ అఖిలభారత సిపిఐ ప్రధాన కార్యదర్శి సువరం సుధాకర్ రెడ్డి డాక్టర్ రామకృష్ణ కంచుపాడు మాజీ సర్పంచ్ శేషం గౌడ్ సిపిఐ నాయకులు ఆనందు స్టేట్ కౌన్సిల్ తాలూకా సిపిఐ కార్యదర్శి పెద్ద బాబు తదితరులు ఆధ్వర్యంలో బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఏఐవైఎఫ్ వాలంటీర్స్ వీరాంజనేయులు నాగార్జున తదితరులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రజల పక్షాన నిలబడి పోరాడిన యోధుడు కొండన్న

సిపిఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** ప్రజల పక్షాన పోరాడిన యోధుడు కామ్రేడ్ కొండన్న మృతి సిపిఐ పార్టీకి తీరని లోటని బాలకిషన్ అన్నారు.సిపిఐ నారాయణపేట జిల్లా కార్యదర్శి కామ్రేడ్ సిహెచ్ కొండన్న కొన్నాళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతు మంగళవారం మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించారు. ఆయన మృతికి సంతాప సూచకంగా బుధవారం మహబూబ్‌నగర్ సిపిఐ జిల్లా పార్టీ ఆఫీసులో సిహెచ్ కొండన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బాలకిషన్ మాట్లాడుతూ తన చిన్ననాటి నుండి చివరి శ్వాస వరకు పీడిత తాడిత ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా నాయకత్వంలో అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించిన ప్రజల మనిషి కొండన్న ఇక లేరు అన్న చేదు నిజాన్ని మక్తల్, నారాయణ పేట జిల్లా ప్రజలు అలాగే ఉమ్మడి జిల్లా సిపిఐ పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన అన్నారు. కమ్యూనిస్టు పార్టీ సిపిఐతో పాటు ఎఐటియుసి సంఘంలో ప్రధాన బాధ్యతలు నిర్వహిస్తూ కార్మికుల పక్షాన రాజీలేని ఉద్యమాలు నిర్వహించారని కొనయాడారు. కొండన్న లేని లోటు సిపిఐకి పేదలకై జరిగే ప్రతి పోరాటానికి తీరని లోటని ఆయన అన్నారు. కొండన్న ఉద్యమ జీవితం భవిష్యత్తు తరాలకు ప్రజలకు ఈ పని చేసే ఉద్యమకారులతో ఎంతో స్ఫూర్తిదాయకమని వారన్నారు. ఈ కార్యక్రమంలో హన్వాడ మండల కార్యదర్శి శంకర్ నాయక్ మహబూబ్‌నగర్ పట్టణ సహాయ కార్యదర్శి కోటకదిర నరసింహులు ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు మహేష్ హాస్పిటల్ యూనియన్ నాయకులు శేఖర్ గుడ్ బాషా బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.




# పత్తి మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

1000 బస్తాలకు అంటుకున్న మంటలు

మార్కెట్‌లో తరచూ అగ్ని ప్రమాదాలు

అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న వ్యాపారులు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పత్తి యార్డులో బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈనెల 10 నుంచి ఆరు రోజుల పాటు మార్కెట్‌కు సెలవులు ప్రకటించారు. ఈ నెల ఎనిమిది, తొమ్మిది తేదీల్లో పత్తి కొనుగోలు చేసే వ్యాపారులు మార్కెట్‌కు సెలవులు కావడంతో యార్డులోనే కొన్న పత్తిని ఉంచారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఏడు గంటల సమయంలో ఒక్కసారిగా పత్తి బస్తాలకు మంటలు అంటుకున్నాయి. మణికంఠ కాటన్ ట్రేడర్స్, శ్రీరామ ట్రేడర్స్‌కు చెందిన సుమారు 1000 పత్తి బస్తాలకు మంటలు వ్యాపించినట్లు సమాచారం. మార్కెట్‌లో అగ్నిప్రమాదం జరిగిందన్న వార్త తెలుసుకున్న వెంటనే మార్కెట్ వ్యాపారులు, కార్మికులు, స్థానికులు యార్డుకు వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఇతర పత్తి బస్తాలకు మంటలు అంటుకోకుండా అక్కడి నుంచి తొలగించే ప్రయత్నం చేపట్టారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన ప్రాంతంలో ఫైరింజన్లతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. ఈ అగ్ని ప్రమాదంలో ఎంత మేరకు నష్టం వాటిల్లిందో తెలియాల్సి ఉంది. అగ్ని ప్రమాదం ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఎవరైనా నిప్పు పెట్టారా అన్న అనుమానాలు కూడా వ్యాపారులు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపితే అగ్నిప్రమాదం ఎలా జరిగిందో తెలుస్తుంది. మార్కెట్ వద్ద ఫైరింజన్ లేకపోవడంతో మంటలు తీవ్రంగా వ్యాప్తిచెందాయని వ్యాపారులు వాపోయారు. మార్కెట్ యార్డులో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వాటిని ఆర్పేందుకు నీటి వసతి కోసం యార్డులో ఏర్పాటు చేసిన పైపులైన్ల నిర్వహణ సక్రమంగా లేదని సమాచారం. సీజన్ ప్రారంభమైనప్పుడు పైపులైన్‌లో నీరు సక్రమంగా వస్తున్నదా, వాటి నిర్వహణ ఎలా ఉన్నది అన్నది పరిశీలించాల్సిన అధికారులు ఆ వైపు దృష్టిసారించడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి.

**అధికారుల వైఫల్యమే కారణమన్న ఆరోపణలు**

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో అధికారుల వైఫల్యం వల్లే తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. అగ్నిప్రమాదాలు జరుగుతున్నా వాటి నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతేడాది కూడా పత్తి మార్కెట్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుందని సుమారు రూ.40 లక్షల మేర నష్టం వాటిల్లితే రూ. 20 లక్షలు కూడా నష్ట పరిహారం అందించ లేదని వ్యాపారులు వాపోయారు. వరుస సెలవులతో మార్కెట్‌లో ఎటువంటి చర్య లు తీసుకోకపోవడంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. రాష్ట్రంలోనే రెండవ అతిపెద్ద మార్కెట్ అయిన ఖమ్మం వ్యవసాయ మార్కెట్ వద్ద ఫైరింజన్ అందుబాటులో లేకపోవడంతో అగ్ని ప్ర మాదాలు జరిగినప్పుడు నష్ట తీవ్రత అధికంగా ఉంటుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కోట్లాది రూపాయల వ్యాపారం జరిగే మార్కెట్ వద్ద 24 గంటలు ఫైరింజన్‌ను అందుబాటులో ఉంచాలని దశాబ్దాలుగా వ్యాపారులు కోరుతున్నా అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వినవస్తున్నాయి. ఫైరింజన్ మార్కెట్‌లో అందుబాటులో ఉంటే మంటలు వ్యాపించినప్పుడు వెంటనే అదుపు చేసేందుకు వీలు కలుగుతుందని ఇతర ప్రాంతాల నుంచి ఫైరింజన్ వచ్చే లోపు మంటలు వ్యాప్తి చెంది వాటిని అదుపు చేసేందుకు తీవ్రంగా కష్టపడాల్సి రావడంతో నష్టం అధికంగా జరుగుతుందన్న వా దనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి ఖమ్మం మార్కెట్ వద్ద ఫైరింజన్‌ను 24 గంటలు అందుబాటులో ఉంచాలని వ్యాపారులు, రైతులు కోరుతున్నారు.

## ప్రాజెక్టులు పూర్తి చేస్తారన్న నమ్మకముంది

కాంగ్రెస్ ప్రభుత్వంపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విశ్వాసం



**ప్రజాపక్షం/చౌటుప్పల్ మున్సిపల్ :** చౌటుప్పల్ ప్రసాద్ హోటల్‌లో సామాన్యుడిలా కాఫీ తాగుతూ విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రాజెక్టుల పట్ల నిర్లక్ష్యం చేసిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. ఈ ప్రభుత్వం ప్రాజెక్టుల పట్ల అనుకూలంగా ఉందని అసెంబ్లీ సమావేశాలలో ఈ నల్లగొండ జిల్లాలోని ప్రాజెక్టులకు రూ.1800 కోట్లు ప్రకటించిన విషయం తెలిసిందేనని ఈ ప్రభుత్వము ప్రాజెక్టులను పూర్తి చేస్తారని నమ్మకం ఉందని ఆయన మాట్లాడారు. ఎదుల నుండి నక్కల గండి ప్రాజెక్టు ద్వారా కాలువలు పూర్తి చేసినట్లయితే ఈ ప్రాంతం ఫ్లోరోసిస్ పీడిత ప్రాంతాలకు ఉపశమనం కలుగుతుందని, దేవరకొండ మునుగోడు ప్రాంతాలు సస్యశ్యామలమవుతాయ ని ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో కాంగ్రెస్‌తో పొత్తు ఉంట దా అని జర్నలిస్టు అడగగా కాంగ్రెస్ నాయకులపై ఆధారపడి ఉంటదని ఆయన బదులిచ్చారు. సిపిఐ పార్టీ శతవసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి గ్రామములో సిపిఐ శాఖను ఏర్పాటు చేయాలని సిపిఐ జాతీయ సమితి పిలుపునిచ్చిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం లో సిపిఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి, సిపిఐ నాయకులు రెహమాన్, రొండి నరసింహ తదితరులు ఉన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి :** లక్ష్మీ దేవిపల్లి మండలం లాలు తండా పంచాయతీ నందు సిపిఐ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడటంతో సిపిఐ ఎల్లప్పుడు ముందుంటుందని తెలిపారు. ముత్యాల ముగ్గులు, సంక్రాంతి పండుగ ద్వారా మన సంప్రదాయాలను పునరుద్ధరించడంతో పాటు ప్రజల మధ్య ఆనందం పంచేందు కు ఈ పోటీలు దోహదపడతాయని తెలిపారు. మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతో ముగ్గుల పో టీలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, జిల్లా సమితి సభ్యుడు వంగా వెంకట్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సపావత్ రవి, భీముడు, నరసింహ, రవి, సక్రు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం రైతుల ఆమరణ నిరాహార దీక్ష విరమింపచేయాలి



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** కేంద్ర ప్రభుత్వం తక్షణమే రైతుల డిమాండ్స్‌ను పరిష్కరించి ఖన్నొరిలో 51 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జిత్‌సింగ్ థల్లేవాలా దీక్షను విరమింపచేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరు చట్టబద్ధత కల్పించాలని, స్వా మినాథన్ కమిషన్ సిఫార్సులు అమలుచేయాలని, గత సుదీర్ఘ ఆందోళన సందర్భంగా ప్రధాని మోడీ ఇచ్చిన హామీలను అమలుజరపాలని, వ్యవసాయ రంగ పరిరక్షణకు చర్యలు చేపట్టాలని తదితర డిమాండ్ల సాధనకై చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షతో జగ్జిత్ సింగ్ ఆరోగ్యం పూర్తిగా క్షీణించినా మోడీ ప్రభుత్వం స్పందించకపోవడం అ త్యంత దుర్మార్గమన్నారు. ఆయన ప్రాణానికి ఎ లాంటి ముప్పు వాటిల్లినా అందుకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని వెంకట్రాములు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## కట్టా వీరయ్య మృతి.. నివాళులర్పించిన కూనంనేని




**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ పట్టణం 10వ వార్డు సముద్రాల బజార్‌కు చెందిన కట్టా వీరయ్య అనారోగ్యంతో మృతిచెందారు. వీరయ్య భౌతికకాయాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరయ్య కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించి, సంతాపం సానుభూతి తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందరరావు, సముద్రాల వెంకటేశ్వర్లు, నాగయ్య, ఆదినారాయణ, తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## సిపిఐ కార్యకర్త సురేందర్‌రెడ్డి మృతి

**ప్రజాపక్షం/కొణిజర్ల :** సిపిఐ కార్యకర్త, ఎఐవైఎఫ్ నాయకులు వేమిరెడ్డి సురేందర్‌రెడ్డి(33) తీవ్ర అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి సిపిఐ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారు. తండ్రి శ్రీనివాసరెడ్డి పార్టీ నాయకుడిగా ఉన్నారు. రెండు రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురైన సురేందర్ రెడ్డి ఖమ్మంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందారు. మృతుడికి భార్య, సోదరుడు, తల్లిదండ్రులు ఉన్నారు. సురేందర్‌రెడ్డి మృతి వార్త తెలిసిన వెంటనే సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు వెంకటేశ్వరరావు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, మండల నాయకులు మోదుగు చిన్న వెంకటి, అచ్చన శ్రీనివాసరావు, కొనకంచి రామారావు, వేమిరెడ్డి రాంరెడ్డి, గూడురు నర్సిరెడ్డి తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సురేందర్‌రెడ్డి కుటుంబాన్ని ఓదార్చారు.

## స్వామి మరణం తీరని లోటు

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య



**ప్రజాపక్షం/మణుగూరు :** సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు పోతనబోయిన స్వామి మృతిచెందారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య వారి పార్థీవదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. స్వామి మరణం వారి కుటుంబానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. మాజీ ఎంపిపి యదారి రమేష్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి పుల్లారెడ్డి, గ్రామ శాఖ కార్యదర్శులు దేశాబోయిన సహదేవ, నోముల రవి, దోనకాని రాములు, బొల్లం చిన్న మదర్, పోతనబోయిన పిచయ్య, శేషు, కాంగ్రెస్ నాయకులు సాదిని సీతయ్య, కట్ట నరసయ్య, తమ్మిశెట్టి సాంబా, మహేష్, స్వామి తదితరులు నివాళులు అర్పించారు.

## మాజీ సర్పంచ్‌కు భట్టి పరామర్శ



**ప్రజాపక్షం/చింతకాని :** నాగులవంచ మాజీ సర్పంచ్ కంభం వీరభద్రంను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పరామర్శించారు. వీరభద్రం ఇటీవలే బ్రెయిన్ సర్జరీ చేయించుకుని ఇంటికి చేరుకుని విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ సందర్భంగా భట్టీ నాగులవంచలో వీరభద్రం నివాసానికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు. వారి కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మండల అధ్యక్షులు అంబటి వెంకటేశ్వర్లు, చింతకాని సహకార సంఘం డైరక్టర్ కిలారి మనోహర్‌బాబు, ముత్తినేని వెంకటేశ్వర్లు, లింగం రాంబాబు,నారగాని శ్రీనివాసరావు, అంబటి రాజేష్ పాల్గొన్నారు.

## క్రీడలతో స్నేహభావం

సిపిఐ ఆధ్వర్యంలో చిన్నారులకు పతంగుల పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మం :** క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని పెరుగుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సిపిఐ ఆధ్వర్యంలో నర్సింహా స్వామి గుట్ట వద్ద పతంగుల పంపిణీ చేశారు. పతంగులను చిన్నారులతో కలిసి ఎగుర వేశారు. ఈ సందర్భంగా సలాం మాట్లాడుతూ ఈ తరం సెల్ ఫోన్లకు బానిసై ఆన్‌లైన్ ఆటలకు పరిమితమవుతున్నారని, దీనిని మార్చేవిధంగా తల్లిదండ్రులు దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి యానాలి సాంబశివరెడ్డి, జ్వాలా నర్సింహారావు, రమణ, వెంకటేశ్వర్లు, ఉపేందర్, దుర్గ, శోభ, రాణి, మాధవ్ పాల్గొన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం మద్దులపల్లి గ్రామంలో సిపిఐ గ్రామ శాఖ, మదిన టెంట్‌హౌస్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహించారు. పోటీలను భద్రాచలం తహసీల్దార్ తుమాటి శ్రీనివాస్, వరంగల్ క్రాస్‌రోడ్ సిపిఐ శాఖ కార్యదర్శి వెంపటి సురేందర్ ప్రారంభించారు. ఆరు టీంలు పాల్గొనగా... ప్రథమ బహుమని గెలుపొందిన వనపర్ల సాయిమధు టీంకు రూ.పదివేలను మదిన టెంట్‌హౌస్ ప్రొప్రైటర్ షేక్ జానిమీయా, ద్వితీయ బహుమతి గెలుపొందిన తూమాటి అనిల్‌కుమార్ టీంకు ఐదువేల క్యాష్‌ను వెంపటి సురేందర్ అందజేశారు.

# అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుంచి అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల క్షేత్ర స్థాయి సర్వే ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని ఆయన కోరారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు పథకాలపై అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజతో కలిసి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ప్రభుత్వం విధి విధానాలు జారీ చేసిందన్నారు. పథకాల అమలుపై అధికారులకు స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. లబ్దిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ అని దీనిపై ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ పథకాల లబ్ది పొందెలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతు భరోసా కింద ప్రభుత్వం వ్యవసాయ యోగ్యమైన భూములకు ఎకరాకు ఏడాదికి రూ.12వేలు ఇవ్వనుందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించాలన్నారు. జిల్లాలో మొత్తం 589గ్రామాలు ఉండగా 380రెవెన్యూ గ్రామాలు ఉన్నాయన్నారు. గ్రామాల వారీగా పాసుపుస్తకాలను విభజించాలన్నారు. ఆర్ఐ, ఎఇఒలు క్షేత్ర తనిఖీలు చేసి వ్యవసాయ యోగ్యం, వ్యవసాయ యోగ్యం కాని భూముల గుర్తింపు చేయాలన్నారు. నివేదికలకు ఫార్మెట్ రూపొందించి క్షేత్ర అధికారులకు అందజేయాలన్నారు. గురువారం నుండి ప్రారంభించి ఈనెల 19లోగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈనెల 20 నుండి గ్రామసభల నిర్వహణకు కార్యాచరణ చేపట్టాలన్నారు. గ్రామసభల్లో గ్రామకార్యదర్శితో పాటు సంబంధిత శాఖ ల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. ఈనెల 21, 22 తేదీలలో తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారులు రీవెరిఫై చేయాలని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించి ఏడాదికి రూ.12వేలు రెండు విడతలుగా లబ్దిదారులకు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఉపాధి హామీ జాబ్ కార్డు ఉండి భూమి లేక గత సంవత్సరం కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనులు చేసిన వారికి ఆత్మీయ భరోసా పథకానికి అర్హులన్నారు. ఈనెల 18లోగా సర్వే పూర్తి చేసి 20న చేపట్టే గ్రామసభల్లో ప్రజల ముందు ఉంచాలన్నారు. కొత్త రేషన్‌కార్డుల జారీకి మండల స్థాయిలో ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్, జిల్లా పౌర సరఫరాల అధికారి ధృవీకరణ బాధ్యత ఉంటుందన్నారు. ప్రభుత్వం నుండి జారీ చేసిన ఫార్మెట్‌లో సర్వే నివేదిక సమర్పించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అర్హుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే జిల్లావ్యాప్తంగా ముగింపు దశకు చేరుకుందన్నారు. ప్రతి దశలో ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలన్నారు. మొదటి విడతలో నిరుపేదలకు ప్రాధాన్యతనివ్వాలని కలెక్టర్ తెలిపారు. సమీక్షలో డిఆర్‌డివో సన్యాసయ్య, డిపిఒ ఆశాలత, డిసిఎస్ఒ చందన్‌కుమార్, డిఎఒ పుల్లయ్య, హౌజింగ్ పిడి శ్రీనివాస్, అదనపు డిఆర్‌డిఒ నూరుద్దీన్, డిఎల్‌పిఒ రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రతిభకు చేయూతనివ్వండి

పరిశ సీతారత్నం ట్రస్టు సేవలు ప్రశంసనీయం

జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు చేయూత నివ్వడం ద్వారా భవిష్యత్తు తరాన్ని తయారు చేసినట్లవుతుందని జిల్లా సంక్షేమ అధికారి కీసర రాంగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా సంక్షేమ కార్యాలయంలో జెఎన్‌టియులో బిఫార్మసి చదువుతున్న విద్యార్థిని కేసా నవ్యకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు అందించిన రూ.20వేల చెక్కు, జ్ఞాపికను ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు పరిశ పుల్లయ్యతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో ప్రతిభ మరుగున పడరాదని ప్రతిభావంతులు విద్యకు దూరమైతే భవిష్యత్తు సమాజం చాలా కోల్పోతుందన్నారు. నిరుపేద విద్యార్థులకు పరిశ సీతారత్నం ట్రస్టు అందిస్తున్న చేయూత ప్రశంసనీయమని విద్య కొరకు ఆర్థిక సాయం అందించడం విద్యాదానం కంటే గొప్పదని ఆయన తెలిపారు. ట్రస్టు సేవలు పొందుతున్న వారు లక్ష్యంతో ముందుకు సాగాలని జీవితంలో స్థిరపడిన తర్వాత సేవాభావాన్ని కొనసాగించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మహంకాళి స్వరాజ్యలక్ష్మి, పరిశ లక్ష్మి రాజ్యం, బొగ్గారపు మధు, జి.మురళికృష్ణ, కేసా సత్యనారాయణ, పగిడిపల్లి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఈనెల 26న అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫిరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహారభద్రతా కార్డులు పథకాలు ఈనెల 26 నుండి ప్రభుత్వం ప్రారంభించనుందని, ఇందు కోసం లబ్ధిదారుల ఎంపికకు అధికారులంతా అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈనెల 16 నుండి 20వ తేది నాటికి లబ్ధిదారుల ముసాయిదా జాబితా సిద్ధం చేయాలని, 21 నుండి 24 వరకు గ్రామసభలు నిర్వహించాలని, 21 నుండి 25 వరకు డెటా ఎంట్రీ తప్పులు దొర్లకుండా చూడాలని సూచించారు. రైతుభరోసాలో భాగంగా ఎకరాకు ఏటాదికి రూ.12 వేలు అందిస్తారని, వ్యవసాయ యోగ్యమైన భూములకు మాత్రమే లబ్ధి చేకూరుతుందని చెప్పారు. వ్యవసాయం చేయని భూములను అధికారులు సర్వేచేసి తొలగించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా అర్హులైన నిరుపేదలకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో భాగంగా భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి ఏడాదికి రూ.12 వేలు అందిస్తారని, కనీసం 20 రోజులు ఏడాదిలో ఉపాధి హామీ పనిదినాలు పూర్తి చేసుకున్న వారు అర్హులని తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువనున్న వారికి రేషన్ కార్డులు అందుతాయని, కులగణన సర్వే ఆధారంగా రేషన్ కార్డులు లేనివారికి ఈ పథకం అమలవుతుందన్నారు. మండల స్థాయి నుండి డివిజన్ స్థాయి అధికారులు నిబద్ధతతో పేదలకు మేలు జరిగేలా పని చేయాలని సూచించారు. ఈ ప్రక్రియ కోసం సరిపడా కంప్యూటర్లను ఏర్పాటు చేసుకోవాలని, డేటా ఎంట్రీ ఆపరేటర్లను అందుబాటులో ఉంచుకోవాలని, గ్రామసభల తీర్మాణాలు తప్పని సరీ అన్నారు. టెలికాన్ఫిరెన్స్‌లో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యా చందన, ఆర్‌డిఒలు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

### అందుబాటులో డయాలసిస్ యూనిట్లు

కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి కేటాయించిన డయాలిసిస్ యూనిట్లు ప్రజలకు అందుబాటులోనికి తేవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం ఆయన కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రిని పరిశీలించారు. ఓపిలో ఎక్స్‌రే యంత్రం పనిచేయకపోవడనాన్ని పరిశీలించిన ఆయన ఎందుకు వాడటం లేదని సిబ్బందిని ప్రశ్నించారు. పనిచేయడం లేదని సిబ్బంది చెప్పడంత వెంటనే కొత్త యంత్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. విధులు నిర్వహించే సిబ్బంది హాజరుపట్టీని పరిశీలించి ఆస్పత్రి ప్రాంగణంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. జరుగుతున్న డ్రైనేజీ పనులను వారం లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్యాజువాలిటీ వార్డును మరో చోటికి తరలించాలని, సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్‌అండ్‌బి అధికారులు, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి సహకారం

ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



**ప్రజాపక్షం/వైరా :** వైరా మండలం గొల్లపూడి గ్రామ సమీపంలో పులిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో జరిగిన కళ్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ స్వామి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని స్వామి వారిని కోరుకున్నానని తెలిపారు. కార్యక్రమంలో పొదిల హరినాథ్, షేక్ సైదా, సూరంపల్లి రామారావు, పమ్మి అశోక్, ఫణితి శ్రీను, పల్లపు కొండలు, మేదూరి రామారావు, మిట్టపల్లి సతీష్, పెండ్యాల కోటేశ్వరరావు, గూడపాటి చిట్టి, శీలం నాగిరెడ్డి, వెంకటేశ్వరరావు, డ్వాక్రా మహిళలు, ఆలయ ఇఒ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పథకాల అమలుపై సన్నాహక సమావేశం



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండల కేంద్రంలో గల రైతు వేదిక వద్ద రైతు భరోసా, రేషన్ కార్డ్స్, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు పథకాల అమలుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి ఎం రమేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా చూడాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో రేవతి, తహసీల్దార్ జి పుల్లారావు, ఏఓ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

**బోనకల్:** ప్రభుత్వం అందించే పథకాలన్నీ అర్హులైన పేదలందరికీ అందిస్తామని అనిశెట్టి తహసీల్దార్ పున్నంచందర్, ఎంపిడిఓ రురావత్ రమాదేవిలు తెలిపారు. మండలంలో రైతువేదికలో లబ్దిదారుల ప్రక్రియ చేపట్టేందుకు సన్నాహక సమావేశం జరిగింది. సమావేశంలో ఎంపిఓ వివిఎస్ శాస్త్రి, మిట్టపల్లి రవికుమార్, బిఉపేందర్, ఆర్ఐ లక్ష్మణ్, ఏపిఎం కట్టా సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష



**ప్రజాపక్షం/వైరా:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కొత్త రేషన్‌కార్డుల జారీ అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ళు పథకం గురించి మండల స్థాయిలో గ్రామపంచాయతీ సెక్రటరీలకు, రెవెన్యూ అధికారులకు, వ్యవసాయశాఖ అధికారులకు ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందికి వైరా రైతువేదికలో మండల ప్రత్యేక అధికారి కస్తాల సత్యనారాయణ, మండల తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మంజుఖాన్, మండల ప్రజాపరిషత్ అధికారి సరస్వతి, అదేవిధంగా మున్సిపాల్ కమీషనర్ వేణు, ఏపివో అనురాధ, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు సైదులు, వెంకటనర్సయ్య, వాసంతి, కీర్తి, రాజేష్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, ఐకెపి సిబ్బంది, మున్సిపాల్ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

# యువతలో ఉత్సాహం నింపేది క్రీడలే

మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య



**ప్రజాపక్షం/కారేపల్లి :** క్రీడలతో ఐక్యత, స్నేహం, మానసిక ఉల్లాసం, సుహృద్భావ వాతావరణం, ఆత్మీయత పెరుగుతాయని, యువతలో ఉత్సాహం నింపేది క్రీడలేనని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య అన్నారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పివైఎల్‌పిఓడబ్ల్యూ, పిడిఎస్‌యు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సింగరేణి మండలం గ్రామంలో యువతీ యువకులను ఉత్సాహపరిచేందుకు సంక్రాంతి సందర్భంగా గ్రామీణ క్రీడలు ముగ్గులు, శంషా నిమ్మకాయ, కుండ కొట్టుడు పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రజాపంథా మండల కార్యదర్శి గుమ్మడి సందీప్ అధ్యక్షతన జరిగిన సభలో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈసందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామీణ క్రీడలు ముగ్గుల పోటీలు, నిమ్మకాయ శంషా ఆట డాన్స్ పోటీలు నిర్వహించడం వలన యువతి యువకుల్లో ఐక్యత, స్నేహం, సుహృద్భావ వాతావరణం, మానసిక ఉల్లాసం, ఆత్మీయత పెరుగుతాయన్నారు. కనుమరుగు అవుతున్న గ్రామీణ క్రీడలను వెలికి తీసేందుకు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పిఓడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ శిరోమణి, మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి టి ఝాన్సీ, పివైఎల్ జిల్లా కార్యదర్శి ఎన్‌వి రాకేష్, పిఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి, నాయకులు కాంపాటి పృథ్వీ గుమ్మడి పవిత్ర, గుమ్మడి పాపారావు, గుమ్మడి సమ్మయ్య, బిక్కసాని భాస్కర్, రంగ్య వెంకన్న, సూర్యపాక అనసూయ, సరోజిని, ధరావత్ సక్రు, రామారావు, కనకరాజు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# ఈ పథకాలకు అర్హులు ఎవరో?

ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై ఉత్కంఠ

లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ మరక



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26వ తేదీ రిపబ్లిక్ డే నుండి నాలుగు పథకాలను నూతనంగా అమలు చేయనుంది. దీనికి సంబంధించి లబ్దిదారుల ఎంపికలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులకు సంబంధించి లబ్దిదారుల ఎంపికకు రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని అధికారులకు అప్పగించారు. రైతు భరోసాకు సంబంధించి సాగుకు యోగ్యమైన భూమి , సాగుకు యోగ్యం కాని భూముల వివరాలను స్వీకరిస్తున్నారు. ఈనెల 18 నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. రెవెన్యూ గ్రామంలో భూమి ఎంత, అందులో సాగుకు అనుకూలమైన భూమి ఎంత ఉంది, రెవెన్యూ గ్రామ పరిధిలో ఎన్ని గ్రామాలు ఉన్నాయో ఆ గ్రామాల వారీగా పాసుపుస్తకాలను విడగొట్టి గ్రామ సభలను నిర్వహించనున్నారు. క్షేత్ర స్థాయి నివేదికలపై తహసీల్దార్లు, ఇతర ఉన్నతాధికారులు చర్చించి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టనున్నారు. రైతు భరోసా క్రింద రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ. 12వేల చొప్పున ప్రతి ఏడాది రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. ఇందుకు సంబంధించి ఈనెల 21, 22 తేదీల్లో గ్రామసభలు నిర్వహించి గ్రామసభల్లోనే లబ్దిదారులను ప్రకటించనున్నారు. ఇందిరమ్మ భరోసాపైనే ఉత్కంఠ నెలకొంది. అసలు భూమి లేని జాతీయ ఉపాధి హామీ పథకం కార్డు కలిగిన నిరుపేదలు ఎంత మంది ఉన్నారనేది మూడు రోజుల పాటు జరిగే సర్వేలో తేల్చనున్నారు. అసలు భూమి లేకుండా ఉండి గడిచిన ఏడాదిలో కనీసం 20 రోజులు జాతీయ ఉపాధి హామీ పథకం పనికి వెళ్లినట్లు రికార్డుల్లో ఉండి ఉంటే వారిని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి లబ్దిదారులుగా ఎంపిక చేయనున్నారు. జాబ్ కార్డులో భూమి ఉన్నట్లు నమోదైనా, జాబ్ కార్డుల్లో ఉన్న పేరులో ఏ ఒక్కరి పేర భూమి ఉన్నట్లు తేలినా ఆ కుటుంబానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తించదు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి నిరుపేద నుంచి ఎంపిక మొదలు కావాలని ప్రభుత్వ ఆదేశాలు చెబుతున్నప్పటికీ గ్రామాల్లో పరిస్థితి ఆవిధంగా లేదని లబ్దిదారుల ఎంపికకు రాజకీయ మరక అంటుకుంటుందని ఆశావాహులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా గ్రామాల్లో లబ్దిదారుల ఎంపికకు సంబంధించి రాజకీయ పార్టీల నిర్ణయాలే లబ్దిదారుల ఎంపికలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని ఆరోపణలు వినవస్తున్నాయి. ఇదే విషయమై సంబంధిత మంత్రిని కొందరు గిరిజనులు ప్రశ్నించిన విషయం కూడా విధితమే. మొత్తంగా ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపిక అధికార యంత్రాంగానికి రాజకీయ జోక్యంతో తలనొప్పిగా మారే అవకాశం ఉంది. అయితే గ్రామసభల్లో లబ్దిదారుల ఎంపిక గ్రామ సభ నిర్వహణ మొత్తాన్ని వీడియో తీయాలని ఆదేశించిన నేపథ్యంలో వీడియోల ఆధారంగా లబ్దిదారుల జాబితాలో మార్పు లు, చేర్పులు జరిగితే అధికారులను నిలదీసే అవకాశం ఉంది. ఇది గందర గోళానికి దారి తీసే అవకాశం కూడా ఉంది. రేషన్ కార్డులకు సంబంధించి ప్రజాపాలనలో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హులైన వారికి రేషన్ కార్డులను మంజూరు చేయనున్నారు. గడిచిన పది పదిహేనేళ్లుగా రాష్ట్రంలో నూతన కార్డులను జారీ చేయలేదు. వివాహమై కుటుంబం నుంచి వేరు పడిన వారు దరఖాస్తుదారుల్లో ఎక్కువగా ఉన్నారు. మొత్తంగా 15 రోజులుగా అధికార యంత్రాంగం లబ్దిదారుల ఎంపికలో తలమునకలైంది. గ్రామ పంచాయతీ కార్యదర్శులు మొదలు ఉన్నతాధికారుల వరకు ఇదే పనిలో ఉన్నారు. మరో పక్క గ్రామ పంచాయతీ బ్యాలెట్ల ముద్రణ కార్యక్రమాలతో అధికారులు సతమతమవుతున్నారు.

## ప్రజలకు వారధిగా ప్రజాపక్షం...



**ప్రజాపక్షం/బోథ్:** ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ప్రజాపక్షం దినపత్రిక తన వారసత్వాన్ని కొనసాగిస్తూ ముందుకు కొనసాగుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో ప్రజాపక్షం దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో లోపాలను ప్రజలకు ప్రభుత్వం చేయవలసిన పనులను పత్రికలు వార్తలుగా రాస్తు ప్రజాపక్షం పత్రిక ముందుకు కొనుగుతుందని అన్నారు. బడుగు బలహీన వర్గాల పక్షపాతిగా వారి అభివృద్ధి కోసం ప్రజాపక్షం దినపత్రిక మన వార్తల ద్వారా కేంద్ర, రాష్ట్ర దృష్టికి తీసుకువెళుతున్న కృషి అభినందనీయమని అన్నారు. ఇదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ పత్రిక ఉన్నత స్థానానికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

## వాహనదారులు నిబంధనలు పాటించాలి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** వాహనదారులు నిబంధనలు పాటించాలని సిఐ రవీందర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో వాహనాల తనిఖీలలో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, రాంగ్ రూట్, హెల్మెట్ ధరించని 50 వాహనాలతో పాటు వాహదారులను పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా సిఐ రవీందర్ మాట్లాడుతూ వాహన దారులు రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనానికి సంబంధించిన పత్రాలు వ్యాలిడిటీ కలిగి ఉండాలన్నారు. రాంగ్ రూట్ వెళ్లడం వల్ల ప్రమాదాలు సంభవిస్తాయని తద్వారా కుటుంబాలు వీధిన పడే అవకాశం ఉంటుందని తెలిపారు. ద్విచక్ర వాహన దారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహన చోదకులు డ్రైవింగ్ పై కనీస అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు ఎమ్మెల్సీ కవితకు లేదు...



**ప్రజాపక్షం/బాన్సువాడ:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రైతులకు రెండు లక్షల రుణమాఫీతో పాటు సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు 500 బోనస్ కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని కాంగ్రెస్ నాయకులు యలమంచిలి శ్రీనివాస్ రావు, పాత బాలకృష్ణ అన్నారు. వర్ని మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత బాన్సువాడకు వచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఆమె చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తగిన బుద్ధిచెప్తారన్నారు. ఎమ్మెల్సీగా గెలిచిన నాటినుండి బాన్సువాడ నియోజకవర్గానికి ఎన్నిసార్లు వచ్చారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు సంక్షేమ ఫలాలతో పాటు అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కిషోర్ యాదవ్, నందు పటేల్, మంత్రి గణేష్, సాయిబు యాదవ్, నవీన్‌రెడ్డి, తదితరులున్నారు.

## దీర్ఘకాలిక సెలవుల్లోకి ఎస్ఐ



**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ కమీషనర్ పరిధిలోని ఎడపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై వంశీకృష్ణ రెడ్డి లాంగ్‌లీవ్ పెట్టి వెళ్లినట్లు పోలీస్ స్టేషన్ సిబ్బంది తెలిపారు. గత మూడు రోజుల నుంచి ఆయన విధులకు హాజరు కావడం లేదు. వ్యక్తిగత అనారోగ్య కారణాలతో నెల రోజుల పాటు సెలవులపై వెళ్తున్నట్లు ఉన్నతాధికారులకు తెలిపినట్లు సమాచారం. తిరిగి ఆయన విధుల్లో చేరుతారో లేదో అనేది సందిగ్ధంలో ఉంది.

## రోడ్డు భద్రత, సీజనల్ వ్యాధులపై కళాజాత బృందం



**ప్రజాపక్షం/దండేపలి:** జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా దండేపల్లి మండలం తాళ్ళపేట గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులందరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని, వేగాన్ని అదుపులో ఉంచి వాహనాలు నడపాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని, సురక్షితమైన గమ్యాన్ని చేరుకోవాలని ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మండలంలోని దండేపల్లి, చింతపల్లి, రెబ్బెనపల్లి గ్రామాలలో సీజనల్ వ్యాధుల పట్ల, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు బృందంచే అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తగా ఉండాలని, ఈగలు, దోమలు లేకుండా పరిసరాల పరిశుభ్రత పై పాటిస్తూ మలేరియా, డెంగ్యూ, మెదడువాపు, మొదలైన వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కళాకారుల మాటా పాట ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, కళాకారులు లావుడ్యా రమేష్, గుడిసెల కృష్ణ, సల్లూరి కృష్ణ, కాసిపేట సంతోష్ మామిళ్ళ లచ్చన్న, దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సతీష్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 17న ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

**ప్రజాపక్షం/కాసిపేట :** మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై 17 విడత సామాజిక ప్రజా వేదికను 17వ తేదీ శుక్రవారం రోజున ఉదయం 7:30 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఒ సత్యనారాయణ సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీలో ఏప్రిల్ 2023 నుండి మార్చ్ 2024 వరకు చేపట్టిన పనులను సామాజిక తనిఖీ బృందాలు 2/1/25 నుండి 09/01/2025 వరకు తనిఖీలు చేపట్టడం జరిగిందని, అట్టి పనులపై తుది నివేదికలపై చర్చ జరుగుతుందని, పంచాయితీ కార్యదర్శులు, అధికారులు ప్రజాప్రతినిధులు, ఉపాధి కూలీలు పాల్గొనాలని ఈ సందర్భంగా ఎంపిడిఒ కోరారు.

# సంక్షేమ పథకాల అర్హుల జాబితాను రూపొందించాలి

### కలెక్టర్ వెంకటేష్ దోత్రే



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** ప్రభుత్వ సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి గ్రామ సభల ద్వారా అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం. డేవిడ్ లతో కలిసి మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, జిల్లా అధికారులతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాల అమలు ద్వారా జిల్లాలోని అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పథకాల ఫలాలు అందేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం ఈనెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమలు చేస్తున్న పథకాలలో అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించడంలో అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల కొరకు వచ్చిన దరఖాస్తుల సంబంధిత దరఖాస్తుదారులలో అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు ఈనెల 16వ తేదీ నుండి 19వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి జాబితాను రూపొందించాలని తెలిపారు. ఈ నెల 21, 22 తేదీలలో గ్రామసభలో జాబితా ఆమోదం ద్వారా అర్హుల జాబితాను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందించాలని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద అర్హులైన కుటుంబానికి సంవత్సరానికి 12 వేల రూపాయలు, మొదటి విడతగా 6వేల రూపాయలు అందించడం జరుగుతుందని, భూమిలేని నిరుపేదలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజుల పాటు పని దినాలు ఉన్న వారి వివరాలతో అర్హుల జాబితా రూపొందించాలని, ఉపాధి హామీ కూలీల ఆధార్ కార్డును అనుసంధానం చేయడం జరిగిందని తెలిపారు. రైతు భరోసా పథకానికి అర్హులైన వారి జాబితా తయారు చేయాలని, ఎట్టి పరిస్థితులలో సాగుకు యోగ్యం కానీ భూములు, గుట్టలు, నివాసాలు కలిగిన ఇతర భూములు, వెంచర్లు, భూ సేకరణ క్రింద తీసుకున్న సింగరేణి, సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కాలువలు, రైల్వే లైన్, రహదారుల కొరకు తీసుకున్న భూముల వివరాలు జాబితాలో తీసుకోకూడదని తెలిపారు. రేషన్ కార్డుల కొరకు వచ్చిన దరఖాస్తుదారుల పూర్తి వివరాలను నమోదు చేయాలని, గ్రామీణ ప్రాంతాలలో ఉన్నవారి వార్షిక ఆదాయం 1 లక్ష 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షల రూపాయలకు మించి ఉండకూడదని తెలిపారు. రేషన్ కార్డుల కొరకు పేర్ల తొలగింపులు, చేర్పులు, నూతన కార్డుల కొరకు అర్హత గల వారి జాబితాను రూపొందించాలని, వారి ఆదాయ వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియ జిల్లాలో 97 శాతం పూర్తి అయిందని, మిగతా వారి వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రికి గౌడ నేతల సంక్రాంతి శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/గజ్వేల్:** రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బుధవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో వర్గల్ మండల గౌరారం గౌడ సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించి మిఠాయి తినిపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహన్, నాయకులు పల్లె బాల్ నర్సయ్య గౌడ్, తాళ్ళ బాను ప్రసాద్ గౌడ్, గుండు నర్సింలు గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## నిధులు మంజూరు చేయాలని వినతి



**ప్రజాపక్షం/లక్షెట్టిపేట:**పట్టణంలో అసంపూర్తిగా మిగిలిన డా. బిఆర్ అంబేద్కర్ విజ్ఞాన భవన్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతూ మంగళవారం రాత్రి ఎంఎల్ఎ ప్రేమ్‌సాగర్ రావుకు అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు ముల్కల రాందాస్, ప్రధాన కార్యదర్శి బైరం రవి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం నుంచి అంబేద్కర్ భవన్ కు ఎలాంటి నిధులు అందలేదని, సభ్యులు సహకారంతో కొంత వరకు నిర్మాణం పూర్తి చేసుకుని అలాగే వదిలేయడం జరిగిందన్నారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న భవనానికి తగిన ప్రోత్సాహం, ఆర్థిక సహకారం లేకపోవడంతో ఏళ్ల తరబడి అలాగే ఉండిపోతుందన్నారు. దళిత, బహుజనుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మండలంలో సంఘం కార్యక్రమాలకు అందుబాటు లోకి తీసుకురావాలంటే రూ. 15 లక్షల నిధులు అవసరమవుతాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన మంచిర్యాల ఎంఎల్ఎ ప్రేమ్ సాగర్ రావు వెంటనే చర్యలు చేపట్టనున్నట్లు సంఘం సభ్యులకు తెలిపారు. అంబేద్కర్ విజ్ఞాన భవన్ నిర్మాణానికి తమ పూర్తి సహకారం ఉంటుందన్నారు. అంతేకాకుండా ఇంకా ఎలాంటి సహాయానికైనా ఎల్లప్పుడూ తమను సంప్రదించవచ్చని తెలిపారు. ఎంఎల్ఎను కలిసిన వారిలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు శనిగారపు లింగన్న, దొంత నర్సయ్య, దేవేందర్, జనార్దన్, రవీందర్, రవీందర్, పెండెం సత్తన్న, రాజు, వేముల ప్రేమ్ సాగర్, బన్న శ్రీనివాస్, సమ్మయ్య, బోనగిరి కుమార్ తదితరులు ఉన్నారు.

## భీమ్‌గల్ సిఐ, ఎస్ఐలపై విచారణ పూర్తి

### మల్టీజోన్ 1 ఐజికి రిపోర్టు




**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన వరుస సంఘటనల నేపథ్యంలో భీమ్‌గల్ సిఐపై ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. భార్య,భర్తల అదనపు కట్నం కేసులో బాధితుడి సెల్ఫీ వీడియో విడుదల, ఇద్దరు భార్య ఉన్న ఓ నాయకుడు తనపై తన కొడుకు, అల్లుడు దాడికి సిఐ స్వయంగా డబ్బులు తీసుకుని ఉసిగిలిపారన్న ఆరోపణల నేపథ్యంలో జరిగిన సంఘటన గత కొన్ని రోజులుగా వరుస కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ విచారణ జరిపించారు. అందులో భాగంగా ముందుగా సిఐ నవీన్‌ను హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. సంబంధిత విచారణ నివేదికను మల్టీజోన్ 1 ఐజికి రిపోర్టు చేశారు. ఐసి, సిఐపై చర్యలు తీసుకునే అవకాశముంది. భీమ్‌గల్ సిఐ నవీన్, ఎస్సై మహేష్‌లపై వచ్చిన అవినీతి అక్రమాల విచారణ అనంతరం ఎస్సైపై కూడా వేటు ఖాయమంటే వేచి చూడాల్సిందే.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ పరిహారం అందజేత

### కలెక్టర్ కుమార్ దీపక్




**ప్రజాపక్షం/మంచిర్యాల:** జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా మంచిర్యాలవరంగల్‌ఖమ్మంవిజయవాడ జాతీయ రహదారి 163జి నిర్మాణంలో భూములు కోల్పోయిన అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రాజస్వ మండల అధికారి కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణలో బాధితుల కోల్పోయిన వివరాలను మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి 163జి 384 కిలోమీటర్ల మేర ఉంటుందని, రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారి జాబితా ప్రకారం బాధితులకు నష్టపరిహారం చెల్లించడం జరిగిందని, ఆర్బిట్రేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మొదటి జాబితాలో పరిహారం అందని అర్హత గల వారు సంబంధిత పత్రాలు, బ్యాంక్ పాస్ పుస్తకాలతో సంప్రదించినట్లయితే రికార్డులు పరిశీలించి సరిగ్గా ఉన్నట్లు నిర్ధారణ జరిగితే సంబంధిత లబ్దిదారుల నుండి అక్విటెన్సీ తీసుకొని పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, నిర్దేశిత ధరల ప్రకారం పరిహారం చెల్లించడం జరుగుతుందని, నష్టపోయిన వారు ఆలస్యం చేయకుండా త్వరగా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గోడలపై అతికించిన పోస్టర్ల కలకలం...

### బిజెపి నాయకులు, ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఎలా స్పందిస్తారో?

**ప్రజాపక్షం/మాక్లూర్:** ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పనితీరుపై నియోజకవర్గంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది, సోషల్ మీడియా లోనే కాదు, ఏకంగా నియోజకవర్గ వ్యాప్తంగా జనసమీకరణ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో బస్టాండ్, ప్రముఖ దుకాణాల ప్రాంతాల్లో నియోజకవర్గానికి రాకూడదని పోస్టర్లు అతికించారు. మీరు చేసేది ఏమి లేదు ఎన్నికలకు ముందు అడ్డగోలు హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలుచేయకుండా హైదరాబాద్‌కే పరిమితమైన ఎమ్మెల్యే రాకేస్‌రెడ్డి నియోజకవర్గానికి రావొద్దంటూ పోస్టులు సోషల్ మీడియాలో, అలాగే గోడలపై పోస్టర్ల రూపంలో పోస్టులు వైరల్ అవుతున్నాయి. ఎమ్మెల్యే మాటల్లోనే దూకుడుగా కనిపిస్తున్నాడని, అభివృద్ధి పనుల్లో మాత్రం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నాడని నియోజకవర్గ వ్యాప్తంగా చర్చ నడుస్తుంది.

**ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిపై పోస్టర్ల కలకలం...**




ఆర్మూర్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉండి మీరు చేసిందేమి లేదంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మెల్యేను నిలదీస్తూ వైరల్ అవుతున్న గోడలపై గుర్తు తెలియని వ్యక్తులు అతికించిన పోస్టర్లు, సోసల్ మీడియా పోస్టులు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. పైడి రాకేష్ రెడ్డి ఎమ్మెల్యే పదవిలోకి వచ్చి ఏడాది కాలమైనా నియోజకవర్గానికి ఏం చేశారని ప్రశ్నించారు. తన సొంత పనుల కోసమే సమయాన్ని కేటాయిస్తు ప్రజాపాలనను గాలికి వదిలేశాడని విమర్శిస్తున్నారు. అంతేగాక తాను గెలిచిన తరువాత రూపాయికే వైద్యంచేయిస్తానని హామీ ఇచ్చాడని, ఇప్పుడు ఆ ఒక్క రూపాయి వైద్యం ఎటుపోయిందంటూ ప్రశ్నించారు. యువతకు ఉపాధి ఎక్కడ అని, సొంతంగా ఇండ్లు కట్టిస్తానని ఒక్క ఇల్లు కట్టించలేదని, ఉపాధి కోసం నిరుద్యోగ యువకులకు విదేశాలకు పంపుతానని సమాచారం సేకరించి ఏం చేశాడని, హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసానికి ఎవరూ రావద్దంటూ సామాన్యులకు దూరంగా ఉంటున్నాడంటూ గోడలపై పోస్టర్ల రూపంలో పోస్టు చేశారు. ప్రభుత్వ అధికారులతోదురుసు మాటలు, ధనవంతులు తన ఇంటికి రావద్దంటూ పేర్కొంటూ సోసల్ మీడియాల్లో నియోజకవర్గంలో గోడపై అతికించిన స్టిక్కర్ల రూపంలో ప్రశ్నిస్తు తయారుచేసిన పోస్టర్లు చక్కర్లు కొడుతున్నాయి. ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఎలా స్పందిస్తారు అనేది నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. గుర్తు తెలియని వ్యక్తులు గోడలపై అతికించిన రాకేష్ రెడ్డి పోస్టర్లను బిజెపి నాయకులు తొలగించారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని ఎంఎల్ఎ కోవా లక్ష్మి అన్నారు. ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ లో నిర్వహించిన కబడ్డీ పోటీలలో గెలుపొందిన విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో యువత క్రీడల పట్ల ఉత్సాహం చూపడం అభినందనీయమన్నారు. విద్యపై దృష్టి పెట్టి ఉన్నత స్థానంలో నిలవాలని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, మాజీ సర్పంచ్ లక్ష్మి, మాజీ ఎంపిటిసి సావిత్రిబాయి నాయకులు బలరాం, రాజన్న, శివ, మల్లేష్, పాల్గొన్నారు.

## పేదల సంక్షేమానికి పెద్దపీట

### డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్:** పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వర్గల్ మండల కేంద్రంలో రూ 25 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, మాజీ జెడ్పిటిసి ప్రభుదాస్ గౌడ్, మాజీ సర్పంచ్ లక్ష్మీ నారాయణతో కలిసి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు 6 గ్యారంటీలు అమలు చేస్తుండగా, త్వరలోనే అర్హులైన పేదలందరికీ ఇంటి నిర్మాణాలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అన్నదాతను ఆర్థికంగా ప్రోత్సహిస్తుండగా, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు నేరుగా కొనుగోలు చేస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కిందని తెలిపారు. రూ.2 లక్షల పంట రుణమాఫీని ఏకకాలంలో వర్తింపజేసి రైతులను రుణ విముక్తి చేసిన సీఎం రేవంత్ రెడ్డికి రుణపడి ఉండాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.500 కే వంట గ్యాస్ సిలిండర్ పంపిణీ, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ సరఫరా, రూ 5 లక్షల వ్యయంతో ఇంటి నిర్మాణం వంటి సాహసోపేత నిర్ణయాలతో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందుకెళ్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, నాయకులు గజ్వేల్ ప్రవీణ్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బాల్ రెడ్డి, మహేందర్ గౌడ్, కిషన్ గౌడ్, గణేష్, ఎల్లారావు, రమేష్ ముదిరాజ్, సాయిలు పాల్గొన్నారు.

## రైతు భరోసా లబ్ధిదారుల వివరాల సర్వేను పక్కాగా చేపట్టాలి...

**ప్రజాపక్షం/బాన్సువాడ:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే రైతు బరోసా పథకానికి అర్హులైన రైతుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. బుధవారం ఎంపిడివో కార్యాలయంలో డివిజన్ లోని తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు, సర్వేయర్లతో రైతు భరోసా పథకంపై చేపట్టే సర్వేపై సబ్ కలెక్టర్ కిరణ్మయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయాన్ని సాగుచేసే రైతుల వివరాలను మాత్రమే నమోదు చేయాలని, వ్యవసాయేతర భూములు, వెంచర్లు, గుట్టలు సాగుచేయని భూములకు రైతు భరోసా పథకం వర్తించదని, ఉద్యోగులు సర్వేను పక్కాగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు

### కలెక్టర్ క్రాంతి వల్లూరు



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లు ,రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ,నూతన రేషన్ కార్డుల్లో మంజూరు పథకాలు అర్హులైన పేదలకు అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. బుదవారం సంగారెడి కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపిడీఓలు, వ్యవసాయ అధికారుతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు , ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల మంజూరు ఇందిరమ్మ, ఇండ్ల కేటాయింపు తదితర పథకాల లబ్దిదారుల ఎంపికలో ఈ విధమైన పిర్యాదులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సర్వేలో పెండింగ్‌లో ఉన్న లబ్దిదారుల వివరాలు సేకరించి తుది జాబితాను ఖరారు చేయాలని అధికారులకు సూచించారు. గతంలో నిర్మించి లబ్దిదారులకు అందజేయని రెండు పడక గదుల ఇండ్లు వెంటనే లబ్దిదారులకు అందజేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సంపూర్ణ ఇండ్ల నిర్మాణాలకు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రెండు పడక గదుల ఇండ్ల వద్ద అవసరమైన మౌళిక వసతుల కల్పనకు సంబందిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లబ్దిదారుల ఎంపిక పూర్తి పారదర్శకతతో జరిగేలా గ్రామాలు వార్డులలో గ్రామ సభలు నిర్వహించి లబ్దిదారుల వివరాలను చదివి వినిపించి లబ్దిదారులను ఎంపిక చేయాలన్నారు. 2025 జనవరి 26 రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా, ఇందరమ్మ ఆత్మీయ భరోసా , ఇందిరమ్మ ఇండ్లు నూతన రేషన్ కార్డుల అందించే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల విజయవంతం కోసం రెవెన్యూ పంచాయతీరాజ వ్యవసాయశాఖల అధికారుల సమన్వయంతో పని చేయాలన్నారు. లబ్దిదారుల ఎంపికలో ఇలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా మానవతా దృక్పథంతో పథకాల ప్రయోజనాలు పేద ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ వీడియో సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు , చంద్రశేఖర్, మాదురి, పిడి డీఆర్డీఓ జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ ,జడ్పీ సీఈఓ జానకి రెడ్డి, పిడి హౌసింగ్ , చలపతి రావు, రెవెన్యూ డివిజనల్ అధికారులు సంబందిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడ



# టీమిండియా అద్భుత విజయం

ఐర్లాండ్ మహిళల జట్టుతో జరిగిన నిర్ణయాత్మక మూడో వన్డేలో భారత మహిళల జట్టు అద్భుతం చేసింది. ఐర్లాండ్‌ను భారీ తేడాతో ఓడించి వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. ఏకంగా 304 పరుగుల తేడాతో భారీ విజయాన్ని అందుకుంది. పరుగుల పరంగా చూసుకుంటే టీమిండియా అత్యధిక తేడాతో విజయం సాధించిన మ్యాచ్ ఇదే కావడం విశేషం. అంతకుముందు ఐర్లాండ్‌పైనే 2017లో ఏకంగా 249 పరుగుల తేడాతో భారత్ విజయాన్ని అందుకుంది. 436 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఐర్లాండ జట్టు.. 31.4 ఓవర్లలో 131 పరుగులకే కుప్పకూలిపోయింది. సారా (41), ఓర్లా (36) మాత్రం కాస్త రాణించారు. టీమిండియా బౌలర్లలో తనూజా 2, దీప్తి 3, సయాలీ 1, సాధు 1, మిన్ను మని 1 వికెట్ దక్కించుకున్నారు. అంతకుముందు మొదట బ్యాటింగ్ కు దిగిన టీమిండియా 435/5 రికార్డు స్కోరు చేసింది. ప్రతికా రావల్ (154), స్మృతీ మంధాన (135) సెంచరీలతో అద్భుత ప్రదర్శన చేశారు.




**ఛేదనలో మ్యాచ్ సాగిందిలా..**

మూడో వన్డేలో ఏ దశలోనూ కోలుకోనివ్వలేదు భారత బౌలర్లు. 436 పరుగుల కొండంత లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన ఐర్లాండ ను స్వల్ప వ్యవధిలోనే వికెట్లను కోల్పోయేలా చేశారు. కెప్టెన్ గాబీ లూయిస్ (1), కౌల్టర్ (0) మరీ దారుణంగా విఫలమయ్యారు. మరో ఓపెనర్ సారా ఫోరబ్స్ కాసేపు నిలకడ ప్రదర్శన చేసింది. ఓర్లా (36)తో కలిసి మూడో వికెట్‌కు 64 పరుగుల భాగస్వామ్యం నమోదు చేసింది. లారా డెలానీ (10), లేహ్ పాల్ (15), కెల్లీ (2) అంతా చేతులెత్తేశారు.

మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియాలో ఓపెనర్లు స్మృతి మంధాన (135), ప్రతీకా రావల్ (154) ఆది నుంచే దూకుడుగా ఆడి సెంచరీలు నమోదు చేశారు. మొదటి వికెట్‌కు 233 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలో వన్డేల్లో టీమిండియా తరఫున వేగవంతమైన (70 బంతుల్లో) శతకాన్ని బాదింది స్మృతి. మంధాన ఔట్ అవ్వగానే రిచా ఘోష్ (59)తో కలిసి స్కోరును ముందుతీసుకెళ్లింది ప్రతీకా. అనంతరం రిచా కూడా పెవిలియన్ చేరాక తేజల్ (28), హర్లీన్ (15)తో కలిసి ప్రతీకా పరుగులు చేసింది. దీంతో వన్డే చరిత్రలో టీమిండియా తొలిసారి 400+ స్కోరును దాటింది. 435 పరుగులు చేసింది. ఐర్లాండ్ బౌలర్లలో ఓర్లా 2 వికెట్లు పడగొట్టగా, కెల్లీ, ఫ్రేయా, డెంప్సీ తలో వికెట్ దక్కించుకున్నారు.

## తప్పైపోయింది క్షమించండి..

### -రిటైర్మెంట్ పై క్రికెటర్ యూటర్న్



'ప్రపంచం మొత్తం స్వార్థంతో నిండిపోయింది. అంతా స్వార్థపరులే. అసలు క్రికెట్ ప్రపంచంలో నిజాయతీ లేదు.ఇకపై ఎప్పటికీ నేను ఏ ఫ్రాంఛైజీకి ఆడాను. బాయ్ కాట్ చేస్తా. రిటైర్ అయిపోతున్నాను. నేనేంటో దేశవాలీ క్రికెట్ ఆడి చూపిస్తా.' అని ఛాలెంజ్ చేశాడో క్రికెటర్. తీరా కట్ చేస్తే ఒక్కరోజు కూడా కాలేదు ఈ వ్యాఖ్యలు చేసి. అంతలోనే మనుసు మార్చుకున్నాడు సదరు క్రికెటర్. 'నేను తిరిగొచ్చేసా, ఏదో ఫ్లోలో అనేశాం. చెప్పింది చేసేస్తామా ఏంటి' అని అంటున్నాడు ఇప్పుడా క్రికెటర్. అలా తాజాగా తన రిటైర్మెంట్ డెసిషన్ పై యూటర్న్ తీసుకున్నాడు. అతడు మరెవరో కాదు పాకిస్థాన్ పేస్ సెన్సేషన్ ఇహ్సానుల్లా. రీసెంట్ గా జరిగిన పీఎస్ఎల్10 డ్రాఫ్ట్‌లో ఏ ఫ్రాంఛైజీ కూడా తనను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపకపోవడంతో 22 ఏళ్ల ఇహ్సానుల్లా జనవరి 14న ఆవేదనతో పాటు ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇష్టమొచ్చినట్లు పీఎస్ఎల్ ఫ్రాంఛైజీలపై మండిపడ్డాడు. తనకు ఫ్రాంఛైజీల నుంచి సరైన గుర్తింపు, గౌరవం దక్కలేదని.. ఇకపై ఎప్పటికీ పాకిస్థాన్ సూపర్ లీగ్ ఆడనని అన్నాడు. కానీ తాజాగా ఇప్పుడు తన మాటలను వెనక్కితీసుకుంటున్నట్లు పేర్కొన్నాడు ఇహ్సానుల్లా. ఎమోషనల్ లో బాధతో అలా మాట్లాడానని చెప్పిన అతడు, ప్రతిఒక్కరికీ క్షమాపణలు చెప్పాడు.

## జకోవిచ్

### ఆల్‌టైమ్ రికార్డ్



సెర్బియా స్టార్ ప్లేయర్ నొవాక్ జకోవిచ్ మరోసారి అదిరే ప్రదర్శన చేశాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ మూడో రౌండ్‌కు అర్హత సాధించాడు. రెండో రౌండ్‌లో పోర్చుగల్ ప్లేయర్ జైమీ ఫరియాపై విజయం సాధించాడు. 61, 67 (4), 63, 62 తేడాతో గెలుపొందాడు. కాగా, జకోవిచ్ మూడో రౌండ్‌లో థామస్ మచాక్‌తో తలపడనున్నాడు.

**అతడి రికార్డ్ బ్రేక్**


నొవాక్ జకోవిచ్ ఈ క్రమంలోనే 'ఓపెన్ ఎరా' ప్రొఫెషనల్ టెన్నిస్‌లో ఓ అద్భుతమైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇప్పటివరకు టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెద రర్ 429 మ్యాచులు ఆడి.. అత్యధిక మ్యాచ్‌లు ఆడిన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఇప్పుడా రికార్డును జకోవిచ్ బ్రేక్ చేశాడు. ఫెదరర్ 429 మ్యా చులు ఆడితే.. జకోవిచ్ తాజాగా 430 మ్యాచ్‌లు కంప్లీట్ చేసుకున్నాడు. కాగా, ఇప్పటివరకు జకోవిచ్ 24 గ్రాండ్‌స్లామ్‌లను టైటిల్ ను ముద్దాడు. ఇందులో 10 ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్స్ ఉండగా, 3 ఫ్రెంచ్ ఓపెన్, 7 వింబుల్డెన్, 4 యూఎస్ ఓపెన్‌లు కూడా ఉన్నాయి. ఈ సారి ఎలాగైనా మళ్లీ విజయం సాధించి కెరీర్ లో 25వ గ్రాండ్ స్లామ్ టైటిల్ ను ఖాతాలో వేసుకోవాలని పట్టుదలతో ఉన్నాడు జకోవిచ్.

# రీల్

## కియారా ఆశలన్నీ ఎన్టీఆర్‌పైనే..



బాలీవుడ్‌లో సూపర్ సక్సెస్‌ఫుల్ బ్యూటీగా తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను క్రియేట్ చేసుకుంది అందాల భామ కియారా అద్వానీ. ఈ బ్యూటీ టాలీవుడ్‌లోనూ పలు సినిమాలు చేస్తూ దూసుకెళ్తోంది. ఇప్పటికే మహేష్ బాబు, రామ్ చరణ్ సరసన హీరోయిన్‌గా నటించిన ఈ బ్యూటీ తాజాగా 'గేమ్ ఛేంజర్' మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే, ఈ సినిమా అనుకున్న స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోవడంతో కియారా మరోసారి టాలీవుడ్ ప్రేక్షకుల్లో హిట్ కొట్టలేక పోయిందనే ముద్ర వేసుకుంది. దీంతో అమ్మడు తన నెక్స్ట్ మూవీపైనే అంచనాలు పెట్టుకుంది. అలా అని, కియారా నటించే నెక్స్ట్ మూవీ స్ట్రెయిట్ తెలుగు మూవీ కాదు. బాలీవుడ్‌లో తెరకెక్కుతున్న 'వార్2' మూవీలో మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ నటిస్తుం డటంతో ఈ సిని మాతోనైనా కియారా మరోసారి టాలీవుడ్ ప్రేక్షకులకు దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తోంది. మరి ఈ సినిమాతోనైనా కియారా ఆశ నెరవేరుతుందా అనేది చూడాలి.




## జైలర్ 2.. మళ్లీ అతడే హైలైట్!

కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా నటించిన చిత్రాల్లో సెన్సేషనల్ హిట్ సినిమా జైలర్ కూడా ఒకటి. గత 2023లో రిలీజ్ అయ్యిన ఈ చిత్రం తమిళ్ సహా తెలుగులో కూడా భారీ వసూళ్లు సాధించి అదరగొట్టింది. అయితే అయితే ఈ సినిమాకి సీక్వెల్ కోసం ఎప్పుడు నుంచో అభిమానులు ఎదురు చూస్తుండగా లేటెస్ట్ గా పండుగ కానుకగా అయితే ఈ బ్లాస్టింగ్ అప్డేట్ ని మేకర్స్ ఇచ్చేసారు. అయితే ఈ సినిమా అనౌన్సమెంట్ టీజర్ తోనే హైప్ నెక్స్ట్ లెవెల్ కి వెళ్ళిపోయింది. అయితే ఇందులో దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ విజన్ తో పాటుగా తలైవర్ గాడ్ లెవెల్ ప్రెజెన్స్ ఓ రేంజ్ లో హైలైట్ అయితే వీటికి మించి మళ్లీ సంగీత దర్శకుడు అనిరుద్ ఇచ్చిన బ్లాక్ బస్టర్ బ్యాగ్రౌండ్ స్కోర్ ఈ టీజర్ ని ఇంకో లెవెల్ కి తీసుకెళ్లుపోయింది. దీనితో ఈ స్కోర్ కోసం అనిరుద్ కోసం అప్పుడు జైలర్ సమయంలో ఎంత టాపిక్ గా నిలిచిందో మళ్లీ అంతే రేంజ్ లో అనిరుద్ వర్క్ కోసం వినిపిస్తోంది. మొత్తానికి మళ్లీ అనిరుద్ తాండవం వైరల్ అవుతుంది అని చెప్పాలి.


## డాకు మహారాజ్ 3 రోజుల వసూళ్లు ఎంతంటే!




నందమూరి నటసింహం ఇపుడు టాలీవుడ్ గాడ్ ఆఫ్ మాసెస్ బాలకృష్ణ హీరోగా నటించిన లేటెస్ట్ చిత్రమే డాకు మహారాజ్. దర్శకుడు కొల్లి బాబీ తెరకెక్కించిన ఈ సెన్సేషనల్ ప్రాజెక్ట్ పై మొదటి నుంచి కూడా మంచి అంచనాలు నెలకొనగా రిలీజ్ అయ్యాక వాటిని అందుకునే రేంజ్ టాక్ సహా బాలయ్య కెరీర్ లో రికార్డు ఓపెనింగ్స్ ని ఈ చిత్రం అందుకుంది.ఇలా మొత్తం మూడు రోజుల రన్ ని ఈ చిత్రం పూర్తి చేసుకోగా ఈ మూడు రోజులో భారీ నంబర్స్ ని డాకు మహారాజ్ అందుకోవడం జరిగింది. అయితే మేకర్స్ చెబుతున్న అఫీషియల్ నెంబర్ ప్రకారం డాకు మహారాజ్ కేవలం మూడు రోజుల్లోనే 92 కోట్లకి పైగా గ్రాస్ ని అందుకొని నాలుగో రోజు వసూళ్లతో 100 కోట్ల క్లబ్ లోకి చేరబోతోంది. దీనితో బాలయ్య కెరీర్ లో మరో 100 కోట్ల సినిమాగా ఇది నిలవనుంది అని చెప్పాలి. ఇక ఈ సినిమాలో ప్రగ్యా జైస్వాల్, ఊర్వశి రౌతేలా అలాగే శ్రద్ధా శ్రీనాథ్ తదితరులు నటించగా థమన్ సంగీతం అందించాడు.

# ఉక్రేన్ కీలక భవనాలు ధ్వంసం

### పోలాండ్ సరిహద్దులో రష్యా భీకరదాడి




**వార్సా:** ఉక్రేన్‌కు చెందిన కీలక భవనాలను రష్యా ధ్వంసం చేసింది. ఈ మేరకు పోలాండ్ సరిహద్దుల్లో ఉన్న భవనాలపై బాంబులతో విరుచుకుపడింది. కీలకమైన గ్యాస్, ఎరువుల సరఫరా కేంద్రాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్లు తెలిసింది. మాస్కోకు చెందిన ఏడు టీయూ22, ఆరు టీయూ95 స్ట్రాటజిక్ బాంబర్లు దాడుల్లో పాల్గొన్నాయి. పోలాండ్ సరిహద్దుకు అత్యంత సమీపంలో రష్యా క్షిపణులు పడ్డాయి. దీంతో నాటో దళాలు అప్రమత్తమయ్యాయి. వెంటనే ఫైటర్ జెట్ విమానాలు గాల్లోకి ఎగిరాయి. నేలపై ఉన్న ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు అప్రమత్తమయ్యాయని నాటో ఆపరేషనల్ కమాండ్ ప్రధాన కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. రష్యాపై ఉక్రెయిన్ చేసిన దాడికి ప్రతీకారంగానే ఈ దాడి చోటు చేసుకున్నట్లు రక్షణ నిపుణులు అంచనావేస్తున్నారు. ముఖ్యంగా బ్రిటన్ తయారీ స్ట్రామ్ షాడో, అమెరికా తయారీ ఏటీఏసీఎంఎస్‌లను ఉక్రెయిన్ వాడుతుండటంతో రష్యా దళాలు ఇబ్బంది పడుతున్నాయి. మంగళవారం దాదాపు 14 క్షిపణులు, 200 డ్రోన్లతో ఉక్రెయిన్ దళాలు రష్యాపై విరుచుకుపడ్డాయి. కెమికల్ ఫ్యాక్టరీలు, విద్యుత్తు కేంద్రాలను లక్ష్యంగా చేసుకొన్నాయి. కాగా తాము 2 మిలియన్‌డాలర్ల విలువైన స్ట్రామ్ షాడో క్షిపణులను కూల్చేసినట్లు రష్యా ప్రకటించింది.

**రష్యా క్షిపణుల్ని కూల్చివేశాం: జెలెన్‌స్కీ**

రష్యా ప్రయోగించిన మొత్తం 40 క్షిపణుల్లో ఉక్రెయిన్ ఎయిర్‌డిఫెన్స్ వ్యవస్థలు 30ని నేల కూల్చినట్లు ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. వీటికి అదనంగా మరో 70 అటాక్ డ్రోన్లు కూడా దాడి చేశాయన్నారు. నాటో సదస్సులో మిత్ర దేశాలు ఇచ్చిన హామీలు ఇంకా కొన్ని అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. ఎయిర్ డిఫెన్స్‌ల సరఫరాను వేగవంతం చేయాలని కోరారు.

## చంద్రుడిపైకి రెండు లూనార్ ల్యాండర్లు



**వాషింగ్టన్:** అమెరికాలోని స్పేస్ ఎక్స్ సంస్థ చంద్రుడిపై పరిశోధనలకు గాను బుధవారం బ్లూ ఘోస్ట్1, హకుటోఆర్2 పేరిట రెండు ల్యాండర్లను నింగిలోకి పంపింది. ఈ రెండూ మరింత వేగంగా చంద్ర మండలానికి చేరనున్నాయి. ఆ సంస్థకు చెందిన ఫాల్కన్ 9 రాకెట్ జాబిల్లి యాత్రకోసం రెండు ల్యాండర్లను నింగిలోకి పంపింది. ఫ్లోరిడాలోని నాసాకు చెందిన కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ ప్రయోగం జరిగింది. బ్లూఘోస్ట్ ల్యాండర్‌ను ఫైర్‌ఫ్లై ఏరోస్పేస్ సంస్థ నిర్మించింది. హకుటోఆర్ మిషన్ 2ను ఐస్పేస్ నిర్మించాయి. ఈ రెండింటిలోనూ సైంటిఫిక్ పరికరాలు ఉన్నాయి. ఖగోళ అన్వేషణలో సమష్టిగా పనిచేయడంలో ఈ ప్రయోగం ఓ ముందడుగుగా భావిస్తున్నారు. ఈ రెండు ల్యాండర్లు వేర్వేరు దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. నాసా చేపట్టిన కమర్షియల్ లూనార్ పేలోడ్ సర్వీసెస్‌లో ఫైర్‌ఫ్లైకు చెందిన బ్లూ ఘోస్ట్ అత్యంత కీలకమైంది. ఇది చంద్రుడిని చేరడానికి 45 రోజుల సమయం పడుతుందని అంచనా వేశారు. హకుటో ఆర్2ను జపాన్ కంపెనీ ఐస్పేస్ నిర్మించింది. ఇది చంద్రుడిపై ఉత్తర ధ్రువానికి చేరేందుకు నాలుగు నుంచి ఐదు నెలల సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. దీనిలో చంద్రుడిపై నమూనాలు సేకరించేందుకు ప్రత్యేక పరికరాన్ని కూడా ఉంచారు.

## మొట్ట మొదటి మహిళా ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్‌గా కె. పద్మజ



ప్రజాపక్షం / హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ (పిసిఓఎం)గా కె.పద్మజ బుధవారం సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రైల్వేస్ ట్రాఫిక్ సర్వీస్ 1991 బ్యాచ్‌కు చెందిన పద్మజ బ్యాచిలర్ ఆఫ్ సైన్స్, బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో పట్టభద్రులయ్యారు. ఈ నియామకానికి ముందు ఆమె ఎస్‌సిఆర్ ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పిసిసిఎం)గా విధులను నిర్వర్తిస్తూ ఎస్‌సిఆర్ ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ ( పిసిఓఎం)గా అదనపు బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారు. భారతీయ రైల్వేలో 30 ఏళ్లకు పైగా విశిష్టమైన కెరీర్‌లో కె.పద్మజ ఎస్‌సిఆర్ హైదరాబాద్ డివిజన్‌లో అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్‌గా, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ (కోల్, గూడ్స్)గా సికింద్రాబాద్ డివిజన్‌లో, సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్‌గా గుంతకల్లు డివిజన్‌లో, డిప్యూటీ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా పిఆర్ఎస్‌లో, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా సికింద్రాబాద్ డివిజన్‌లో పనిచేశారు. అనంతరం రైల్ నిలయం ప్రధాన కార్యాలయంలో వివిధ ఉన్నత పదవులు నిర్వర్తించారు. గత ఏడాది ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పిసిసిఎం)గా ఆమె పదవీకాలంలో పద్మజ ప్రయాణీకుల, సరకు రవాణా సేవలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా రైలు వినియోగదార్ల సంతృప్తి, ఆదాయాన్ని పొందేలా పద్మజ పర్యవేక్షించారు.

## స్థానిక సమరానికి సన్నద్ధం

(మొదటి పేజీ తరువాయి)

అదనపు జాబితా ఉండే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు అందిన వెంటనే అధికార యంత్రాంగం తమ పని తాము చేసుకుపోతున్నారు. ప్రైవేటు ముద్రణాలయాలలో బ్యాలెట్లను ముద్రిస్తున్నారు. పంచాయతీ సర్పంచ్ అభ్యర్థులకు పింక్ కలర్ బ్యాలెట్‌ను, వార్డులకు సంబంధించి తెలుపు రంగు బ్యాలెట్‌ను ముద్రిస్తున్నట్లు సమాచారం. ఖమ్మం జిల్లాలో 589 గ్రామ పంచాయతీలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 479 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధమవుతుంది. ఇటీవల కాలంలో కొన్ని గ్రామ పంచాయతీలను నూతనంగా ఏర్పాటు చేయగా ఖమ్మంజిల్లాలో కొన్ని గ్రామ పంచాయతీలను కలిపి ఏదులాపురం మున్సిపాలిటీని ఏర్పాటు చేశారు. కొత్తగూడెం కార్పోరేషన్ ఏర్పాటుతో కొన్ని గ్రామ పంచాయతీలు కార్పోరేషన్‌లో విలీనమయ్యే అవకాశం ఉంది. అధికార యంత్రాంగం ఏర్పాట్లలో ఉండగా రాజకీయ పార్టీలు క్యాడర్‌ను సమాయత్తం చేస్తున్నాయి. శాసన సభ, పార్లమెంటు ఎన్నికల తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడం స్థానికంగా గెలిస్తేనే రాజకీయంగా పట్టు ఉంటుందన్న భావన నేతల్లో ఉండడంతో గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహించి గెలుపోటములపై జోరుగా చర్చలు చేస్తున్నారు. ఆర్థిక, అంగ బలమున్న అభ్యర్థులను రంగంలోకి దించేందుకు రాజకీయ పార్టీలు ఆలోచనలు ప్రారంభించాయి. గతంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకున్నది. అప్పుడు కాంగ్రెస్ ప్రాతినిథ్యం వహించిన మధిర, భద్రాచలం నియోజక వర్గాల్లోనూ బిఆర్ఎస్ పార్టీయే ఎక్కువ స్థానాలను కైవసం చేసుకుంది. ఈసారి పరిస్థితి కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉంటుందన్న భావన వ్యక్తమవుతుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడం ఉమ్మడి జిల్లాలో 10 స్థానాల్లో తొమ్మిది స్థానాల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే శాసన సభ్యులుగా ఉండడంతో స్థానిక ఎన్నికల్లో ఫలితాలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. బిఆర్ఎస్ కూడా బలమైన స్థానాల్లో గెలుపొంది తమ పట్టు పోలేదని నిరూపించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నప్పటికీ నాయకత్వ స్థాయిలో ఐక్యతను తీసుకు రావడంలో పార్టీ బాధ్యులు విఫలమవుతున్నారన్న అపవాదును మూటకట్టుకుంటున్నారు. వామపక్షాలు తమకు బలమైన స్థానాల్లో పోటీ చేసి మిగిలిన స్థానాల్లో తమ అనుకూలురికి మద్దతు ఇవ్వాలని అదే రీతిలో మద్దతు పొందాలని ఆలోచనలు చేస్తున్నాయి. ఉమ్మడిజిల్లాలో గణనీయమైన బలం కలిగిన వామపక్షాల నిర్ణయం స్థానిక ఎన్నికల్లో కీలకం కానుంది.

రిజర్వేషన్లపై ఉత్కంఠ :

గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాల రిజర్వేషన్‌కు సంబంధించి తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గత ప్రభుత్వం 2018 పంచాయతీరాజ్ చట్టం సవరణ ప్రకారం ఒక రిజర్వేషన్‌ను రెండు పర్యాయాలు కొనసాగే విధంగా చట్టం చేసింది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ చట్టాన్ని సవరించడంతో గ్రామ పంచాయతీలు ఎంపిటిసిలకు సంబంధించి రిజర్వేషన్ మారనుంది. రిజర్వేషన్ తేలితే తప్ప అభ్యర్థుల ఎంపిక పూర్తయ్యే అవకాశం లేదు. ఏ వర్గానికి రిజర్వేషన్ వస్తుందో ఆ వర్గంలో ఉన్న ప్రధాన అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉండడంతో రాజకీయ పార్టీలు రిజర్వేషన్ల ప్రకటన కోసం ఎదురు చూస్తున్నాయి. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బిసిలకు కేటాయించే స్థానాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అది ఏ మేరకు పెంచుతారు ఎలా అన్న దానిపై స్పష్టత లేదు. మొత్తంగా రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయితే స్థానిక సమరం మరింత వేడేక్కే అవకాశం ఉంది. గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసిన వెంటనే ఎంపిటిసిలు , జెడ్పిటిసిలు, మున్సిపాలిటీలు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఫిబ్రవరి మాసంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పదవి కాలం కూడా పూర్తి కానుంది. వాటికి కూడా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది.

## బంగారు గనుల్లో ఆకలి కేకలు

(మొదటి పేజీ తరువాయి)

పొట్టకూటికోసం అక్రమంగా తవ్వకాలు చేసేందుకు వెళ్ళిన కార్మికులను బయటకు రాకుండా లోపలే ఉండిపోతున్నారు. ప్రభుత్వం ఆహా ర సరఫరా మార్గాలు మూసివేయడంతో కార్మికులు బయటకు రాలేక, బయటకు వస్తే అరెస్టు చేసి హింసిస్తారన్న పోలీసు భయంతో కార్మికులు గనిలోపలే రోజుల తరబడి ఉండిపోవడంతో వారంతా మరణించారు. దక్షిణాఫ్రికా వాయువ్యప్రాంత రాష్ట్రం స్టిల్‌ఫోన్‌టైన్‌లో ఈ గనులు ఉన్నాయి. ఇలాంటి గనులు దక్షిణాఫ్రికాలో అనేక ప్రాంతాలలో ఉన్నాయి. ఈ గనుల్లో అక్రమ తవ్వకాలను ప్రభుత్వం నిషేధించింది. కార్మికులు లోనికి వెళ్ళారని తెలిస్తే గని లోతుల్లోంచి తాళ్ళు పట్టుకుని పైకి పాక్కుంటూ వచ్చే అవకాశాలు లేకుండా చేయడంవల్లనే కార్మికులు లోపలే ఉండిపోయారని కార్మికుల కుటుంబాలు ఆరోపిస్తుండగా, బయటకు వస్తే అరెస్టు చేస్తారన్న భయంతో కార్మికులు రాలేదని ప్రభుత్వం వాదిస్తున్నది. స్టిల్‌ఫోన్‌టైన్ ప్రాంతంలో బంగారు గనులు ఉన్నాయన్న విషయం 1949లో బయటపడిన తర్వాత ఆ ప్రాంతం ఒక పెద్ద పట్టణంగా అభివృద్ధి చెందింది. ఈ పట్టణం చుట్టుపక్కల మొత్తం మూడు అతిపెద్ద బంగారు గనులు ఉన్నాయి. వీటిని హర్టబీస్‌ఫోన్‌టైన్, బఫెల్స్‌ఫోన్‌టైన్, స్టిల్‌ఫోన్‌టైన్ గనులుగా పిలుస్తారు. ఈ స్టిల్‌ఫోన్‌టైన్ గనిలోకి ప్రవేశించాలంటే నిట్టనిలువుగా రెండు కిలోమీటర్లు లోయలోపలికి వెళ్ళాలి. బలమైన తాళ్ళను కప్పీలకు ఏర్పాటుచేసి కార్మికులు లోనికి దిగుతారు. ఈ కప్పీలను తొలగిస్తే కార్మికులు బయటకు వచ్చే అవకాశమే ఉండదు. గనుకల్లోకి అక్రమంగా ప్రవేశించే వారికి పరోక్షశిక్ష విధించేందుకు ప్రభుత్వమే ఈ కప్పీలను తొలగిస్తున్నది.

## పాదయాత్రగా వెళ్లి... కేజ్రీవాల్ నామినేషన్

### అదే దారిలో ప్రధాన ప్రత్యర్థి పర్వేశ్ వర్మ..



**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోలాహలం జోరందుకుంటున్నది. మాజీ ముఖ్యమంత్రి అరవింద కేజ్రీవాల్, రాష్ట్రంలో అధికారం కోసం ఆయనతో తీవ్రంగా పోటీపడుతున్న బిజెపి నేత పర్వేశ్ వర్మ బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఇద్దరూ పాదయాత్రగా జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయానికి వెళ్లడం విశేషం. వీరిద్దరూ న్యూఢిల్లీ అసెబ్లీ స్థానం నుంచి పోటీలో ఉండడం గమనార్హం. భార్య సునీత, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కు చెందిన ఇతర ప్రధాన నేతలతో కలిసి బుధవారం ఉదయం హనుమాన్ దేవాలయానికి, వాల్మీకి మందిరానికి వెళ్లిన కేజ్రీవాల్, ఆ తర్వాత పార్టీ కార్యాలయం నుంచి జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయం వరకూ పాదయాత్ర నిర్వహించారు. అక్కడ రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. అక్కడ ఉన్న మీడియా ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ, పూర్తి మెజారిటీని సాధిస్తామని, మరోసారి ఆప్ ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాగా, బిజెపి అభ్యర్థి పర్వేశ్ వర్మ కూడా తన అనుచరలతో కలిసి ఢిల్లీ జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయానికి పాదయాత్రగా వెళ్లారు. అక్కడ నామినేషన్ పత్రాలు సమర్పించిన తర్వాత ఆయన 'ఎక్స్' వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. తాను నామినేషన్ వేశానని, ప్రజలు తనతోనే ఉన్నారని పేర్కొన్నారు. విజయం తననే వరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇలావుంటే, ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సందీప్ దీక్షిత్ పోటీ పడుతున్నారు. ఇక్కడ 2013 నుంచి తిరుగులేని ఆధిపత్యాన్ని కనబరుస్తూ, వరుస విజయాలు సాధిస్తున్న కేజ్రీవాల్‌కు ఈసారి గట్టిపోటీ తప్పదని పరిశీలకులు అంటున్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో ముద్దాయిగా ఉన్న ఆయన అరెస్టు కావడం, ఆ తర్వాత చోటు చేసుకున్న పలు కీలక పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలగడం తెలిసిందే.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com